www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 7-4-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 352 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.8.01 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పుష్యమి ఉ.6.25 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.8.01-రా.9.43, దుర్ముహూర్తం: మ.12.42-మ.1.31, మ.3.09-మ.3.58, అమృతఘడియలు: ఉ.6.13-ఉ.7.55, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

48 గంటల్లో అల్పపీడనం



పలుచోట్ల పిడుగులు, వడగండ్లతో వర్షాలు

మళ్లీ పెరగనున్న ఎండలు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో ఆదివారం సాయంత్రం కురుస్తున్న వర్షం

3



కాలిఫోర్నియాలోని హంటింగ్‌టన్ బీచ్‌లో ట్రంప్, మస్క్‌లకు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

ట్రంప్ పిచ్చోడు!

నిప్పులు చెరిగిన అమెరికన్లు

ట్రంప్, మస్క్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు

రోడ్డెక్కిన 5 లక్షల మంది ప్రజలు.. 'హ్యాండ్సాఫ్' పేరిట వరదలా వీధుల్లోకి

ట్రంప్ పగ్గాలు చేపట్టిన స్వల్ప కాలంలోనే నిరసన ర్యాలీలు, ధర్నాలు

నిరసనలతో ఒరిగేదేం లేదు.. వైట్‌హౌస్ స్పష్టీకరణ

ట్రంప్ చర్యలతో ప్రపంచీకరణకు ముగింపు.. బ్రిటన్ ప్రభుత్వ అంచనా

వాషింగ్టన్, ఏప్రిల్ 6: అమెరికన్లు కదం తొక్కారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వరదను తలపించేలా నడిరోడ్లపైకి వచ్చి.. హ్యాండ్సాఫ్(జోక్యం వద్దు) పేరుతో భారీ నిరసనలు చేపట్టారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'పిచ్చోడు' అంటూ గేలిచేశారు. ట్రంప్‌తోపాటు డోజ్ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ప్రస్తుతం అమెరికా అధినేత ప్రతీకార సుంకాలకు దిగడంతో దేశవ్యాప్తంగా అన్ని వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. మరోవైపు.. వలస విధానాలు, ప్రభుత్వ ఉద్యోగుల కుదింపు, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం కావడం ఇలా.. అనేక పరిణామాలను నిరసిస్తూ.. లక్షలాది మంది శనివారం రోడ్డెక్కారు. వాస్తవానికి ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అధికార పగ్గాలు

మిగతా 2వ పేజీలో...

యూరప్‌లోనూ నిరసనల హోరు



లాస్‌ఏంజెల్స్‌లో పోటెత్తిన నిరసనకారులు

ఏపీ @ 8.21%

వృద్ధిరేటులో రాష్ట్రానికి రెండో స్థానం



కేంద్ర గణాంకాల శాఖ నివేదిక

రాష్ట్రం గాడిన పడింది

ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్

'ఎక్స్'లో చంద్రబాబు హర్షం

జగన్ హయాంలో వృద్ధి రేటు 6.19 శాతమే

తలసరి ఆదాయంలో మూడో స్థానం

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో జీఎస్‌డీపీ వృద్ధిరేటులోనూ, తలసరి ఆదాయం పెరుగుదలలోనూ రాష్ట్రం విశేషంగా రాణించిందని కేంద్రం వెల్లడించింది. 8.21 శాతం వృద్ధి రేటుతో రాష్ట్రం రెండో స్థానంలో, తలసరి ఆదాయం వృద్ధిలో మూడోస్థానంలో నిలిచినట్లు కేంద్ర గణాంకాలు-కార్యక్రమాల అమలు శాఖ (ఎంవోఎస్‌పీఐ) తెలిపింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం గాడిలో పడిందని, ఆత్మవిశ్వాసం పెంచేలా ఫలితాలు వస్తున్నాయని ఆదివారం 'ఎక్స్'లో తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్' అని వ్యాఖ్యానించారు. కేంద్రం నివేదిక ప్రకారం.. వైసీపీ హయాంలో 2023-24లో వృద్ధిరేటు కేవలం 6.19 శాతమే ఉండగా.. 2024-25లో 8.21 శాతం సాధించి దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఒక్క

మిగతా 11వ పేజీలో...



పాంబన్ బ్రిడ్జిని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

అకారణంగా ఏడుస్తుంటారు!

కొందరికి ఇది అలవాటుగా మారింది.. మనమేం చేయలేం.. స్టాలిన్‌పై మోదీ విమర్శ

తమ హయాంలోనే తమిళనాడుకు ఎక్కువ కేటాయింపులని వెల్లడి

తనకు లేఖలు రాస్తున్న తమిళ నేతలు తమిళంలో సంతకం సైతం చేయడం లేదని ఎద్దేవా

పాంబన్ వంతెనను ప్రారంభించిన ప్రధాని.. తమిళనాడు సీఎం గైర్హాజరు

సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం పాంబన్

వందేళ్ల క్రితం గుజరాతీ బిడ్డ నిర్మించాడు

ఇప్పుడు మళ్లీ గుజరాత్ బిడ్డకు అవకాశం: మోదీ

చెన్నై, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్ కోపై ధ్వజమెత్తారు. అలాగే తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన

మిగతా 2వ పేజీలో...



అయోధ్య రాముడికి 'సూర్య తిలకం'

రామ మందిరంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం

2



అమెరికాతో మాట్లాడండి

రొయ్యలకు సుంకం మినహాయించేలా చూడండి

27% దిగుమతి సుంకంతో ఆక్వాకు నష్టం

ఆక్వా రైతాంగానికి అండగా నిలవాలి

ఏపీ జీడీపీలో మత్స్యరంగం కీలకం

కేంద్ర మంత్రి గోయల్‌కు సీఎం బాబు లేఖ

అమరావతి, బాపట్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఉత్పత్తులపై 27% దిగుమతి సుంకం విధించిన అమెరికా ప్రభుత్వంతో వెంటనే చర్చలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రప్రభుత్వానికి సూచించారు. సుంకాల జాబితా నుంచి రొయ్యల ఉత్పత్తులను వినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర జీడీపీలో మత్స్యరంగం కీలక భూమిక



మిగతా 11వ పేజీలో...

మార్మోగిన 'రామ'తీర్థం

12

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి పట్టువస్త్రాల సమర్పణ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు వేడుకగా ధ్వజారోహణ



విజయనగరం జిల్లా రామతీర్థంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో మంగళసూత్ర ధారణ ఘట్టం



2

సీపీఎం కొత్త సారథి

ఎంఏ బేబీ

మదురైలో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

తొలిసారిగా మైనారిటీ నేతకు పగ్గాలు

పొలిట్‌బ్యూరోలో బీవీ రాఘవులు, అరుణ్‌కుమార్‌లకు చోటు

సీసీలో మరో 9 మంది తెలుగువారు

ఏపీ నుంచి కొత్తగా రమాదేవి, లోకనాథం

దాచాలంటే దాగునులే

వయసు కనపడనివ్వకుండా చేసే మార్గాలెన్నో!

యాంటీ ఏజింగ్ క్రీముల నుంచి.. లేజర్, కణజాల చికిత్సల వరకూ అందుబాటులో..

3 పదుల వయసు దాటిన మహిళల్లో చాలా మంది చూపు ఆయా చికిత్సల వైపు!

మగవారిలో ఎక్కువగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, బొటాక్స్ చికిత్సలు!

రూ.వేల కోట్ల వ్యాపారంగా యాంటీ ఏజింగ్ రంగం

అర్హత లేనివారితో ఈ చికిత్సలు చేయించుకుంటే కష్టాలు కోరితెచ్చుకున్నట్టే.. ప్లాస్టిక్ సర్జన్ల హెచ్చరిక

ఆమె ఓ పేజ్ 3 సెలబ్రిటీ. ఇటీవలే మనవరాలికి ఓణీల ఫంక్షన్ చేసింది. అప్పటిదాకా చాలా మందికి ఆమె వయసు హాఫ్ సెంచరీ దాటిందని తెలియదంటే ఆశ్చర్యమే! ఎందుకంటే ఆమె ముఖంలో చూద్దామన్నా వార్ధక్యపు ఛాయలు కనపడవు. అలా కనపడకుండా ఉండడానికి ఆమె ఏం మాయ చేస్తోంది?

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

మనిషి ఎన్ని సాధించినా తప్పించుకోలేనివి జర (ముసలితనం), మరణం.. అని చాలా మంది ఆధ్యాత్మికవేత్తలు చెబుతుంటారు! రోగం, జర, మరణం ప్రతి ప్రాణికీ తప్పవని తెలుసుకున్నాకే రాజకుమారుడైన సిద్ధార్థుడు తపస్సు చేసి బుద్ధుడయ్యాడు!! కానీ అదంతా గతం. మృత్యువు సంగతి పక్కన పెడితే.. ముసలితనాన్ని కనీసం కొన్నాళ్లపాటయినా జయించి, యవ్వనంగా కనిపించేలా చేసే పరిజ్ఞానాలు

మిగతా 12వ పేజీలో...





గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, నేతల నుంచి పెద్దల వరకూ ఏ వనరునూ, ఏ ఆదాయ మార్గాన్నీ వదలకుండా దోచుకున్నారు. తామేం తక్కువ తిన్నామా అన్నట్టు మేజర్ పంచాయతీల్లో వైసీపీకి చెందిన చాలామంది సర్పంచ్‌లు దోపిడీ చేశారు. రూ.100 కోట్లకు పైగా నిధులు స్వాహా చేసినట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణలో అక్రమాలు బయట పడుతున్నాయి.

పంచాయతీల్లో దొంగలు పడ్డారు!

వైసీపీకి చెందిన సర్పంచ్‌ల 100 కోట్ల స్వాహాపర్వం

100 పంచాయతీల్లో నిధుల దోపిడీ

సొంత వనరుల సొమ్ము గుట్టుగా జేబుల్లోకి

పనులు చేయకుండానే నిధులు డ్రా

అడ్డగోలుగా దొంగ బిల్లుల సమర్పణ

ఇంటి పన్నుల వసూళ్లలోనూ నొక్కుడు

అధికారుల సహకారంతో అక్రమాలు

కూటమి సర్కారు వచ్చాక ఫిర్యాదులు

దోపిడీపై విచారణ.. కమిషనరేట్‌కు నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు నిధులివ్వలేదని, కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించిందని ఓ వైపు సర్పంచ్‌లు పోరాటాలు చేశారు. మరోవైపు మేజర్ పంచాయతీల్లో సొంత వనరుల ద్వారా వచ్చిన నిధులను గుట్టుగా స్వాహా చేసేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సుమారు రూ.కోటికి పైగా ఆదాయం కలిగిన 100 పంచాయతీల్లో స్కామ్‌కు తెరదీసినట్లు సమాచారం. వైసీపీకి చెందిన సర్పంచ్‌లు సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులు దిగమింగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ హయాంలో వారి అవినీతి, అక్రమాలను ప్రశ్నించేందుకు సాహసించలేని

మిగతా 2వ పేజీలో...

మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు

అహ్మద్ బాషా అరెస్టు

ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి

టీడీపీ నేతపై దాడి సహా 6 కేసులు

11

చిన్నారి గొంతు కొరికి చంపిన వీధి కుక్క

గుంటూరులో ఘోరం

3

నేపాల్లో కిడ్నాప్ నిందితులు!

వంశీ ముఖ్య అనుచరుడు

కొమ్మా కోట్లు, మరో ముగ్గురూ అక్కడే

రాత్రి పూట సన్నిహితులకు ఫోన్లు

కేసు వివరాలు, పోలీసు కదలికలపై ఆరా

పసిగట్టిన నిఘా వర్గాలు



11



2

ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

జపాన్, యూకే, ఇటలీ సంయుక్త ప్రాజెక్టులో చేరేందుకు ఆసక్తి

రష్యాకు భారత్ నుంచి రహస్యాలు వెళ్తాయని జపాన్ అనుమానం

నేరాలపై 'డ్రోన్' కన్ను!

ఇప్పటికే బెజవాడ సహా పలుచోట్ల వినియోగం

రాష్ట్రవ్యాప్త విస్తరణకు పోలీసు శాఖ ప్రణాళిక

ట్రాకింగ్, నావిగేషన్, సెన్సర్ల వంటి ఆధునిక సాంకేతికతతో నేరాల కట్టడిలో సహకారం

ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తుల్లోనూ..

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం



3

అయోధ్య రాముడికి 'సూర్య తిలకం'



అయోధ్య, ఏప్రిల్ 6: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం అయోధ్యలోని రామమందిరంలో మనోహర దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. బాలరాముడి నుదుటిపై సూర్య తిలకం ఆవిష్కృతమయింది. మధ్యాహ్నం 12గంటలకు సూర్య కిరణాలు రామ విగ్రహం నుదిటిని తాకాయని, 4నిమిషాల పాటు ఆ దృశ్యం కొనసాగిందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. సూర్యకాంతితో రాముడికి మహా మస్తకాభిషేకం జరిగిందని తెలిపింది. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనియాలతో చేసిన ప్రసాదాన్ని, ఫలాలతో చేసిన లడ్డూలను స్వామికి నివేదించారు.

రహస్యంగా జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రమాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఇంట్లో నోట్లకట్టలు బయటపడిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ.. శనివారం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. పెద్దగా అతిథులెవరూ లేకుండా ఆయన చాంబర్‌లోనే ఈ కార్యక్రమం రహస్యంగా జరగటం గమనార్హం. దీనిని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. జస్టిస్ వర్మను చేర్చుకోవద్దని తాము విజ్ఞాపనపత్రం ఇచ్చినప్పుడు.. తగిన చర్యలు తీసుకుంటానని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చారని అసోసియేషన్ కార్యదర్శి విక్రాంత్ పాండే తెలిపారు. తమ సంఘంతోపాటు పలువురు జడ్జిలకు కూడా సమాచారం ఇవ్వకుండా సదరు 'ప్రమాణం' జరిపారన్నారు.

లండన్ డాక్టర్‌నన్నాడు..ఏడుగురి ప్రాణాలు తీశాడు

భోపాల్, ఏప్రిల్ 6: లండన్ నుంచి వచ్చిన ప్రముఖ వైద్యుడిని జాన్ కెమ్‌ను తానేనంటూ.. మధ్యప్రదేశ్‌లో ఓ వ్యక్తి 15మంది రోగులకు శస్త్రచికిత్స చేసి ఏడుగురి ప్రాణాలను హరించాడు. మధ్యప్రదేశ్‌లోని దామోలో ఓ మిషనరీ ద్వారా నడుస్తున్న ఆసుపత్రిలో జరిగిన ఈ వ్యవహారంలో నరేంద్ర విక్రమాదిత్య యాదవ్‌పై ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నరేంద్ర లండన్‌లో ప్రముఖ కార్డియాలజిస్టు నిపుణుడు జాన్ కెమ్‌గా అవతారమెత్తి, జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య 15 మందికి గుండె శస్త్రచికిత్సలు నిర్వహించాడని, వీరిలో ఏడుగురు మృతి చెందారని దీపక్ తివారీ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ కన్ను!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యూకే, జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. అడ్వాన్స్‌డ్ స్టెల్త్, అడ్వాన్స్‌డ్ వార్‌ఫేర్ వ్యవస్థ వంటి సామర్థ్యాలతోపాటు ఏఐ అనుసంధానంతో పని చేసే అత్యాధునిక ఆరో తరం ఫైటర్‌జెట్‌లను భవిష్యత్తు అవసరాల కోసం జపాన్, యూకే, ఇటలీ అభివృద్ధి చేస్తున్నాయి.

నిరాహార దీక్ష విరమించిన రైతు నేత దల్లేవాల్



ఛండీగఢ్, ఏప్రిల్ 6: రైతు డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆదివారం విరమించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి పలు డిమాండ్ల సాధన కోసం గతేడాది నవంబరు 26న ఆయన దీక్ష చేపట్టారు. కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, రన్‌వీత్ సింగ్ బిట్టు శనివారం జగ్జీత్‌ను కలిసి దీక్ష విరమించాల్సిందిగా కోరగా, మర్నాడే ఆయన దీక్ష విరమించారు.



పాంబన్ కొత్త వంతెన మీద నుంచి వెళ్తున్న రైలు



బ్రిడ్జిని నిలువుగా పైకి లేపిన తర్వాత దాని కింద నుంచి వెళ్తున్న ఓడ

అకారణంగా
ఏడుస్తుంటారు!

(మొదటి పేజీ తరువాయి)

ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. డాక్టర్లు కావాలని కలలు కంటున్న పేద నేపథ్యం కలిగిన విద్యార్థులకు మేలు చేసేలా వైద్య విద్య కోర్సులను మాతృభాష తమిళంలో బోధించాలని స్టాలిన్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తమిళ భాష, సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ చేర్చేందుకు కేంద్రం నిరంతరం కృషిచేస్తోందన్నారు. శ్రీరాముడి జీవితం, సుపరిపాలనా స్ఫూర్తి.. జాతి నిర్మాణానికి ముఖ్యమైన పునాదిగా పని చేస్తాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా పవిత్ర భూమి రామేశ్వరం నుంచి దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.



రామనాథస్వామి ఆలయంలో మోదీ పూజలు

పాంబన్‌తో ఎంతో మేలు

'భారతరత్న' డాక్టర్ కలాం జన్మించిన భూమి రామేశ్వరమని ప్రధాని తెలిపారు. ఆయన జీవితం సైన్స్-ఆధ్యాత్మికత సమ్మిళితమని.. కొత్త పాంబన్ వంతెన కూడా సాంకేతిక-సంప్రదాయాల సమ్మేళనంగా అభివర్ణించారు. వేల సంవత్సరాల పురాతనమైన ఈ పట్టణం.. ఇప్పుడు 21వ శతాబ్దపు ఇంజనీరింగ్ అద్భుతంతో.. ప్రధాన భూభాగానికి అనుసంధానమైందన్నారు. పాంబన్ సహా దేశంలో నాలుగు దిక్కులా నిర్మించిన వంతెనలను మోదీ ప్రస్తావించారు. ఉత్తరాన జమ్మూకశ్మీర్‌లోని చీనాబ్ వంతెన ప్రపంచంలోనే ఎత్తయిన రైలు వంతెనల్లో ఒకటని.. పశ్చిమాన ముంబైలో ఇప్పుడు దేశంలోనే అతి పొడవైన సముద్రపు వంతెన అటల్ సేతు ఉందని.. తూర్పున అసోంలోని బోగీబీల్ వంతెన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని.. గత పదేళ్లలో శ్రీలంక చెర నుంచి 3,700 మందికి పైగా మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని చెప్పారు. ఇదిలా ఉండగా, శ్రీలంకలో మూడ్రోజుల పర్యటనలో చివరి రోజు ఆదివారం ప్రధాని మోదీ చారిత్రక, ఆధ్యాత్మిక నగరం అనూరాధపురకు వెళ్లారు. అక్కడ రూ.780కోట్ల భారత్ సాయంతో పునర్నిర్మించిన మహో-ఓమన్‌థాయ్ రైల్వే లైనును ప్రారంభించారు. తర్వాత జయశ్రీ మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. క్రీ.పూ.3వ శతాబ్దంలో అశోక చక్రవర్తి కుమార్తె సంఘమిత్ర మహా థెరి నెలకొల్పిన మహాబోధి వృక్షం వద్ద ప్రార్థనలు చేశారు. మరోవైపు, మోదీ కోరిక మేరకు ఆదివారం 11 మంది తమిళ జాలర్లను శ్రీలంక విడుదల చేసింది.

అప్పుడూ.. ఇప్పుడూ
గుజరాతీ బిడ్డే

పాంబన్‌లో వందేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన వ్యక్తి రైల్వే వంతెన నిర్మించారని, మళ్లీ శతాబ్దం తర్వాత ఇదే స్థలంలో కొత్త వంతెన నిర్మించే అదృష్టం గుజరాతీ బిడ్డ(మోదీ)కే వచ్చిందని మోదీ సభలో వ్యాఖ్యానించారు. పాంబన్ కొత్త రైలు వంతెనను ప్రారంభించి, జాతికి అంకితం చేసిన అనంతరం ప్రధాని.. తమిళ సంప్రదాయ దుస్తులైన ధోవతి, పట్టు చొక్కా, పట్టు అంగవస్త్రం ధరించి రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ఆలయానికి వెళ్లిన ఆయన మూలవిరాట్ ముంగిట నేలపై ఆసీనులై స్వామివారికి మొక్కారు. ఇదిలా ఉండగా, హెలికాప్టర్లో శ్రీలంక నుండి రామనాథపురం మండపం వచ్చేటప్పుడు 'రామసేతు'ను దర్శించుకునే అరుదైన భాగ్యం తనకు కలిగిందని మోదీ 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. 'దైవానుకూలంగా అయోధ్యలో సూర్య తిలకధారణ జరిగే సమయంలో ఈ సేతుబంధనాన్ని వీక్షించాను. ఇలా ఒకే సమయంలో రెండు దర్శనాలు శ్రీరామచంద్రుడి అనుగ్రహమే' అన్నారు.

పార్లమెంటులో మోదీ ప్రకటన చేయాలి: స్టాలిన్

పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి సీఎం స్టాలిన్ హాజరుకాలేదు. ముందుగా ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున ప్రారంభోత్సవానికి రాలేనని ముందుగానే ప్రధానికి తెలియజేశానని ఆయన తెలిపారు. ఆదివారం ఊటీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తమిళ గడ్డపై అడుగు పెట్టిన మోదీ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని పార్లమెంటులో విస్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేయాలని.. సముచిత పునర్విభజనకు ఇదొక్కటే మార్గమని.. మోదీ ఈ పనిచేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. 1971 జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన చేపడతామని 2001లో నాటి ప్రధాని వాజపేయి హామీ ఇచ్చారని.. దీనికి కేంద్రం కట్టుబడి ఉండాలని కోరారు.



పాంబన్ బ్రిడ్జి నిర్మాణంలో
ఆంధ్రుడి ప్రతిభ

సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా వెంకట చక్రధర్



గుర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించిన పాంబన్ బ్రిడ్జి దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన. రూ.535 కోట్ల వ్యయంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ వంతెన నిర్మాణంలో ఆంధ్రా కుర్రాడి ప్రతిభ కూడా ఉంది. విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన నడుపూరు వెంకట చక్రధర్.. పాంబన్ వారధి నిర్మాణ పనుల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్ హోదాలో ఇన్‌చార్జి సేనాధిపతిగా విధులు నిర్వహించారు. చక్రధర్ స్వగ్రామం గుర్ల మండలం భూపాలపురం. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశాడు. రైల్వే పరీక్షల్లో సత్తా చాటి తర్వాత తమిళనాడు రీజనల్ పరిధిలో జూనియర్ ఇంజనీర్‌గా విధుల్లో చేరాడు. వంతెనల నిర్మాణంపై ఆసక్తిని గమనించిన అధికారులు 'పాంబన్' వారధి బాధ్యతలను చక్రధర్‌కు అప్పగించారు. 'చిన్నప్పటి నుంచి వంతెనలు, రోడ్లు అంటే ఎంతో ఇష్టం. బీటెక్‌లో సివిల్ ఇంజనీరింగ్ చదివిన తర్వాత ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ శిక్షణ తీసుకునే సమయంలో ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్ వచ్చింది. అందులో బ్రిడ్జి విభాగం ఆప్షన్‌ను ఎంచుకొని ఉద్యోగంలో చేరాను. తొలుత పోస్టింగ్ చెన్నైలో వచ్చింది. తర్వాత సీనియర్ ఇంజనీర్‌గా పదోన్నతి లభించింది. అదే సమయంలో పాంబన్ కొత్త వంతెన నిర్మాణానికి కేంద్రం చర్యలు చేపట్టింది. అందులో నాకు బాధ్యతలు అప్పగించడం అదృష్టంగా భావించా. వంతెన నిర్మాణానికి నా వంతు కృషి చేశా'నని చక్రధర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పంచాయతీల్లో దొంగలు పడ్డారు!

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అవినీతికి పాల్పడిన సర్పంచ్‌లపై టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేశారు. డీపీఓలు, డీఎల్‌పీఓలు మేజర్ పంచాయతీల్లో జరిగిన దోపిడీపై విచారణ జరిపి పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు నివేదిక పంపారు. వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఆ పార్టీ నేతల గుప్పిట్లో ఉన్న రిజర్వుడ్ పంచాయతీల్లో అక్రమాలకు పాల్పడినట్టు సమాచారం. వైసీపీ హయాంలో కార్యదర్శులను చెప్పుచేతుల్లో పెట్టుకుని సర్పంచ్‌లు భారీగా నిధులు వాడేసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక సంఘం నిధులు అప్పట్లో రాకపోవడంతో ఆయా పంచాయతీలకు వచ్చిన సొంత వనరుల ఆదాయాన్ని లెక్కాపక్కా లేకుండా తినేశారు. పారిశుధ్యం పనులను అడ్డం పెట్టుకుని కూడా భారీగా నిధులు దండుకున్నారు.

నిబంధనలకు పాతర

నిర్మాణ పనుల్లో ఏఈలను అడ్డం పెట్టుకుని ఎంబుక్‌ల్లో రికార్డు చేయకుండానే సర్పంచ్‌లు నిధులు స్వాహా చేశారని చెప్తున్నారు. మీటింగ్‌లు పెట్టకుండానే అజెండాలో లేని పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి దోచుకున్నారు. పంచాయతీల్లో ఏ పనులు చేపట్టాలన్నా వర్క్ కమిటీలు వేయాలి. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఆ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారు. థర్డ్ పార్టీకి బిల్లులు చెల్లించిన కొందరు పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్ అయి కార్యాలయాల చుట్టూ, నేతల చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీల్లో సివిల్ వర్క్సు చేసే క్రమంలో వర్క్సు కమిటీ అగ్రిమెంట్ చేయాలి. అయితే ఆ సంప్రదాయం కూడా ఎప్పుడో నిలిచిపోయింది. పంచాయతీల్లో ఏ వస్తువైనా కొనుగోలు చేయాలంటే వ్యయం రూ.50 వేలు దాటితే టెండర్లు పిలవాలి. కానీ ఎక్కడా టెండర్లు జరిగిన దాఖలాల్లేవు. వార్షిక ఆడిట్‌లో పంచాయతీ ఆడిట్ అధికారులు వాటినేమీ పట్టించుకునే పరిస్థితి లేదు. పర్సంటేజీలు ఇస్తే చాలు ఏదైనా ఒకే చేసే పరిస్థితి. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి అందాల్సిన జీఎస్టీ కూడా రావడం లేదు. కొన్ని వస్తువులు కొనేటప్పుడు ఎంబుక్ రికార్డు చేసి మరీ ఏఈలు కౌంటర్‌సైన్ చేయాలి. అవేవీ అమలు కావడం లేదు. షాపులకు నేరుగా బిల్లులు చెల్లించాల్సి ఉండగా... థర్డ్ పార్టీలకు బిల్లులు చెల్లిస్తున్నారు.

అడ్డగోలుగా బిల్లులు డ్రా

కొన్ని మేజర్ పంచాయతీలు వైట్ పేపర్ సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసి మరీ బిల్లులు డ్రా చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ట్రెజరీల నుంచి తప్పించి సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. కొన్ని మేజర్ పంచాయతీల్లో కార్యదర్శులు ఏవేవో బిల్లులు పెట్టి డ్రా చేస్తున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసే వాటిని తనిఖీ చేసే పరిస్థితి లేకపోవడంతో ఇష్టారీతిగా డబ్బులు డ్రా చేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో దొంగ రశీదులిచ్చి మరీ ఇంటి పన్ను వసూలు చేసుకున్నారు. రికార్డుల్లో మాత్రం బకాయిలున్నట్లు చూపిస్తోంది. డబ్బులిచ్చిన వాళ్లకు ఓ రకంగా, ఇవ్వని వాళ్లకు మరో రకంగా ఇంటి పన్నులు నిర్ణయిస్తున్నారు. చిన్నతరహా పరిశ్రమలు నడుపుకొనే వాళ్ల నుంచి ముక్కుపిండి వసూలు చేసుకుంటున్నారు. ఆ పన్నులు పంచాయతీలకు చేరడం లేదు. మ్యుటేషన్ల పేరిట కూడా భారీగా దోచుకుంటున్నారు. వైసీపీ హయాంలో రూ.612 కోట్లు మాత్రమే ఇంటి పన్ను వసూలైంది. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రూ.800 కోట్లకు పైగా పన్నులు వసూలు చేశారు. గతంలో మాదిరి తప్పులు జరగకుండా కమిషనర్ కృష్ణతేజ స్వర్ణ పంచాయతీ పోర్టల్ తీసుకొచ్చి పారదర్శకంగా పన్నుల వసూళ్లు చేపట్టారు.

కార్యదర్శులే బాధ్యులు

నిధుల దోపిడీ వ్యవహారంలో అంతిమంగా పంచాయతీ కార్యదర్శులే బలవుతుండటంతో వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు తటపటాయిస్తున్నారు. 100 మేజర్ పంచాయతీల్లో నిధులు దోచుకున్న సర్పంచ్‌లు.. మరోవైపు గ్రామాభివృద్ధికి సైంధవులుగా మారిపోయారు. పంచాయతీలకు కేంద్రమిచ్చిన ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయకుండా అడ్డుకుంటున్నారు. తమపై ఫిర్యాదులు చేశారని, పనులు చేసినా మళ్లీ ఫిర్యాదులొస్తాయంటూ పనులు ఆపేసి కూర్చున్నారు. వైసీపీ జడ్పీ చైర్మన్లు, మండలాధ్యక్షులు, జడ్పీటీసీలు కూడా గ్రామాల అభివృద్ధికి సహకరించడం లేదు. స్థానిక సంస్థలన్నీ వైసీపీ చేతిలో ఉండటం, కూటమి సర్కార్ అధికారంలో ఉండటంతో గ్రామాభివృద్ధికి ఆటంకాలు కలుగుతున్నాయి. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి ఒకేసారి తీర్మానాలు చేయడంతో సిమెంట్‌రోడ్లు పూర్తయ్యాయి.

ట్రంప్ చర్యలతో ప్రపంచీకరణకు ముగింపు

- నేడు ప్రకటించనున్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ట్రంప్ అవలంబిస్తున్న వాణిజ్య విధానాలతో ప్రపంచీకరణ శకం ముగిసిపోయినట్టేనని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించనున్నారు. 1991లో సోవియట్ యూనియన్ పతనంతో ప్రారంభమైన ప్రపంచీకరణ లక్షలాది మంది ఓటర్లకు నిరాశ కలిగించిందని, 'అమెరికా ఫస్ట్' నినాదంతో ప్రపంచ దేశాలపై ట్రంప్ అసాధారణ స్థాయిలో విధించిన 10శాతం బేస్‌లైన్ సుంకాలు మార్కెట్లను అనిశ్చితిలోకి నెట్టాయని ఆయన సోమవారం ప్రకటించడానికి రంగం సిద్ధమైందని 'టైమ్స్' నివేదిక పేర్కొంది. ఆర్థిక జాతీయవాదం విషయంలో అమెరికా దృష్టిని గుర్తించినట్లు స్టార్మర్ అంగీకరించే అవకాశం ఉందని తెలిపింది. ట్రంప్ తీవ్రమైన చర్యలతో ఏకీభవించనప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంలో ఒక కొత్త శకం ప్రారంభమైందని, అందులో చాలా మంది అమెరికా అధ్యక్షుడి విధానాలను సమర్థిస్తున్నారని స్టార్మర్ యంత్రాంగం గుర్తించిందంటూ యూకేకు చెందిన ఓ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ వెల్లడించింది.

ట్రంప్ పిచ్చోడు!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. అయితే.. అత్యంత స్వల్ప కాలంలోనే ఆయనకు వ్యతిరేకంగా అమెరికా పౌరులు ఆందోళనకు దిగడంతో ప్రపంచవ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది. లాస్‌ఏంజెలెస్, బోస్టన్, న్యూయార్క్, హ్యూస్టన్, కొలరాడో, ఫ్లోరిడా, వాషింగ్టన్ డీసీ తదితర రాష్ట్రాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. "కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారు. అధికార అతిక్రమణలకు పాల్పడుతున్నారు" అంటూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలు వామపక్ష నేతల ఆధ్వర్యంలో చేపట్టినట్టు స్థానిక మీడియా పేర్కొంది. గార్డియన్ మీడియా కథనం మేరకు.. వాషింగ్టన్, ఫ్లోరిడా సహా పలు రాష్ట్రాల్లో చేపట్టిన నిరసనల్లో 5 లక్షల మంది అంతకుపైగానే.. పౌరులు పాల్గొన్నారు. మొత్తంగా 50 రాష్ట్రాల్లోని 12 వందల నగరాల్లో 'హ్యాండ్సాఫ్' పేరిట నిరసనలు చేపట్టారు. ఈ నిరసనలన్నీ శాంతియుతంగానే జరిగాయని.. ఎక్కడా ఎవరినీ అరెస్టు చేయలేదని గార్డియన్ పేర్కొంది. మస్క్ పాలసీలకు మద్దతిస్తూ ట్రంప్ కుబేరుల అజెండాను అమలు చేస్తున్నారని నిరసనకారులు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారని, వలసలు, మానవహక్కులపై ఉక్కుపాదం మోపుతున్నారని గర్జించారు. అయితే, ఈ ఆందోళనల్లో అమెరికాలోని వలసదారులెవరూ పాల్గొనలేదు. నిరసన ప్రదర్శనల్లో, అమెరికా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో వలసదారులెవరైనా పాల్గొంటే వారిని బహిష్కరిస్తామని ట్రంప్ గతంలో హెచ్చరించడమే ఇందుకు కారణం.

నిరసనలతో ఒరిగేది లేదు!

ట్రంప్, మస్క్ విధానాలను ఎండగడుతూ లక్షల మంది ప్రజలు నిరసన చేపట్టిన నేపథ్యంలో అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నిరసనలు చేపట్టినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదని స్పష్టం చేసింది. ట్రంప్ ప్రజాదరణ కూడా ఏమాత్రం తగ్గబోదని పేర్కొంది. కాగా.. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. "నా విధానాల్లో ఎలాంటి మార్పూ ఉండబోదు" అని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా కాలిఫోర్నియాలో భారీ నిరసన ప్రదర్శన

'రాజ్యాధిపత్యంపై పోరాటం'

'రాజ్యాధిపత్యంపై పోరాటం' అని రాసి ఉన్న ప్లకార్డులు సీటెల్ సహా.. పలు రాష్ట్రాల్లో కనిపించాయి. అంతేకాదు.. కొన్ని చోట్ల ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశ జాతీయ పతాకాన్ని పట్టుకుని నిరసన కారులు ఆందోళనల్లో పాల్గొన్నారు. 'హ్యాండ్సాఫ్ కెనడా, హ్యాండ్సాఫ్ గ్రీన్‌ల్యాండ్, హ్యాండ్సాఫ్ ఉక్రెయిన్' నినాదాలతో నిరసనకారులు హోరెత్తించారు. "ట్రంప్‌కు కీలక సందేశం పంపించేందుకే హ్యాండ్సాఫ్ ఉద్యమం చేపట్టాం" అని అమెరికా రాజకీయ నేత లీహ్ గ్రీన్‌బర్గ్ చెప్పారు. ట్రంప్‌పై నిరసన కారులు తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఆయన పేరును ప్రస్తావించకుండానే 'శ్వేతజాతి అత్యాచార నిందితులు' అంటూ నిప్పులు చెరిగారు. "నాకు చాలా కోపంగా ఉంది. మనసు రగిలిపోతోంది. శ్వేతజాతి అత్యాచార నిందితులు మన దేశాన్ని నియంత్రిస్తున్నారు" అని 43 ఏళ్లపైనా కేస్నెర్ నిప్పులు చెరిగారు. చాలా మంది "అమెరికాకు రాజు ఎవరూ లేదు" అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు.

బెర్లిన్‌లో టెస్లా షోరూం ముందు...

ట్రంప్, మస్క్‌కు వ్యతిరేకంగా పలు యూరోపియన్ నగరాల్లోనూ శనివారం వందలాది మంది నిరసన వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో దాదాపు 200 మంది ఆందోళనకు దిగారు. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో 'హ్యాండ్సాఫ్' ప్రదర్శనను నిర్వహించారు. ట్రంప్ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. బెర్లిన్‌లోని టెస్లా కార్ల షోరూం ముందు నిరసన తెలిపారు. అలాగే లండన్, లిస్బన్ నగరాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

కేంద్ర కమిటీ నుంచి గఫూర్ ఔట్
ఏపీ నుంచి రమాదేవి, లోకనాథం

చెన్నై, హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన సీనియర్ నేత మరియం అలెగ్జాండర్ బేబీ (ఎంఏ బేబీ) సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో జరిగిన పార్టీ కాంగ్రెస్ సమావేశంలో ప్రధాన కార్యదర్శితోపాటు 84 మంది సభ్యుల కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్లో సీతారాం ఏచూరి మరణంతో ఆ పదవి ఖాళీ అయింది. మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ తాత్కాలిక కోఆర్డినేటర్‌గా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నారు. క్రిస్టియన్ అయిన ఎంఏ బేబీ సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి మైనార్టీ నేత కావడం విశేషం. కేరళ నుంచి ఈఎంఎస్ నంబూద్రిపాద్ తర్వాత ఈ పదవికి ఎన్నికైన రెండో నేత ఈయనే. బేబీ 1954లో కేరళలోని ప్రాక్కులంలో పీఎం అలెగ్జాండర్, లిల్లీ దంపతులకు జన్మించారు. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే.. ఎస్ఎఫ్ఐకి పూర్వరూపమైన కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరారు. తర్వాత ఎస్ఎఫ్ఐకి, యూత్ విభాగం డీవైఎఫ్ఐకి అధ్యక్షుడిగా పనిచేశారు. ఎమర్జెన్సీ సమయంలో కొంతకాలం జైలు జీవితం అనుభవించారు. 1986లో కేవలం 32 ఏళ్ల చిన్న వయసులోనే రాజ్యసభకు ఎన్నికై 1998 వరకు కొనసాగారు. 1999లోనే సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 2006, 11ల్లో కుందర ఎమ్మెల్యేగా గెలిచారు. 2006 నుంచి 11 వరకు విద్యా మంత్రిగా పనిచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయారు. బేబీ సతీమణి బెట్టీ లూయిస్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఆసియానెట్ టీవీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్




నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబి పేరును ప్రకటిస్తున్న ప్రకాశ్ కరత్

11 మంది తెలుగువారికి చాన్స్

తెలుగు రాష్ట్రాల నుంచి సీనియర్ నేతలు బీవీ రాఘవులు, ఆర్.అరుణ్‌కుమార్‌లకు పొలిట్ బ్యూరోలో.. తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు జాన్ వెస్లీ, వి.శ్రీనివాసరావులతోపాటు తెలంగాణ నుంచి తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, జ్యోతి, పుణ్యవతి, సాయిబాబు, ఏపీ నుంచి రమాదేవి, లోకనాథంలకు కేంద్ర కమిటీలో చోటు దక్కింది. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్‌కు చోటు దక్కలేదు. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయనే స్వచ్ఛందంగా వైదొలగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. లోకనాథం మొన్నటివరకు అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రమాదేవి ఐద్వా కార్యదర్శిగా ఉన్నారు.


సీనియర్లకు ఉద్వాసన!

సీపీఎం పొలిట్ బ్యూరోలోకి కొత్తగా 8 మందికి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో సీనియర్లు ప్రకాశ్ కరత్, బృందా కరత్, మాణిక్ సర్కార్ తదితర సీనియర్లకు ఉద్వాసన పలికి.. కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశమిచ్చారు.



తమిళనాడులోని మధురైలో నిర్వహించిన సీపీఎం జాతీయ మహాసభలకు అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు చెందిన చల్లా వెంకటయ్య(72), తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన కుప్పుస్వామి(58) తిరుపతి నుంచి సైకిళ్లపై బయలుదేరారు. ఆరు రోజులపాటు 550 కి.మీ. ప్రయాణించి మహాసభలకు చేరుకున్న వీరిద్దరికీ మధురైలో పార్టీ అగ్రనేతలతోపాటు పలువురు స్వాగతం పలికి సన్మానించారు.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు(గాంధీ సర్కిల్)



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరామస్వామి (ఇన్‌సెట్) శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ

శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీరామనవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని బంగారువాకిలి వద్ద ఆస్థానాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాల సేవ, అర్చన సేవలను నిర్వహించారు. తర్వాత ఆలయంలోని రంగనాయకమండపంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను కన్నులపండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి హనుమంత వాహనసేవ వేడుకగా నిర్వహించారు. శ్రీరాములవారు హనుమంతునిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, సోమవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

భద్రాద్రి రాముడికి టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణలోని భద్రాచలంలో సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు అందజేశారు. భద్రాచలం ఆలయం వద్దకు చేరుకున్న ఛైర్మన్‌కు ఆ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, ఈవో రమాదేవి ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ఛైర్మన్ దంపతులు సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

48 గంటల్లో అల్పపీడనం

▸ మరోవైపు మళ్లీ పెరగనున్న ఎండలు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తర్వాత మరింత బలపడి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని అంచనా వేసింది. అయితే అల్పపీడనం ఏర్పడిన తర్వాత కోస్తా, రాయలసీమలో ఎండలు పెరుగుతాయని హెచ్చరించింది. కాగా, ఆదివారం కర్నూలు జిల్లా కామవరంలో 40.8, ప్రకాశం జిల్లా డోర్నాలలో 40.7, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 40.6, పల్నాడు జిల్లా రావిపాడులో 40.5, పలు ఇతర చోట్ల 40 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ద్రోణుల ప్రభావం, ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొని కొన్నిచోట్ల ఈదురుగాలులు, పిడుగులు, వడగండ్లతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

బీజేపీ ఆశయాలకు పునరంకితం కావాలి

▸ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో పురందేశ్వరి పిలుపు

▸ దేశానికి సేవకుల్ని అందించిన పార్టీ: సుజనా చౌదరి



రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి

అమరావతి, రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆశయాలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో ఆమె బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ముందు దేశం, తర్వాత పార్టీ, ఆ తర్వాత మనం అనేది పార్టీ సిద్ధాంతమని, దీన్ని కేడర్ పాటించాలని కోరారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతానికి బీజేపీ నాయకత్వం కృషి చేస్తోందన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం జనసంఘ్ నుంచి ప్రారంభమై అనేక ఆటుపోట్లు తట్టుకుని నిలబడి ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తల్ని సంపాదించుకున్న ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు.

ఎట్టకేలకు బోనుకు చిక్కిన చిరుత



బోనులో ఉన్న చిరుత పులి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా తిరుపతి వాసులను హడలెత్తిస్తున్న చిరుతపులి ఎట్టకేలకు బోనులో పడింది. ఈమధ్యకాలంలో తిరుపతిలోని ఎస్వీయూ, వేద వర్సిటీ, వెటర్నరీ యూనివర్సిటీ పరిసరాల్లో తరచూ జింకలను, కుక్కలను చిరుత చంపి పడేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. చెర్లోపల్లె-అలిపిరి ప్రధా న మార్గంలో ద్విచక్రవాహనదారుడిపై చిరుత దాడి చేసి గాయపరిచింది. ఫారెస్టు అధికారులు చిరుత కదలికలను గుర్తించడానికి ట్రాప్ కెమెరాలు, బంధించడానికి శేషాచల అటవీ సమీప ప్రాంతాలైన యూనివర్సిటీల్లో బోన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోనులో చిరుత పడింది. దానిని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టడానికి అటవీ శాఖ తరలించింది.

గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు..!

▸ 273 కిలోల డ్రై గంజాయి జప్తు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థ ముసుగులో ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా హరియాణకు గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టుచేశారు. పంజాబ్‌వాసి పర్దీప్‌కుమార్, హరియాణా వాసులు సన్నీ, మనీష్ కుమార్.. బోయిన్‌పల్లిలో ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థ నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్‌సీబీ కేసులో శిక్ష పడిన వ్యక్తితో కలిసి ఒడిశా నుంచి హరియాణకు భారీగా గంజాయి రవాణాకు పథకం వేశారు. ఒడిశా సప్లయర్ సుభాష్ బిశ్వాస్‌తో ఒప్పందం చేసుకున్నారు. గత నెల 31న డ్రై గంజాయి కొనుగోలు చేశారు. కొంత ఇంటి సామగ్రి కలిపి గంజాయిని బాక్సుల్లో ప్యాక్ చేశారు. పక్కా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆదివారం తెల్లవారుజామున శామీర్‌పేట ఓఆర్ఆర్ వద్ద తనిఖీ చేయడంతో గంజాయి బయట పడింది. 273 కిలోల డ్రై గంజాయి (రూ.95 లక్షలు), బొలెరో (రూ.5 లక్షలు), జియో డాంగిల్ (రూ.70 వేలు), ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ కోటిరెడ్డి చెప్పారు.

బంగారం దొంగలు దొరికారు

▸ చిత్తూరు జిల్లాలో కారు దోపిడీ చేసిన కేసును ఛేదించిన పోలీసులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో 2 రోజుల కిందట జరిగిన బంగారం దోపిడీ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రూ.3.20 కోట్ల విలువైన 3.5 కిలోల ఐదు బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కర్ణాటక కాంగ్రెస్‌కి చెందిన కౌన్సిలర్ ఉన్నారు. ఎస్పీ మణికంఠ వివరాలను మీడియాకు తెలిపారు. కర్ణాటకలోని కేజీఎఫ్‌కు చెందిన దీపక్‌కుమార్ బంగారం, వస్త్ర వ్యాపారాలు చేస్తున్నారు. ఆయన వద్ద పనిచేసే చేతన్‌కుమార్, ముక్రమ్ ఈనెల 2న రాత్రి తమ కారులో చెన్నై నుంచి కేజీఎఫ్‌కు బంగారు బిస్కెట్లను తీసుకుని వెళుతున్నారు. మార్గమధ్యలో వి.కోట మండలం నాయకనేరి ఘాట్ వద్ద దుండగులు కారును అడ్డగించి, బంగారు బిస్కెట్లను దోచుకెళ్లారు. దీపక్ కుమార్ మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించి.. కర్ణాటక, తమిళనాడుల్లో గాలింపు చర్యలు చేపట్టారు. వి.కోట మండలం రాఘవపల్లె సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వి.కోట-పలమనేరు హైవేపై శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. కేజీఎఫ్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ జయపాల్(67), ముక్రమ్(42), కేఆర్‌బాబు(61), షణ్ముగం(59) కారులో బంగారు బిస్కెట్లను తరలిస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. జయపాల్‌ను విచారించగా, నగల వ్యాపారి దీపక్‌కుమార్‌కు చెందిన బంగారం బిస్కెట్లను తామే దోచుకున్నట్లు అంగీకరించాడు. దీపక్‌కుమార్ డ్రైవర్ ముక్రమ్ ఈ సమాచారాన్ని ఇచ్చినట్లు జయపాల్ చెప్పాడు. తమిళనాడుకు చెందిన మరో 12 మందితో కలిసి దోపిడీకి పాల్పడినట్లు తెలిపాడు. మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు.

కోచ్ కాదు.. కామాంధుడు..!

▸ 16 ఏళ్ల బాలికపై బ్యాడ్మింటన్ కోచ్ అత్యాచారం

▸ ఆపై నగ్న చిత్రాలు పంపాలంటూ వేధింపులు

▸ కోచ్‌ను అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు



సురేశ్ బాలాజీ

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక శిక్షణ పేరుతో 16 ఏళ్ల బాలికపై బ్యాడ్మింటన్ కోచ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బెంగళూరులోని హుళిమావు పోలీసులు కేసు నమోదు చేసుకుని, తమిళనాడుకు చెందిన కోచ్ సురేశ్ బాలాజీ (26)ని శనివారం అరెస్టు చేశారు. బాధిత బాలిక రెండేళ్లుగా సురేశ్ వద్ద బ్యాడ్మింటన్ శిక్షణకు వెళ్తోంది. బాలికకు మాయమాటలు చెప్పిన కోచ్.. ఆమెపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో బాలిక తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి కూడా నగ్న ఫొటోలు పంపాలని కోచ్ బాలికపై ఒత్తిడి తెచ్చాడు. అతడి వేధింపులు భరించలేక ఆ బాలిక తన అమ్మమ్మ ఫోన్ నుంచి తన నగ్న చిత్రాలను అతనికి షేర్ చేసింది. తన ఫోన్‌లో బాలిక నగ్న చిత్రాన్ని గమనించిన అమ్మమ్మ.. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమెను ప్రశ్నించగా..విషయం బయటపెట్టింది. ప్రత్యేక శిక్షణ పేరుతో కోచ్ పలుమార్లు తన అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లి తనపై లైంగిక దాడి చేశాడని, ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడని వెల్లడించింది. దీంతో తల్లిదండ్రులు హుళిమావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కోచ్ సురేశ్ బాలాజీని అరెస్టు చేశారు. అతడి మొబైల్ స్వాధీనం చేసుకుని, పరిశీలించగా 8మంది బాలికల నగ్న ఫొటోలు, వీడియోలను పోలీసులు గుర్తించారు. బ్యాడ్మింటన్ శిక్షణ కోసం వచ్చే బాలికలకు మాయమాటలు చెప్పి, అత్యాచారానికి పాల్పడేవాడని గుర్తించారు. సురేశ్‌పై పోక్సో కేసు నమోదుచేసే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.



అమరావతి రైల్వేస్టేషన్ (ఊహాచిత్రం)

అదిరేలా అమరావతి రైల్వేస్టేషన్..!

- ఆధునిక హంగులతో మోడల్ స్టేషన్
- దేశంలోనే అతిపెద్దదిగా నిర్మాణం
- ప్రధాన నగరాలతో అనుసంధానం
- నెక్కల్లు-పెదపరిమి సమీపంలో ఏర్పాటు
- స్టేషన్ నిర్మాణానికి 1500 ఎకరాలు
- నంబూరు-ఎర్రుపాలెం మధ్య..
- 2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వేలైన్
- ఈ లైన్‌లో కవచ్ టెక్నాలజీ ఏర్పాటు
- తొలిదశ పనులకు రెండు నెలల్లో టెండర్లు



స్టేషన్‌లో ప్లాట్‌ఫారంలు (ఊహాచిత్రాలు)

(మంగళగిరి-ఆంధ్రజ్యోతి)

అద్భుత నిర్మాణాలు.. అత్యాధునిక సౌకర్యాలతో నవ్యాంధ్ర రాజధాని అమరావతి.. ప్రపంచ మేటి నగరాల్లో ఒకటిగా భాసిల్లాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష.! అందుకే ఈ కలల రాజధాని అన్ని రంగాల్లోనూ ప్రత్యేకతను చాటుకొనేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. అమరావతి నగరాన్ని రోడ్డు, వాయు, రైలు మార్గాల ద్వారా నేరుగా అనుసంధానించేలా, వాటిలో ఆధునికత ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రైల్వేస్టేషన్‌ను నిర్మించేలా పథకరచన చేశారు. నెక్కల్లు-పెదపరిమి సమీపంలో దేశంలోకెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్‌ను నిర్మించనున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు సుమారు 1500 ఎకరాలు అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసింది.

రెండు మాసాల్లో టెండర్లు

అమరావతి రైల్వేలైన్‌ను రెండు దశలుగా చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ తాజాగా నిర్ణయించింది. మొత్తం 56.53 కి.మీ. రైల్వేలైన్‌లో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. లైన్‌ను మొదటి దశగా చేపట్టనుంది. దీనికోసం రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానించనున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది. తొలిదశలోనే దాములూరు-వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. మేర రైల్వేబ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపడతారు. వచ్చే రెండు నెలల్లోగా భూసేకరణ పూర్తి చేయగలమనే విశ్వాసంతో ఉన్నారు. తొలిదశ పనులకోసం సుమారు రూ.800 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. తాడికొండ మండలంలో రైల్వేలైను కోసం భూములిచ్చేందుకు కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో అక్కడ భూసేకరణ ఆలస్యమవుతోంది.

అమరావతికి దక్షిణ హద్దు వెంబడే!

అమరావతి రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయాల తరహాలో నగర శివారులో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దేశంలోకెల్లా ఓ మోడల్ రైల్వేస్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

మోడల్ స్టేషన్‌గా ఆవిర్భావం

దేశంలో ప్రయాగరాజ్, వారాణసీ, ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ రైల్వేస్టేషన్లు అత్యంత సుందరంగా ఉన్నాయి. వాటికి దీటుగా అమరావతి రైల్వేస్టేషన్ ఉండబోతుంది. దీని చేరువలో.. ఓ పెద్ద గూడ్స్ యార్డును కూడా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను రైల్వేశాఖ పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

పరిటాల వద్ద కార్గో టెర్మినల్

ఈ రైల్వేలైన్‌లో కొత్తగా ఏర్పాటవుతున్న ఎన్టీఆర్ జిల్లా పరిటాల స్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని భావిస్తున్నారు. ఈ లైన్‌లో కవచ్ టెక్నాలజీని ఏర్పాటు చేయనున్నారు. రైళ్లు గరిష్ఠంగా 160 కి.మీ. వేగంతో వెళ్లేలా అమరావతి రైల్వేలైనును పటిష్ఠంగా నిర్మించనున్నారు.

ప్రధాన నగరాలతో అనుసంధానం

అమరావతి నగరానికి రైల్వేలైన్‌ను 2017-18లోనే కేంద్రం మంజూరు చేసినప్పటికీ.. ఈ ప్రాజెక్టు కార్యాచరణ మాత్రం 2024 జూన్ తర్వాతే మొదలైంది. ఖాజీపేట-విజయవాడ సెక్షన్‌లో ఉన్న ఎర్రుపాలెం నుంచి గుంటూరు-విజయవాడ సెక్షన్ మధ్య ఉన్న నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర కొత్త బ్రాడ్‌గేజ్ సింగిల్ రైల్వేలైనుగా నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దీని కోసం రూ.2,245 కోట్ల వ్యయం కానుంది. ఈ రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి నగరం హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, చెన్నై నగరాలతో అనుసంధానమవుతుంది. ఎర్రుపాలెం-నంబూరు మధ్య పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేస్తారు. వీటిలో పెద్దాపురం, పరిటాల, కొప్పురావూరు పెద్దస్టేషన్లుగా, అమరావతి స్టేషన్ అతిపెద్దదిగా ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లా దాములూరు, గుంటూరు జిల్లా వైకుంఠపురం నడుమ కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల పొడవున రైల్వేబ్రిడ్జి నిర్మిస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేస్తామని రైల్వేశాఖ ప్రకటించింది. కానీ, మూడేళ్లలోనే పూర్తయ్యేలా చూడాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అవసరమైన భూసేకరణ పనులు కూడా చాలా వరకు పూర్తయ్యాయి. ఈ రైల్వేలైన్ కోసం ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు మొత్తం 521.22 ఎకరాలను రైల్వేశాఖ సేకరించింది. గుంటూరు జిల్లాలో 199.71 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 297.21 ఎకరాలు, తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో 24.01 ఎకరాలను 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించారు.



వీధి కుక్క దాడిలో మృతిచెందిన బాలుడు ఐజాక్

చిన్నారి గొంతు కొరికి చంపిన వీధి కుక్క

▸ గుంటూరులో ఘోరం

గుంటూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఘోరం జరిగింది. ఓ వీధి కుక్క నాలుగేళ్ల చిన్నారిపై దాడి చేసి, గొంతు కొరికి చంపేసింది. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐద్వానగర్‌కు చెందిన కొమ్మగాని నాగరాజు, రాణి దంపతులకు ముగ్గురు కుమారులు. ఆదివారం వీరు పిల్లలతో కలిసి మందిరానికి ప్రార్థనకు వెళ్లి వచ్చారు. తల్లిదండ్రులు ఇద్దరు పిల్లలతో ఇంట్లోకెళ్లగా.. చిన్న కుమారుడైన ఐజాక్ (4) ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుంటున్నాడు. కొద్ది సమయానికి అటుగా వచ్చిన వీధి కుక్క ఒక్కసారిగా ఐజాక్‌పైకి దూకింది. మెడ కొరికి తీసుకెళ్తుండగా.. బాలుడు పెద్దగా ఏడవడంతో స్థానికులు గమనించి, కుక్కపైకి రాళ్లు విసిరారు. దీంతో కుక్క బాలుడిని వదిలి పరిగెత్తింది. అప్పటికే తీవ్ర గాయాలైన ఐజాక్‌ను తల్లిదండ్రులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఐజాక్ మృతిచెందినట్లు చెప్పారు.

నిమ్మ ధర రెట్టింపు

▸ నెల రోజుల్లో 6 వేల నుంచి 12 వేలకు క్వింటా

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రభావంతో నిమ్మకాయల ధర పెరుగుతోంది. గత నెలలో క్వింటా రూ.6 వేలు ఉన్న ధర ప్రస్తుతం రూ.12 వేలకు చేరింది. ఎండలు, వడగాల్పులు పెరిగే కొద్దీ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెప్తున్నారు. రాష్ట్రంలో ఏలూరు, దెందులూరు, తెనాలి, రాపూరు హోల్‌సేల్ మార్కెట్లకు రోజూ 2వేల క్వింటాళ్ల దాకా నిమ్మకాయలు వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో లక్షా 20వేల ఎకరాల్లో నిమ్మతోటలున్నాయి. ఏటా 10లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. వేసవిలో దిగుబడి తగ్గినా.. 4లక్షల టన్నుల దాకా ఉత్పత్తి వస్తుంది. నీటి వసతి ఉన్న తోటలకు ఈ ఏడాది కాపు బాగానే ఉంది. అయితే ఎండ తెగులు, మంగు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఒక్కో నిమ్మకాయ సైజును బట్టి రూ.4 నుంచి రూ.పది వరకు అమ్ముతున్నారు.

నేరాలపై 'డ్రోన్' కన్ను!

▸ ఇప్పటికే బెజవాడ, తదితర చోట్ల అమలు

▸ రాష్ట్రవ్యాప్త విస్తరణకు పోలీసు శాఖ ప్రణాళిక

▸ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం

▸ గత జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 75 వేలు ఏర్పాటు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో నేరాల కట్టడికి పోలీసు శాఖ నడుం బిగించింది. ఇందుకు అత్యాధునిక సాంకేతికత సాయం తీసుకుంటోంది. ఈ క్రమంలో చెప్పుకోవాల్సింది.. డ్రోన్ డేగ! ట్రాఫిక్ రద్దీ క్రమబద్ధీకరణ నుంచి బహిరంగంగా మద్యపానం సేవించడం, పేకాట, అనుమానాస్పద కార్యకలాపాలు వంటి నేరాల కట్టడికి, శాంతి భద్రతల నిర్వహణకు పోలీసులు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఇప్పటికే విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో అమలవుతున్న దీన్ని.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా 187 డ్రోన్లను వినియోగిస్తోంది. 4,489 బందోబస్తు డ్యూటీల్లో ఇవి సేవలందించాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెజవాడ పోలీసులు ట్రాఫిక్ పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగంలోకి తెచ్చారు. ట్రాకింగ్‌తోపాటు అధునాతన నావిగేషన్ వంటి టెక్నాలజీతో కూడిన ఈ వ్యవస్థ.. మంచి ఫలితాలను అందిస్తోంది. 4 నెలల క్రితం విజయవాడ కమిషనర్ రాజశేఖర్ బాబు డ్రోన్లను ప్రారంభించి, కమిషనరేట్ పరిధిలోని 28 పోలీసుస్టేషన్లకు అందించారు. నగరంలో ఏ సెంటర్లో ట్రాఫిక్ జామ్ అయినా వెంటనే ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలోని డ్రోన్లు గాల్లోకి లేస్తాయి. ఆ ప్రాంతానికి చేరుకుని ఏదైనా వాహనం బ్రేక్ ఫెయిలైందా.? లేదా యాక్సిడెంట్ జరిగిందా? వానకు చెట్టు కూలి రోడ్డుపై పడిందా? అనేది గుర్తించి.. ఆ దృశ్యాలను విజయవాడ సిటీ పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్‌కు పంపుతుంది. తక్షణమే ట్రాఫిక్ పోలీసుల్ని రంగంలోకి దించి వాహనాలను దారి మళ్లించి మార్గం చూపిస్తారు. దీంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిని ప్రతి రోజూ పదుల సంఖ్యలో గుర్తించి చలానాలు రాస్తున్నారు. పదేపదే ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయించేలా ఆర్టీవోకు సిఫారసు చేస్తున్నారు.



గుడివాడ వన్‌టౌన్ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీ వెనుక మందు తాగుతున్న యువకులు. డ్రోన్ సహాయంతో గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు

పరుగులు పెట్టినా.. వదలదు!

నేరం జరిగాక పోలీసులు వచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవడం కన్నా ముందస్తు అప్రమత్తతతో నేరాల్ని నివారించడంలో డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఊరి చివర పాడుబడ్డ భవనాలు, పండ్ల తోటల్లో చేరి ఎవరైనా గంజాయి సేవిస్తున్నా, పేకాట ఆడుతున్నా.. ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నా.. సమాచారం అందిన నిమిషాల్లోనే డ్రోన్లు ఆ ప్రాంతాలకు చేరుకుంటాయి. వాటిని చూసి పరుగులు పెట్టినా వారి ముఖాల్ని డ్రోన్లు గుర్తిస్తాయి. మాస్కులు, ముసుగులు వేసుకుని కొందరు అతి తెలివితో పరుగులు పెట్టినా జేబులో ఉన్న మొబైల్ నెంబర్‌ను ట్రాక్ చేసి పట్టేస్తున్నారు.

తాగుబోతుల వీరంగంపై నిఘా

కొందరు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ.. అటువైపు వెళ్లే వారికి అసౌకర్యం కలిగిస్తుంటారు. ఇలాంటి వారికి చెక్ పెట్టడంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గత 3 నెలల్లోనే విజయవాడ, విశాఖపట్నంలో ఏకంగా 2,151 కేసులు దీనిపై నమోదవడం డ్రోన్ల పనితీరు ఫలితాలకు నిదర్శనం. పబ్లిక్ న్యూసెన్స్, ఈవ్ టీజింగ్, డ్రగ్స్ వినియోగం, ఇతరత్రా నేరాలకు సంబంధించి కూడా కేసులు నమోదయ్యాయి.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలే లక్ష్యం

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనేది పోలీసు వ్యవస్థ లక్ష్యం. గత జూన్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ 75,749 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా.. జూన్ నాటికి లక్ష ఏర్పాటు చేయాలనేది టార్గెట్. ప్రతి గ్రామంలో కనీసం మూడు సీసీ కెమెరాలు పెట్టాలని భావిస్తోంది. ఇటీవల జగ్గయ్యపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో హోంమంత్రి అనిత సీసీ కెమెరాలు ప్రారంభించారు.

డ్రోన్ల ద్వారా నమోదైన కేసులు	
బహిరంగంగా మద్యం సేవించడం	2,151
పబ్లిక్ న్యూసెన్స్	224
ఈవ్ టీజింగ్	37
ట్రాఫిక్ ఉల్లంఘన	974
డ్రగ్స్ వినియోగం	5
ఇతర నేరాలు	81
నిందితులను గుర్తించిన కేసులు	1,902

గతంలో లాఠీ.. ఇప్పుడు డేటా.. ఇకపై ఏఐ

పోలీసింగ్‌లో ప్రధానంగా వినిపించే మాట లాఠీ. అయితే ఇప్పుడు డేటా ప్రధాన పాత్ర పోషిస్తోంది. డ్రోన్లు అందించే దృశ్యాల నుంచి సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా నేరస్తులు, సంఘ విద్రోహ శక్తులను గుర్తించడం తేలికవుతోంది. ఇటీవల మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో 100 మందికి పైగా 7 నుంచి 25 ఏళ్ల జైలు శిక్ష పడింది. రానున్న కాలంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెంచుతాం. ఇప్పటికే ఏలూరులో ప్రారంభమైంది. దీన్ని రాష్ట్రమంతా విస్తరిస్తాం.

- హరీశ్ కుమార్ గుప్తా, డీజీపీ

ఈ 'రీల్స్' రోజుల్లో 'యులీసిస్' చదవగలమా!

ఆధునిక సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన, సంక్లిష్టమైన రచనగా పరిగణించబడే జేమ్స్ జాయిస్ 'యులీసిస్' నవలను మొదట చాలామంది పబ్లిషర్లు తిరస్కరించారు. తర్వాత 1922లో పారిస్‌లోని 'షేక్‌స్పియర్ అండ్ కంపెనీ' యజమాని సిల్వియా బీచ్ ప్రచురించారు. కానీ అశ్లీలత పేరిట ఈ నవలను త్వరలోనే నిషేధించారు. యు.ఎస్. పోస్టల్ సర్వీసు ఏకంగా నవల కాపీలను తగలబెట్టింది. కథాపరంగా చూస్తే 'యులీసిస్'కు ఎటువంటి ప్రత్యేకతలూ లేవు. అతి సాధారణమైన కథను జాయిస్ ఎలా చెప్పారన్నదే దీని ప్రత్యేకత.


డబ్లిన్ నగరంలో కొందరు సాధారణ వ్యక్తుల జీవితంలో ఒకే ఒక్క రోజు (1904 జూన్ 16న), సుమారు 18 గంటలపాటు, జరిగే సంఘటనలను కథగా రాసుకొచ్చారు జేమ్స్ జాయిస్. క్రమమూ లేకుండా ఒకదాన్నొకటి ఢీ కొడుతూనే ఉంటాయి. అందువల్ల 'యులీసిస్' వచనమంతా అనేక పాత్రల ఆలోచనల అంతర్వాహిని అస్తవ్యస్తంగా పెనవేసుకుని చిక్కులు పడిపోయినట్లుంటుంది.


కథలో లియోపోల్డ్ బ్లూమ్, స్టీఫెన్ డెడలస్, మోలీ వంటి ముఖ్య పాత్రలతో బాటు కథ మధ్యలో వస్తూ పోతూ ఉండే ఇతరత్రా పాత్రల 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కూడా కలగాపులగంగా కలిసిపోయి, జాయిస్ వచనాన్ని పాఠకులకు ఓ పట్టాన కొరుకుడు పడనివ్వదు. పాఠకుడికి ఒక సన్నివేశం ఎలా మొదలవుతుందో, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ మాట్లాడడం మొదలుపెట్టారో, సంభాషణ ఎప్పుడు ముగించారో స్పష్టత ఉండదు. వాక్యాల చివర ఫుల్‌స్టాపులూ, కామాలూ ఉండవు. రెండు మూడు పేజీలు పూర్తయినా ఒక్కోసారి వాక్యం ముగింపు కానరాదు. ఇక చివరి అధ్యాయం 'పెనెలోపె'లో అయితే మోలీ అనే పాత్ర స్వగతంగా మొదలైన ఒక వాక్యం మొదట్నుంచి చివరి వరకూ ఆగకుండా అనంతమైన ప్రవాహంలా సాగుతూనే ఉంటుంది. ఏదేమైనా ఐరిష్ సంస్కృతి గురించీ, జేమ్స్ జాయిస్ శైలి గురించీ కనీస అవగాహనలేని సగటు పాఠకుడిని చెయ్యి పట్టుకుని 'యులీసిస్' ఏరు దాటించే 'డిజిటల్ సాయాలు' ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లో అనేకం అందుబాటులో ఉండడం వల్ల ఈ నవల చదవడం ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు తేలికే.

దైనందిన వ్యవహారాల్లోను, మామూలు సంభాషణల్లోను 'ఆర్ట్'ను ఆయన ఎంత వైవిధ్యంగా చూపగలిగారన్నదే ఈ నవల ప్రత్యేకత. నిజానికి ఇప్పటి ఓటీటీ వెబ్ సిరీస్లు, సినిమాలూ, పుస్తకాల్లో కనిపించేంత అశ్లీలత ఈ నవలలో లేదు. అందువల్ల నేటి పాఠకుడికి ఈ పుస్తకంలో షాక్ వేల్యూ పెద్దగా ఏమీ కనిపించదు. కానీ ఆనాటి మతవిశ్వాసాలనూ, సాంఘిక నియమాలనూ సవాలు చేసిన ఈ నవలకు అప్పటి వ్యతిరేకతను అర్థం చేసుకోవచ్చు.

సాహిత్యంలో 'స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్' కథనాలు కొత్తేమీ కాదు. ఉదాహరణకు జులియన్ బార్న్స్ 'ది సెన్స్ ఆఫ్ ఆన్ ఎండింగ్', థామస్ బెర్న్‌హార్డ్ 'ది లూజర్' వంటి నవలల్లో కథంతా ఒకే ఒక్క ముఖ్య పాత్ర తన స్వగతం చెప్పుకుంటున్నట్లు రాశారు. టాల్‌స్టాయ్ 'అన్నా కరెనినా', ఇటీవల నోబెల్ ప్రైజ్ గెలుచుకున్న హాన్ కాంగ్ 'ది వెజిటేరియన్' లాంటి నవలల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ పాత్రల స్వగతాలను ఒక్కొక్కరి దృష్టి కోణం నుంచీ విడదీసి చెబుతారు. ఇప్పుడు జాయిస్ వచనాన్ని పరిశీలిస్తే- ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుష ఈ మూడు రకాల నేరేటివ్‌లూ కథలో ఏ విధమైన

నిర్దిష్టమైన మూలం, నేపథ్యం ఉండే ఇద్దరి మధ్య సంభాషణ, వాటి నేపథ్యం తెలియని మూడో వ్యక్తికి అర్థం కాదు. జాయిస్ నవల ఇటువంటి ఒక 'ఇన్‌సైడ్ జోక్' లాంటిది. ఎటొచ్చీ 'యులీసిస్' రాయడం ద్వారా జాయిస్ ఏ ఒక్క వ్యక్తితోనో గాక మొత్తం ప్రపంచాన్ని తన సంభాషణలో భాగంగా చేసుకునే ప్రయత్నం చేశారు. 'యులీసిస్' శిల్పానికి ఫ్రేమ్ వర్క్‌గా తీసుకున్న హోమర్ కావ్యం 'ఒడిస్సీ' చదివితే ఈ నవల చదవడం తేలికవుతుంది అంటారు కొందరు. కానీ అది అర్ధసత్యం మాత్రమే. కథాపరంగా ఒడిస్సీకీ, యులీసిస్‌కీ పొంతనలుండవు.





ఐదువందల పేజీల పుస్తకాన్ని అరగంట నిడివికి కుదించే వెబ్ సిరీస్‌లూ, అంతకంతకూ క్షీణించిపోతున్న మన అటెన్షన్ స్పాన్‌ని సూచించే అర నిముషం వీడియోలు ఇవన్నీ కలగలసిన 'ఇన్‌స్టంట్' సంస్కృతిలో 'యులీసిస్' లాంటి నవలను చదవడం మెదడును రీవైర్ చెయ్యడం లాంటిది. మొండి పశువు కొమ్ములు బలవంతంగా వంచడంలాంటిది. ఇలాంటి నవలలు మనం నేర్చుకున్నదంతా వదిలించుకుని మళ్ళీ పూర్వపు విద్యార్థిగా మారే అవకాశమిస్తాయి.

కానీ జాయిస్ తన స్నేహితులకు ఇచ్చిన 'గిల్బర్ట్ స్కీమా డయాగ్రమ్'లో ప్రతీ అధ్యాయానికీ 'ఒడిస్సీ' నేపథ్యమేమిటో చెప్పే లంకెలుంటాయి.

నవల మొదటి 10 ఎపిసోడ్ల వరకూ విపరీతమైన పాండిత్య ప్రకర్ష ప్రదర్శించినా, 'సైరెన్స్' ఎపిసోడ్ మొదలు హాస్యం, వ్యంగ్యం, పేరడీలతో జాయిస్ పామరుల కోసమే ప్రత్యేకించి రాస్తున్నారనిపించేంతగా, కఠినమైన వచనాన్ని కొమ్ములు వంచి ఉన్న పళంగా 180 డిగ్రీల మలుపు తిప్పుతారు జాయిస్. ఆయన వచనం ఆయన సృష్టించిన అనేక పాత్రల వెనక ఎక్కడో నక్కి, పాఠకుడితో నర్మగర్భంగా దాగుడుమూతలు ఆడుతున్నట్లు ఉంటుంది. ఆయన తన గురించి ఎన్నో వివరాలను గుక్కతిప్పుకోకుండా చెప్పీచెప్పనట్లు చెబుతూనే, చివరి వరకూ పాఠకుడికి దూరంగా, ఒక అపరిచిత వ్యక్తిగానే మిగిలిపోతారు. జాయిస్ వచనంలో అందరికీ అర్థంకావాలనే ఉబలాటం కనపడదు. "నా గురించి తెలియాలంటే నా ప్రపంచాన్ని నువ్వే ప్రయత్నపూర్వకంగా తెలుసుకోవాలి" అనే కళాకారుడికి ఉండే సాధికారత, అహంకారం జాయ్స్ వచనంలో అణువణువునా కనిపిస్తుంది.

జాయిస్ శైలిలో మనకు నవలంతా స్థిరంగా కనిపించే ఒకే ఒక్క నియమం- ఏ నియమాలూ లేకపోవడమే! మొదటి మూడు చాప్టర్లలో చాలా పకడ్బందీగా కనిపించే వాక్య నిర్మాణం తరువాత చాప్టర్లలో పూర్తిగా వీగిపోతుంది. ఇక్కడ నుండీ పాండిత్య ప్రకర్ష తగ్గి జాయిస్ అసలుసిసలు "Foul play" మొదలవుతుంది. ఇక్కడ నుండీ జాయిస్ వాక్యనిర్మాణపు సంప్రదాయాలకూ, నవలా రచన విధివిధానాలకూ పూర్తి తిలోదకాలిచ్చేస్తారు. ఇక 11వ భాగం 'సైరెన్స్'కి వచ్చేసరికి జాయిస్ స్వరంలోని 'గూఫీ టోన్' తారాస్థాయికి చేరుకుంటుంది. "Bronze by gold heard the hoofirons, steelyrining imperthnthn thnthnthn" అనే వాక్యాలు చదివిన ఎజ్రా పౌండ్ "జాయిస్ తలకు ఏదైనా బలమైన దెబ్బ తగిలిందేమో" అని కలవరపడ్డారంటేనే మనం ఊహించుకోవచ్చు. ఈ నవల నైతిక విలువలనూ, సభ్యతనూ మాత్రమే కాదు, కాల్పనిక సాహిత్య సంప్రదాయాలన్నిటినీ కూకటివేళ్ళతో పెకలించివేస్తుంది. జాయిస్ వచనం కొన్నిచోట్ల ఐరిష్, బ్రిటిష్ రైమ్స్, దేశ విదేశీ కవిత్వం, చరిత్ర, సాంస్కృతిక అంశాలతోనూ, మరికొన్నిచోట్ల వాటికి పూర్తి భిన్నంగా 'gibberish' భాషలో అతి సామాన్యమైన, ఒకింత అర్థంపర్థం లేని సంభాషణలూ, పారడీలతోనూ ఎగుడుదిగుడు రోడ్ల మీద పడుతూ లేస్తూ చేసే ప్రయాణాన్ని తలపిస్తుంది. సాధారణంగా ఆనాటి రచయితలు వాడని అసభ్య భాషని పచ్చిగా ఉన్నదున్నట్లుగా ఎందుకు వాడారని ఎవరో అడిగితే- "ఈ జాతి, ఈ దేశం, ఈ జీవితం నన్ను మలిచాయి-- నేను ఎలాంటి వాడినో అలాగే నన్ను వ్యక్తం చేసుకుంటాను" అని సమాధానం ఇచ్చారు జాయ్స్.

ఐదువందల పేజీల పుస్తకాన్ని అరగంట నిడివికి కుదించే వెబ్ సిరీస్‌లూ, అంతకంతకూ క్షీణించిపోతున్న మన అటెన్షన్ స్పాన్‌ని సూచించే అర నిముషం వీడియోలు ఇవన్నీ కలగలసిన 'ఇన్‌స్టంట్' సంస్కృతిలో 'యులీసిస్' లాంటి నవలను చదవడం మెదడును రీవైర్ చెయ్యడం లాంటిది. మొండి పశువు కొమ్ములు బలవంతంగా వంచడం లాంటిది. ఇలాంటి నవలలు మనం నేర్చుకున్నదంతా వదిలించుకుని మళ్ళీ పూర్వపు విద్యార్థిగా మారే అవకాశమిస్తాయి. ముఖ్యంగా జాయిస్ వాడిన ఐరిష్ యాసతో కూడిన పక్కా లోకల్ భాష మనకి ఇంగ్లీష్ మీద మంచి పట్టు ఉందనే నమ్మకాన్ని తునాతునకలు చేసిపారేస్తుంది. మార్కస్ జూసాక్ నవల 'బుక్ థీఫ్'లో లీసెల్ మెమింగర్ చిన్నప్పుడు చదవడం నేర్చుకుంటున్నప్పుడు ఒక్కో అక్షరాన్నీ కూడబలుక్కుంటూ పదాలను పేర్చుకోవడం గురించి రాస్తారు. అలాగే 'యులీసిస్' నవల మనం బాల్యంలో ఎక్కడో కోల్పోయిన తొలి పాఠకుడిని మరోసారి వెలికితీస్తుంది.

■ నాగిని కందాళ

సోమవారం 7 ఏప్రిల్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'బందారం కథలు' ఆవిష్కరణ

నందిని సిద్ధారెడ్డి కథా సంపుటి 'బందారం కథలు' ఆవిష్కరణ సభ ఏప్రిల్ 8 సా.4.30నిమిషాలకు ప్రెస్ క్లబ్, సిద్దిపేటలో జరుగుతుంది. అధ్యక్షత కె. రంగాచారి; ముఖ్య అతిథి కె. శ్రీనివాస్; ఆత్మీయ అతిథి దేశపతి శ్రీనివాస్; సమీక్ష వి. శంకర్; ఆత్మీయ సందేశం తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య.

సిద్దెంకి యాదగిరి

రెండుతరాల కవిసంగమం

పై కార్యక్రమం ఏప్రిల్ 12 సా.6 గంటలకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి, రహీమొద్దీన్, శ్రీనిధి విప్లవశ్రీ, సందీప్ వొటారికారి, అరవింద్ మైలారపు పాల్గొంటారు.

కవి యాకూబ్

అవార్డుల ప్రదానోత్సవ సభ

చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బండారు ప్రసాదమూర్తి ప్రధాన అవార్డును స్వీకరిస్తారు. ఈ సభ ఏప్రిల్ 13 సాయంత్రం నెల్లూరు పురమందిరం ఏసీ హాలులో జరుగుతుంది. ముఖ్యఅతిథి షేక్ అబ్దుల్ అజీజ్, అధ్యక్షత తుంగా శివప్రభాత్ రెడ్డి, విశిష్ట అతిథి మాడభూషి సంపత్ కుమార్. సభలో పి. శ్రీనివాస్ గౌడ్, కొమ్మవరపు విల్సన్ రావు, అవధానుల మణిబాబు సాహితీ పురస్కారాలను స్వీకరిస్తారు. కవి సమ్మేళనం వుంటుంది.

చిన్ని నారాయణరావు

వి. చంద్రశేఖర రావు పురస్కారం

వి. చంద్రశేఖర రావు జయంతి, పురస్కార సభ ఏప్రిల్ 13 సా.6గంటలకు 2/7, బ్రాడీపేట, కొరటాల భవన్ (సిపియం ఆఫీస్), గుంటూరులో జరుగుతుంది. కథకుడు కె.వి.మేఘనాధ్ రెడ్డి పురస్కారం స్వీకరిస్తారు. సభలో పెనుగొండ లక్ష్మీ నారాయణ, ఎ.కె. ప్రభాకర్, వాసిరెడ్డి నవీన్, కందిమళ్ళ శివప్రసాద్, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు.

వి. ప్రసూన

బాలల నవలల పోటీ ఫలితాలు

తానా - మంచి పుస్తకం ఆధ్వర్యంలో జరిగిన బాలల నవలల పోటీలో ఎంపికైన రచయితలు: ఆర్.సి. కృష్ణస్వామి రాజు ('కుంటోళ్ల కొట్టం'), పాణ్యం దత్త శర్మ ('మనకు మనుషులు కావాలి'), శాఖమూరి శ్రీనివాస్ ('చతుర్ముఖం'), ఎం. సుగుణ రావు ('ఆలీబాబా అయిదుగురు స్నేహితులు'), పి. యుగంధర్ ('జాను అనే నేను, నా స్నేహితురాళ్లు'). ఒక్కొక్కరూ రూ.15వేల పారితోషికాన్ని స్వీకరిస్తారు.

పి. భాగ్యలక్ష్మి

కవితల పోటీ

వాసా ప్రభావతి స్మారకంగా వాసా ఫౌండేషన్ - పాలపిట్ట సంయుక్తంగా నిర్వహిస్తున్న కవితల పోటీకి ఎక్కడా ప్రచురితం కాని, పోస్టు చేయని వచన కవితలను ఏప్రిల్ 30లోగా పంపాలి. ఇతివృత్తం ఏదయినా పరవాలేదు. మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా: రూ.3వేలు, 2 వేలు, 1000. ఎనిమిది కవితలకు రూ.500 ప్రత్యేక బహుమతులు. చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం. 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్-500 044. ఫోన్: 98487 87284, ఈమెయిల్: palapittamag@gmail.com

పాలపిట్ట

బాల్యానికి బయోస్కోపులా.. మాలిమిగా.. లాలనగా..

'నామంకోపు' అని తెల్లగా వేలెడంత ఉండేది. రాత్రిపూట దాన్ని నీటితో అరగదీసి నా చిన్నప్పుడు రెండు కళ్లచుట్టూ పూసేది మా అమ్మమ్మ. ఎందుకని అడిగితే కళ్లకి చలవ నాయనా అని చెప్పేది. తొలకరి మట్టి వాసనతో, కళ్లచుట్టూ చల్లని తడితో, గాంధీ కళ్ళద్దాలు పెట్టుకున్నట్టుండే ముఖాల్ని అద్దంలో చూసుకుని నవ్వుకొనేది పిల్లలం. అలాగ రాత్రిళ్ళు నామంకోపు కళ్లతో ఉన్న చిన్నప్పటి నేనే ఈ కవిత ప్రారంభంలో అందమైన అమాయకపు ప్రశ్న వేసిన 'పిచ్చి కన్నా' అనిపిస్తుంది నాకు.



కరెంటు పోయి కొవ్వొత్తి వెలిగిస్తున్న అమ్మ పిల్లవాడి ప్రశ్నకు చిన్న కథ చెబుతుంది. (నా చిన్నప్పుడు బడి దగ్గరకి ఎవరో బయోస్కోపు తెచ్చేవాళ్లు. దానిలో రంగురంగుల బొమ్మలు ఒకదాని తర్వాత ఒకటి మారిపోతుంటే ఓ కన్ను మూసి మరో కంటితో చూసేవాళ్లం. అచ్చంగా అలా ఉంటుంది ఈ కథ. పాఠకుడ్ని 'పసివాడ్ని' చేసి చెబుతున్నప్పుడు అచ్చంగా అలానే ఉండాలి కథ). కథలో ఆకుల్ని కప్పుకొనే పిట్టల నుంచి పగటినీ రాత్రినీ మార్చి మార్చి కప్పుకొనే భూమి వరకూ ప్రతి ఒక్కటీ నేనే అనిపించి ఉద్వేగం కలుగుతుంది.

"నీకు ముందు, నీ తర్వాత, నీకోసం, ఇంత గొలుసుకట్టు ప్రపంచం ఉండాలి నీ ఇంట్లో, లోకంలో, నీలో - అదే నీకు రక్షణ, భద్రత - అదే నిన్ను ప్రేమించే అందరి నుంచి నువ్వు పొందుకుంటోంది, తిరిగి వాళ్లందరికీ నువ్వు ఇవ్వాల్సింది" అనే జీవిత సత్యాన్ని 'పసిబిడ్డ భాషలో' మాలిమిగా, లాలనగా అమ్మలాగా చెబుతుంటే ఉద్వేగం కలగకుండా ఎలా ఉంటుంది?

చివరికి నిద్రలేమితో ఏళ్లకేళ్లు తీసుకున్నవాడిగా ఆఖరి మూడు వరుసల్లో కథలోనివన్నీ గంధపు వదనంపైన తెరలు తెరలుగా కదలాడుతుండగా అలా నోరు తెరుచుకుని నిదురపోయి ఉండేదీ నేనే...

ఐదేళ్ల క్రితం తొలిసారి చదివిన నాటి నుండి నేటి వరకు ఈ కవిత ఎప్పుడు మదిలో మెదిలినా ఇవే నాకు కలిగే బయోస్కోపు భావనలు, నేను ప్రేమని పొందుతున్న ప్రతి ఒక్కరిపైనా కృతజ్ఞతల్ని కాపాడుతున్న బతుకు తీపి వరాలు.

■ సాలోమోన్ విజయ్ కుమార్

83413 36828

ప్రియ పద్యం

అమ్మ చెప్పిన కథ

"అమ్మా చలేస్తే, మనం దుప్పట్లు కప్పుకుంటాం. మరి పిట్టలూ?"

కరెంట్ పోయిన చీకట్లో కొవ్వొత్తిని వెలిగిస్తూ ఆ తల్లి ఇలా చెప్పింది "పిచ్చి కన్నా, చలేస్తే పిట్టలు ఆకుల్ని కప్పుకుంటాయి ఆకులు ఆకాశాన్ని కప్పుకుంటాయి, ఆకాశం చుక్కల్నీ చుక్కలు నీ కళ్ళనీ కప్పుకుంటాయి. నీ కళ్ళని అమ్మా, అమ్మని నాన్నా, నాన్నని నీ తమ్ముడూ నీ తమ్ముడ్ని తాతా, తాతని నాయనమ్మా నాయనమ్మని ఈ ఇల్లూ కప్పుకుంటుంది. ఈ ఇంటిని వేపచెట్టూ, వేపచెట్టుని నేలా, నేలను గాలీ మరి గాలిని పచ్చని చేలూ, చేలని నీరూ, నీరుని నిప్పూ కప్పుకుంటాయి. ఇక పూలని పురుగులూ, పురుగులని పుట్టలూ, పుట్టల్ని పాములూ పాములని పరమ శివుడూ, ఆ శివుడిని పార్వతీ, పార్వతిని ఈ భూమీ, ఈ భూమిని పగలూ రాత్రీ మార్చిమార్చి కప్పుకుంటాయి. ఇక పడుకుందామా?" అని తను తల తిప్పి పక్కకు చూసేటప్పటికి, మంచంపై పిట్టలూ ఆకులూ పూవులూ చుక్కలూ, నింగీ నేలా నీరూ నిప్పూ గూళ్ళూ చెట్లూ పుట్టలూ పురుగులూ, పగలూ రాత్రీ వెన్నెల వాసనా, చల్లటి నిద్రా తెరలు తెరలుగా కదులాడే గంధపు వదనంతో ఒక పిల్లవాడు అలా నోరు తెరుచుకుని నిదురపోయి ఉన్నాడు!



■ శ్రీకాంత్

దుఃఖం అడ్డుపడ్డ పద్యం

పద్యం గొంతులో పెను దుఃఖం ఏదో అడ్డుపడింది
అందమైన, సొగసు పదాల్ని పలుక లేక
దాని పెదవులు వణికాయి

సముద్రపు చీకటి అగాధాలవలే ఎంతో లోతైన
మహాపర్వత శిఖరాలవలే అత్యున్నతమైన
చిక్కటి చీకటి కారడవుల వలే అతివిస్తారమైన
'కోల్పోవడం, కోరుకోవడం'
అనే అతి క్లుప్త, అత్యంత బరువైన
రెండు మహా పదాల శబ్దాలు
మనిషి హృదయంలో నుండి పలికిన
సన్నటి దుఃఖ జీర వలే దానికి వినపడ్డాయి

ఆ రెండు సర్వోత్కృష్ట
పదాల మధ్య
కవిత్వం ఒక ఊగే ఆశల వంతెనను కడుతుంది

ఆ తరువాత, అనేక మార్లు
వికసించి, వాడి, రాలిపోయి,
పునర్జీవించే జీవితం చేయి పట్టుకుని
ఆ వంతెనపై కవిత్వం మెల్లిగా నడిచింది

మానవ మహా విషాదాన్ని అనునిత్యం
అతి దగ్గరగా చూసే
పద్యం గొంతులో ఎప్పుడూ
దుఃఖ సుడిగుండాలు అడ్డుపడతాయి

వణికే దాని పెదవులు
అయినా పలుకుతాయి ఇలా
జీవించు, పోరాడు, జీవించు

■ విమల



ద్రావిడ సంస్కృతికి దర్పణంగా 'బర్మాకేంపు'

వేరే ప్రాంతాలకి వలస వెళ్ళి అక్కడి మనుషులతో, జీవన విధానాలతో సామరస్యం కోసం నిరంతరం ఘర్షణ పడిన జీవితాలను సాహిత్యంలో కొంతమేరకి చదివాము. కానీ విశాఖపట్నం నడిబొడ్డున ఉన్న బర్మాకేంపు కాందిశీకుల జీవితాలలో ప్రత్యేకమైనది. తన బాల్యాన్ని అక్కడ గడిపిన **హరి వెంకట రమణ** ఆ కాలాన్ని నమోదు చేస్తూ 'బర్మాకేంపు కథలు' రాశారు. వస్తురూప వైవిధ్యం రీత్యా కొత్త చేర్పునిచ్చిన ఈ కథకునితో ముఖాముఖి.

ఇంటర్వ్యూ ■ కె.ఎన్. మల్లీశ్వరి

బర్మాకేంపులో తిరుగాడిన బాలుడిని సాహిత్యంలోకి తేవడానికి ఎలాంటి ప్రయత్నం చేసారు?

గట్టి ప్రయత్నమే చేసాను. నాదసలు జీవితమే కాదు, రాసేది సాహిత్యమే కాదు అనే స్థాయి నుంచి, ఇది కదా రాయాల్సింది అని తెలుసుకోవడానికి చాలాకాలం పట్టేసింది. అప్పుడు ఈ కథల్లోని బాలుడు సాహిత్యం లోకి రాక తప్పింది కాదు- ఇల్లిల్లూ తిరిగిన అనుభవాలు, అధోలోకపు జీవులతో పరిచయం వల్ల సాహిత్యంలోకి అతన్ని తీసుకురాక తప్పింది కాదు. చెప్పింది బాలుడి జీవితం నుంచే కానీ చెప్పిందంతా బర్మాకేంపులోని పెద్దల జీవితాలు, పాటలు, చావులు, నీళ్లు, రౌడీలు, ఉద్యమాలు, తగలబడిన పాకలు. అయితే విషాదాన్ని గెడ్డ అడుగున మట్టిలా ఉంచి తేటనీరు ప్రవహించినట్లుగా చిన్నపాటి హాస్యం, వ్యంగ్యంతో కథలు చెప్పే ప్రయత్నం చేసాను. రాస్తున్న ప్రతిసారీ దృశ్యప్రధానంగా ఉందా లేదా అనే కొట్టుకులాడాను. ఒకప్పుడు బర్మాకేంపుకి వస్తావా అంటేనే ఆటోవాళ్ళు భయపడి రాని ఊరు అది. అక్కడింత వైవిధ్యం గల మనుషులు, జీవితాలు వుంటాయని చెప్పడం; పిల్లాడి మనస్తత్వంతో ఎటువంటి జడ్జిమెంట్ లేకుండా కథలు చెప్పాలనుకోవడం; అన్వేషణ, ప్రశాంతత, నింపాదితనం అదే ఈ బర్మాకేంపు బాలుడిని సాహిత్యంలోకి లాక్కొచ్చింది.



మీ బాల్య జ్ఞాపకాలు రాయాలని ఎందుకు అనుకున్నారు?

బర్మాకేంపు జీవితాన్ని నమోదు చేయాలనుకున్నాను. కన్న ఊరికే కాందిశీకులైనవారి గురించి రాయాలనుకున్నాను. కానీ ఎలా చెప్పాలన్నది పెద్దసమస్య. మనసాహిత్యంలో పేదవాళ్ళు, శ్రామికులు, కిందిలోకపు జీవితాలను రాయాలంటే వాళ్లకు వున్న కష్టాలు చాలక ఇంకొన్ని కష్టాలు కల్పించడం చూసాను. నలభై గ్రామాల పూరు కంచరపాలానికి శివారు అయిన స్మశానానికి ఆవల ఇచ్చిన స్థలంలో అందమైన ద్రావిడ సంప్రదాయాన్ని నిర్మించుకున్న శ్రామికుల ఊరు గురించి రాసేను. ఉత్తరాంధ్రలో వున్న ఒక గొప్ప సంస్కృతి ఏమిటంటే ఏదుంటే అది తింటారు, తిన్నదానితో వుంటారు, పనుంటే చేస్తారు, లేదా కాలక్షేపం చేస్తారు కానీ పిరికిగా చావరు. ఎన్ని కష్టాలు వొచ్చినా ఉత్సవ వసంతం వాళ్ళ జీవితాల్లోకి ఆహ్వానిస్తారు. ఇదంతా అందరితో పంచుకోడానికే రాశాను. జ్ఞాపకాలతో, బాల్యంతో కనెక్ట్ కాని వారు ఉండరు అనే నమ్మకంతో పిల్లవాడి దృష్టికోణంతో స్వచ్ఛంగా అతనికి తెలిసింది మాత్రమే చెప్పాను.



ఒకప్పుడు బర్మాకేంపుకి వస్తావా అంటేనే ఆటోవాళ్ళు భయపడి రాని ఊరు అది. అక్కడింత వైవిధ్యం గల మనుషులు, జీవితాలు వుంటాయని చెప్పడం; పిల్లాడి మనస్తత్వంతో ఎటువంటి జడ్జిమెంట్ లేకుండా కథలు చెప్పాలనుకోవడం; అన్వేషణ, ప్రశాంతత, నింపాదితనం అదే ఈ బర్మాకేంపు బాలుడిని సాహిత్యం లోకి లాక్కొచ్చింది.

బర్మాకేంపు మానవసంబంధాలలో మీరు గుర్తించిన పరిణామం ఏమిటి?

ఒకప్పటి సమష్టితత్త్వం ఇప్పుడు లేదు. నూకాలమ్మ తల్లి కాస్త నూకాంబిక అయ్యింది. బయట నుంచి వచ్చినవాళ్ళు కొన్న ఆ కొంచెం స్థలంలో మూడంతస్తుల ఇళ్లు కట్టారు, అద్దెలకిచ్చారు. కొత్తగా వొచ్చిన వాళ్ళకి కాందిశీకులంటే తెలీదు. ఇప్పుడక్కడ అభ్యుదయ ఉద్యమాలు చేసేవాళ్ళు లేరు. వాళ్లంతా కాలనీలకు, సౌకర్యంగా వున్న ప్రదేశాలకు తరలిపోయారు. చాలా చర్చిలు వచ్చాయి. ఒకప్పుడు ఊరందరికీ ఒక్క గుడే ఉండేది ఇప్పుడు కొత్త గుడులు వొచ్చాయి. జనం ఇప్పుడు కూడా కొట్టుకుంటున్నారు, కానీ తిరిగి కలుసుకోవటం లేదు. ఒకప్పుడు విశాలమైన ప్రదేశంలో అగ్నిగుండం తొక్కేవారు ఇప్పుడు దానికి స్థలమే లేదు. స్మశానం బయట అందమైన పెయింటింగులు వొచ్చాయి కానీ స్మశానంలోని పొగమాత్రం అందరిముక్కుల్లోకి ప్రతిరోజూ దూరుతుంది, ఇప్పటి వినిమయ సంస్కృతిలాగ. అయినా నగరంలో బ్రతకడానికొచ్చిన వాళ్ళని బర్మాకేంపు నేనున్నానని ఇంకా చేరదీస్తుంది.

ఈ కథలు రాయటం మీపై ఎలాంటి ప్రభావం చూపింది?

బర్మాకేంపు, ఒక జీవితాన్ని శ్రామికుల దృష్టితో ఎలా చూడాలో నేర్పింది. ద్రావిడ సంస్కృతి అంటే ఏంటో ప్రత్యక్షంగా చూపించింది. ప్రజల పట్ల, జీవితంపట్ల ఉండాల్సిన దృష్టి ఏంటో అర్థమయ్యేలా చెప్పింది. కొన్నిసార్లు గెలుస్తాము, చాలాసార్లు ఓడిపోతాము. 'అయితే ఏంటి' అన్న ధీమా ఇచ్చింది. ఈ వెలుగులో తర్వాత రాసిన 'మాబడి కథలు' అభ్యుదయ కుటుంబాలలో వున్న పిల్లవాడి ప్రభుత్వ పాఠశాల అనుభవాలు, మానవ సంబంధాల్లో పైకి కనపడని కులం ఇతర డైనమిక్స్ ఎలా వుంటాయో చెప్పేవి. 'పెందుర్తి.ORG కథలు' ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, మధ్యతరగతి కుటుంబాలలో తెచ్చిన మార్పులను రికార్డు చేసేవి. మనుషుల్ని ప్రేమించడం, నిమ్మళత్వం, హక్కు కోసం కొట్లాడటం అనే తాత్త్విక భూమిక మాత్రం బర్మాకేంపుదే. ■



● ఆణిముత్యములు తలంబ్రాలుగా..

సీతారాముల కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బీసెంట్ రోడ్డులో జరిగిన వేడుకల్లో సీతారాముల ఉత్సవమూర్తులకు తలంబ్రాలు పోస్తూ వివాహ తంతును జరిపిస్తున్న అర్చకుడు



6

చక్కగా చురకలు

నందిగామ నియోజకవర్గంపై చంద్రబాబు సమీక్షతో నేతల్లో అంతర్మథనం

- ఆపరేషన్ గరుడతో నేతలపై సీఎం నిరంతర నిఘా
- నవ్వుతూ, నవ్విస్తూ నాయకులకు సుతిమెత్తని హెచ్చరికలు
- కార్యకర్తల్లో జోష్‌నింపిన ప్రసంగం... కీలక నేతల్లో కలవరం
- నందిగామలో తీవ్ర చర్చనీయంశంగా చంద్రబాబు ర్యాంకింగ్

ప్రజాప్రతినిధులు, నాయకుల కదలికలు, వారి పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ గరుడ' ఏ మేరకు ఫలితాలను ఇస్తుందో శనివారం నాటి నందిగామ నియోజకవర్గ సమీక్ష సమావేశం స్పష్టం చేసింది. చందర్లపాడు మండలం ముప్పాళ్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు ప్రసంగించిన తీరు ఈ విషయాన్ని తేటతెల్లం చేసింది. నిత్యం అమరావతిలో ఉంటూ.. నందిగామ నియోజకవర్గంలోని పరిస్థితి, ఇక్కడి నేతల పనితీరు, పరిస్థితులను ఆయన స్పష్టంగా చెప్పడం కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేసింది. సుతిమెత్తగా మాట్లాడుతూనే ఘాటుగా హెచ్చరించడం కీలక నేతల్లో కలవరానికి కారణమైంది. బూత్‌లు, క్లస్టర్లు, యూనిట్లు, మండల, టౌన్ పార్టీలతో పాటు ఎమ్మెల్యే వరకూ అందరి పనితీరును ఆవిష్కరించిన చంద్రబాబు.. పార్టీ పరిస్థితిపై ఎంతమేర అప్రమత్తంగా ఉంటారో తెలియజేసింది.



నందిగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నిర్వహించిన ఈ సమీక్షతో నందిగామలోని స్థానిక నేతలు ఉలికిపాటుకు గురికాగా, కార్యకర్తల్లో మాత్రం జోష్ నెలకొంది. నియోజకవర్గంలో ఏం జరుగుతుందన్న అంశంపై చంద్రబాబు డేగకన్నుతో చూస్తున్నారని, అందరి జాతకాలు ఆయన వద్ద ఉన్నాయంటూ కార్యకర్తలు చెబుతున్నారు. తమను స్థానిక నేతలు నిర్లక్ష్యం చేసినా.. చంద్రబాబుకు మాత్రం తమపై ప్రేమ ఉందని తెలిసిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నేతలకు సీ గ్రేడ్ ఇవ్వడాన్ని వారు స్వాగతిస్తున్నారు. కార్యకర్తలే తనకు ముఖ్యమని, వారితో సంబంధాలు లేని నేతలకు ఉద్వాసన తప్పదంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు కేడర్‌ను ఆనందంలో ముంచెత్తింది. గ్రామాల్లో కనీస పట్టు లేకపోయినా పైరవీలతో పదవులు తెచ్చుకుని

మిగతా 6లో..



గన్నవరం వద్ద కుంగిన ఆర్‌వోబీ



గన్నవరం వద్ద ఆర్‌వోబీ పునర్నిర్మాణం

కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం కారణంగా విజయవాడ వెస్ట్ బైపాస్‌లో నిర్మించిన కీలకమైన ఆర్‌వోబీలు దేనికీ పనికి రాకుండాపోయాయి. చిన్న అవుటపల్లి నుంచి జక్కంపూడి వరకు నిర్మించిన వాటిలో కొన్నింటిని మట్టితో సహా తొలగించి తిరిగి పునర్నిర్మించాల్సిన దుస్థితి ఏర్పడింది. ల్యాంకో విద్యుత్ లైన్ల అలైన్‌మెంట్‌పై రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించటంతో జరుగుతున్న జాప్యం వల్ల కాంట్రాక్టు సంస్థ గుట్టుచప్పుడు కాకుండా ఈ ఆర్‌వోబీలను తొలగించి మళ్లీ పునర్నిర్మిస్తోంది. అదే రైతుల వివాదం లేకపోతే.. గొల్లపూడి వరకు వెస్ట్ బైపాస్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చేది. ఆర్‌వోబీలు కుంగిపోయి పరువుపోయేది. అంతా మంచికే అన్నట్టు రైతుల వివాదం కాస్తా కాంట్రాక్టు సంస్థకు కలిసొచ్చింది.

నిర్లక్ష్యం

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కుంగిన కీలక ఆర్‌వోబీలు

- పిన్నమనేని దగ్గర, గన్నవరం, జక్కంపూడిలో తొలగింపు
- రెండుచోట్ల పునర్నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ
- రైతుల వివాదం నేపథ్యంలో వెలుగుచూడని వ్యవహారం
- కోర్టు వివాదాలతో జాప్యం.. పునర్నిర్మాణానికి వెసులుబాటు

అదే ఇప్పటికే ప్రారంభించి ఉంటే.. పరువు పోయేది!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల్లో అంతులేని నిర్లక్ష్యం చోటు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనుల్లో అణువణువునా అలసత్వమే రాజ్యమేలుతోంది. గతంలో వేసిన రోడ్డుకు బీటలు వారిన ఘటనలను పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. తాజాగా ఆర్‌వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)లనే పూర్తిగా తొలగించి మళ్లీ పునర్నిర్మిస్తున్నారంటే ఎంత భారీ స్థాయిలో లోపాలు చోటు చేసుకున్నాయో అర్థమవుతోంది. చిన్న అవుటపల్లి నుంచి జక్కంపూడి వరకు నిర్మించిన ఆర్‌వోబీలు లోపభూయిష్టంగా నిర్మాణాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తగిన పర్యవేక్షణ లేకపోవటంతో ఆర్‌వోబీల పనులు ఇష్టారాజ్యంగా జరిగాయి. నిర్మించిన ఆర్‌వోబీలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దీంతో మళ్లీ ఈ ఆర్‌వోబీల పునర్నిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ చేపడుతోంది. చాలా కీలకమైన, అత్యంత ప్రధానమైన ఆర్‌వోబీలనే తొలగించి పునర్నిర్మించాల్సి వస్తోంది.

అన్ని కీలకమైన ఆర్‌వోబీలే..

పదహారవ నంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)కి అనుసంధానంగా కృష్ణాజిల్లా చిన్న అవుటపల్లి నుంచి మొదలయ్యే వెస్ట్ బైపాస్ పనుల్లోనే నిర్లక్ష్యం చోటు చేసుకుంది. పిన్నమనేని మెడికల్ కాలేజీ ఎదురుగా వెస్ట్ బైపాస్ ప్రారంభమే ఆర్‌వోబీతో మొదలవుతోంది. అతిపెద్ద ఆర్‌వోబీ ఇది. ఈ ఆర్‌వోబీని సరిగా నిర్మించలేదు. దీంతో ఈ ఆర్‌వోబీని మొత్తంగా తొలగించి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ ఆర్‌వోబీ దాటిన తర్వాత మర్లపాలెం ఫ్లై ఓవర్ వస్తుంది. మర్లపాలెం ఫ్లైఓవర్ దాటిన తర్వాత గన్నవరం - నూజివీడు రోడ్డులో గన్నవరం ఆర్‌వోబీ వస్తుంది. ఈ ఆర్‌వోబీని కూడా ఇంతకు ముందే నిర్మించారు. ఈ ఆర్‌వోబీని కూడా ఇప్పుడు పూర్తిగా తొలగించేశారు. పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. జక్కంపూడి పాముల కాల్వ దగ్గర కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. ఇంకా ఇక్కడ పునర్నిర్మాణ పనులు చేపట్టలేదు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లోనే అత్యంత కీలకమైన ఆర్‌వోబీలు ఎందుకు పనికిరాకుండా పోవటం.. వాటిని పునర్నిర్మించాల్సి రావటం పెనుసంచలనంగా మారింది.

పనుల్లో తీవ్ర అలసత్వం

పునర్నిర్మాణం చేస్తున్న ఆర్‌వోబీలన్నీ కూడా బయటకు చొచ్చుకు వచ్చేశాయి. ఇవి కూలి సర్వీసు రోడ్డు మీద పడే పరిస్థితి రావటంతో.. వీటిని గప్‌చుప్‌గా భారీ ఎత్తున ప్రొక్లెయిన్లు, లారీలను సిద్ధం చేసి తొలగించేశారు. ఈ ఆర్‌వోబీలలో వీయూపీ దగ్గర కాంక్రీట్ స్లాబ్ తప్పితే రెండు వైపులా నిర్మించిన అప్రోచ్‌లు కుంగిపోయాయి. భారీ ఎత్తున కాంక్రీట్ పలకలను జాయింట్ చేస్తూ నిర్మించిన గోడలు వెలుపలకు తన్నుకువచ్చాయి. ఈ గోడలను నిర్మిస్తున్న దశలోనే మట్టిని నింపి రోలింగ్ చేపట్టారు. ఒకవైపు గోడలను నిర్మిస్తున్న దశలోనే మట్టిని బాగా రోడ్డు రోలర్స్‌తో తొక్కించి సమాంతరంగా అటు వాల్, ఇటు మట్టి ఫిల్లింగ్‌ను చేపట్టారు. ఈ పనుల్లో నిర్లక్ష్యం చోటు చేసుకుందని తెలుస్తోంది. వాల్‌గా కాంక్రీట్ బ్లాక్స్‌ను అనుసంధా నించటంలో కూడా లోపాలు చోటు చేసుకున్నాయని సమాచారం. మట్టిని ఫిల్ చేసే విషయంలో కూడా రోలింగ్ సరిగా చేయకపోవటంతో అటు వాల్స్, ఇటు మట్టి మధ్యన బ్యాలెన్స్ తప్పి బయటకు చొచ్చుకువచ్చి కూలటానికి సిద్ధమైనటు సమాచారం.

మిగతా 6లో..

పండుగ రోజు విషాదం

అవనిగడ్డలోని కొత్తపేట రేవులో మునిగి ముగ్గురు బాలురు మృతి

- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు
- మృతులంతా మోదుమూడికి చెందినవారే..
- ప్రాణాల మీదకు తెచ్చిన డీజే సరదా
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు









కిరణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు.. పక్కన.. మృతులు యతిరాజు, కిరణ్, వీరబాబు (ఫైల్ ఫొటోలు)

శ్రీరామనవమి పండుగ రోజు అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో పెను విషాదం జరిగింది. రాములోరి కల్యాణం కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన మందిరాన్ని కృష్ణానదిలో శుద్ధి చేయించేందుకు తీసుకెళ్లిన కార్యక్రమంలో భాగంగా నీటిలో మునిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. వీరిలో అన్నదమ్ముల పిల్లలు ఇద్దరు ఉండటం, వారు కూడా వారసులుగా ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అవనిగడ్డ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏటా శ్రీరామనవమి పర్వదినాన్ని మోదుమూడి గ్రామంలో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. గ్రామంలో ఏర్పాటు చేసుకునే రామ స్థూపాన్ని నదికి తీసుకెళ్లి శుభ్రపరిచి అనంతరం సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తారు. ఈ ఏడాది కొత్తగా డీజే పెట్టి శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించాలని స్థానిక యువకులు నిర్ణయించుకుని మత్తి గోపీ కిరణ్ ఇంటి సమీపంలో చిన్న మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల్లోపు రామస్థూపాన్ని కొత్తపేట కృష్ణానది ఘాట్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లగా, డీజేల హడావిడితో మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కొత్తపేట రేవుకు చేరుకున్నారు. ఆ సమయంలో ఘాట్ వద్ద ఎవరూ లేకపోవటంతో ఎనిమిది మంది యువకులు స్నానాలకు దిగారు. కొత్తగా ఏర్పడిన గుండాల్లో పడి మత్తి గోపీ కిరణ్ (15), వీరబాబు (15), యతిరాజు (16) గల్లంతయ్యారు. వెంటనే వారితో వచ్చిన వారు కొత్తపేట గ్రామానికి సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా, యతిరాజ్ మృతదేహం నది ఒడ్డునే లభించింది. గోపీ కిరణ్, వీరబాబు జాడ తెలియకపోవడంతో వెంటనే గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలసి గాలింపు చర్యలు చేపట్టారు. నాగాయలంక, పులిగడ్డ గ్రామాల నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. ఘాట్ ఎదురుగా కొత్తగా ఏర్పడిన గుండాల్లో

మిగతా 6లో..

కనికరం లేని కన్నపేగు

- ప్రియుడితో కలిసి కన్నబిడ్డకు చిత్రహింసలు
- హైదరాబాద్ తీసుకెళ్లి ఒంటినిండా వాతలు





చిన్నారి ముఖం, చేతిపై కాలిన గాయాలు

విజయవాడ/చిట్టినగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కన్నపేగుకు కనికరం కలగలేదు. అభం శుభం తెలియని చిన్నారి అనే జాలి చూపలేదు. తన అక్రమ బంధానికి పేగుబంధం అడ్డనుకుంది. ప్రియుడితో కలిసి మూడేళ్ల చిన్నారికి నరకం చూపించింది. కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆదివారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి కాలనీకి చెందిన వందనకు మూడేళ్ల కుమార్తె ఉంది. తల్లిదండ్రులు వివాహం చేసిన భర్తతో విడిపోయాక మరో వ్యక్తితో బంధాన్ని కొనసాగించింది. కొద్దిరోజుల క్రితం దీనికీ ఫుల్‌స్టాప్ పెట్టింది. చిట్టినగర్‌లోని కలరా ఆసుపత్రికి సమీపాన ఉండే శ్రీరాములు అనే యువకుడితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. చిన్నారిని తీసుకుని వందన, శ్రీరాములు కొద్దినెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. అక్కడకు వెళ్లాక శ్రీరాములు, వందన కలిసి చిన్నారికి వాతలు పెట్టారు. తిరిగి 20 రోజుల క్రితం చిన్నారిని తీసుకుని నగరానికి వచ్చారు. రైల్వేస్టేషన్ నుంచి శ్రీరాములు తన తల్లి సుమలతకు ఫోన్ చేసి రప్పించుకున్నాడు. చిన్నారిని ఆమెకు అప్పగించి ఇద్దరూ వెళ్లిపోయారు. చిన్నారిని ఇంటికి తీసుకొచ్చిన తర్వాత

మిగతా 6లో..



గంజాయి పుష్పలు

ముందు కూలీలు... ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు

- గంజాయి సరఫరాలో అంతకంతకూ ఎదుగుతున్న స్మగ్లర్లు
- ఒడిశా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
- స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
- రెండు రోజుల కిందట నగరంలో అరెస్టు
- విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు

ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు... ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిశా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : షేక్ షాజిద్... చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్.. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండు రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. చిత్తూరు జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడుసార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం చిత్తూరు జిల్లాలో పట్టు పురుగులు

మిగతా 6లో..

ఆక్వాపై అగ్రరాజ్యం సెగ

- ఎగుమతులపై 27 శాతం సుంకం విధించిన అమెరికా
- 30 కౌంట్ ఉన్న రొయ్యల ఎగుమతికి కిలోకు రూ.130 అదనపు భారం..
- పెరిగిన మేత ధరలతో అవస్థలు
- నిలిచిన 50 కౌంట్ కంటే తక్కువ ఉన్న రొయ్యల కొనుగోళ్లు
- ఇప్పటికే విద్యుత్ చార్జీల రూపంలో రైతులపై పెనుభారం



ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిపై అగ్రరాజ్యం అమెరికా విధించిన 27 శాతం సుంకం జిల్లాలోని ఆక్వా పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సుంకం కారణంగా 30 కౌంట్ ఉన్న రొయ్యలను ఎగుమతి చేయాలంటే కిలోకు రూ.130 అదనపు భారం పడనుంది. ఇప్పటికే 50 కౌంట్ కంటే తక్కువ ఉన్న రొయ్యల కొనుగోళ్లను ఎగుమతిదారులు నిలిపివేశారు. విద్యుత్ చార్జీల రూపంలో ప్రస్తుతం రైతులు పెనుభారం మోస్తున్నారు. పెరిగిన మేత ధరలతో అవస్థలు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆక్వా సాగు ఎలా చేయాలి అనే అంశం రైతుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

కథనం 6లో..

రెండేళ్లకే ప్రపంచ రికార్డు

చిన్నారి ఆర్నా మేధస్సు

6

కనకదుర్గమ్మకు కదంబ పుష్పార్చన




ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల చింతలు తీర్చే చింతామణి గృహ నివాసిని కనకదుర్గమ్మకు చైత్రమాస వసంత నవరాత్రుల్లో ఎనిమిదో రోజైన ఆదివారం కదంబపుష్పాలను సమర్పించారు. శ్రీచక్ర నగరవాసిగా దుర్గమ్మను కొలుస్తారు. మొత్తం 25 ప్రాకారాల మధ్యలో ఉండే అమ్మవారిని ప్రసన్నం చేసుకోవాలంటే సుగంధభరితమైన పుష్పార్చనతోనే సాధ్యమని చెబుతారు. అందుకనే అమ్మవారికి కుంకుమ పూజతో పాటు పుష్పార్చన కూడా ప్రధానమైనది. ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మవారిని ఆదివారం సుగంధ పరిమళ భరిత సంపెంగలు, చామంతి పూలతో అర్చించారు. మరువం, దవనం, మందారాలు, గులాబీలు, ఎర్ర తామరపూలు, వంటి వాటిని అమ్మవారికి సమర్పించారు. పూజ అనంతరం పంచహారతులు ఇచ్చి శాంతి మంత్రాలు చదివి ముగించారు. భక్తులకు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు.



ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

సీతారాముల కల్యాణం
చూతము రారండి..

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణం క్రతువును స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్‌లు నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితరాల అనంతరం వరపూజ నిర్వహించారు. కంకణధారణ, ఉత్తర జంధ్యాలు వంటి కార్యక్రమాలను వరుడు శ్రీరాముడు పరంగా నిర్వహించారు. కన్యావరణాలు చదివి సీతమ్మ ఉత్సవమూర్తికి వివిధ ఉపచారాలు చేశారు. ఆమెకు కూడా కంకణధారణ చేశారు. ప్రవరులలో అచ్యుత గోత్రోద్భవులు శ్రీరామచంద్రమూర్తికి, సౌభాగ్య గోత్రోద్భవిని సీతామహాలక్ష్మికి వివాహం చేస్తున్నట్టుగా మంత్రపూర్వకంగా ప్రక్రియను నిర్వహించారు. కన్యాదాన క్రమాన్ని మంత్రపూర్వకంగా చెప్పారు. భక్తులను కన్యాదాతలుగా అభివర్ణిస్తూ అటు పదితరాలు, ఇటు పదితరాలు, ఇప్పటితరం మొత్తం 21తరాలు కన్యాదానంవల్ల తరిస్తాయంటూ భక్తులకు వివరించారు. అనంతరం ముహూర్త సమయానికి మహా సంకల్పం చెప్పి జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని శ్రీరాముడు, సీతమ్మ ఉత్సవ మూర్తుల శిరస్సులపై ఉంచారు. మేళ తాళాలు, భక్తుల శ్రీరామ నామం మధ్య వేడుకగా మంగళసూత్రధారణ జరిపించారు. భక్తజన కోలాహలం మధ్య తలంబ్రాల కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు తలంబ్రాల సమయంలో భక్తులు రాములవారిని, సీతమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడి, శ్లోకాలు చదివారు. శ్రీరామ జయరామ జయజయరామ అంటూ భజనలు చేశారు. అనంతరం మాలా పరివర్తన కార్యక్రమాలను నిర్వహించి మంగళహారతులు ఇచ్చి భక్తులకు ఆశీస్సులు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు.

బీసెంటు రోడ్డు రామాలయంలో..



గవర్నర్‌పేట : సీతారామకల్యాణ మహోత్సవ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బీసెంట్ రోడ్డు రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణ మూర్తులను ప్రత్యేక వాహనంపై వాయిద్యాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. పోలవరపు వెంకటకృష్ణ సుకుమార్, రాధిక దంపతులు ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. బూర్లగడ్డ కృష్ణకిషోర్, ధనలక్ష్మి దంపతులు మూలవిరాట్ సన్నిధిలో కళ్యాణం జరిపారు. కళ్యాణం అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని మోడరన్ కేఫ్ యజమాని మురళి రూ.57 వేలకు పాడుకున్నారు. కమిటీ అధ్యక్షుడు నీలం భానుమూర్తి, ఉపాధ్యక్షుడు బూర్లగడ్డ కృష్ణకిషోర్, కార్యదర్శి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి పోతిన రామప్రసాద్, సభ్యులు కళ్యాణ వేడుకలను పర్యవేక్షించారు.

బందర్ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో..



కళ్యాణ మహోత్సవంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

గుణదల : విజయవాడ నగరం మహాత్మాగాంధీ రోడ్డులోని ఏర్ గ్రౌండ్స్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వైభవంగా కల్యాణ మహోత్సవం జరిపించారు. డీసీపీలు సరిత, ఉదయరాణి, ప్రసాద్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దశావతార సన్నిధికి పోటెత్తిన భక్తులు

» భక్తులకు భారీగా అన్నసంతర్పణ

పెదకాకాని, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల ఈ దశావతార వెంకన్న స్వామి దివ్య క్షేత్రంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. వేదమంత్రాలతో సాంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో రాములవారు, సీతాదేవి ఉత్స విగ్రహాలను ఏర్పాటుచేసి కల్యాణం జరిపించారు. వేలాది మంది భక్తుల ఆనందోత్సాహాల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఇక్కడ రమణీయంగా జరిపించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాలతోపాటు హైదరాబాదు నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కల్యాణ అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. భక్తులకు కళ్యాణాన్ని పురస్కరించుకొని భారీ అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రెండేళ్లకే ప్రపంచ రికార్డు

» చిన్నారి ఆర్నా అద్భుత మేధస్సు



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పిట్ట కొంచెం కూత ఘనం.. సామెతను నిజంచేస్తూ చిన్నారి అద్భుతమైన మేధస్సుతో ప్రపంచ రికార్డు సాధించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న వెంకట శివ, తేజస్వీల కుమార్తె ఆర్నా చింతలపూడి రెండేళ్ల వయస్సులోనే అద్భుత మేధాశక్తితో రెండు నిమిషాల వ్యవధిలో 36 సముద్ర జంతువులను గుర్తించడంతో పాటు వాటి పేర్లను చెబుతోంది. గత మార్చి 18న కాలిఫోర్నియాలోని ఫ్రీమౌంట్‌లో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు నెలకొల్పినట్టు పటమటలో ఉంటున్న చిన్నారి తాతయ్య వీరేంద్రకుమార్ తెలిపారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు

మద్దతు ధరకే ధాన్యం కొనాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



రైతులతో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తేమశాతం ఎక్కువగా ఉందని కుంటి సాకులు చెప్పకుండా రబీలో ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. ధాన్యం విక్రయాల్లో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం కారణంగా రైతులు దళారులకు ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క వాతావరణం.. మరో పక్క అధికారులు అన్నదాతలతో ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. దీంతో రైతులు బస్తాకు రూ.500లు తక్కువగా అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. బుడమేరు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడం బాధాకరమన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, అధికారులు, మిల్లర్లు కలిసి రైతుల కష్టార్జితాన్ని కాజేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన గోనెసంచులను అందించాలన్నారు.

నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కీలకమైన ఆర్‌వోబీలు బయటకు చొచ్చుకురావటం వల్ల తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడటానికి అనేక కారణాలు ఉంటాయని ఇంజినీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఫౌండేషన్ సమస్యలు కనిపిస్తున్నాయని, సాయిల్ టెస్ట్ సరిగా నిర్వహించారా అన్న దానిపై కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బలహీనంగా ఉన్న సాయిల్‌పై ఆర్‌వోబీని నిర్మిస్తే అది కుంగిపోవటానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. బలహీనమైన సాయిల్ ఈ ప్రాంతాల్లో ఉండి ఉంటే సాయిల్ టెస్ట్‌లో తెలిసేదని, దీని ద్వారా దృఢంగా ఆర్‌వోబీ ఏ విధంగా చేపట్టాలన్నది తెలుస్తుందని పేర్కొంటున్నారు. బలహీనమైన పునాదులు వేసినా కూడా ఈ పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. ఈ పునాదుల చుట్టూ వర్షపునీరు చేరినా మెత్తబడి కుంగిపోవటానికి అవకాశం ఉంటుందని, కిందటి సారి కురిసిన భారీ వర్షాల సందర్భంలోనే ఈ ఆర్‌వోబీలలో కుంగుదల సంభవించిందని చెబుతున్నారు. కాబట్టి వర్షపు నీరు వాల్ కాంక్రీట్ బ్లాక్స్ నుంచి లోపలికి చేరి ఉంటుందన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. వాల్స్ మధ్యన మట్టిని నింపే సమయంలోనే రెండు వైపులా షీట్స్ అమర్చుతారని, ఈ షీట్స్ వర్షపు నీటిని లోపలికి చేరనివ్వదని, ఈ ఆర్‌వోబీల డి జైన్ల విషయంలో కూడా లోపాలు చోటు చేసుకున్నాయని భావిస్తున్నారు. తగినంత లోడ్ కాలిక్యులేషన్ లేకుండా నిర్మించటం వల్ల కూడా ఈ పరిస్థితి వచ్చిందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో తక్కువ గ్రేడ్ కాంక్రీట్, మట్టి ఇతర మెటీరియల్స్ వాడినా కూడా ఇదే పరిస్థితి ఎదురు కావచ్చునని చెబుతున్నారు. కాంక్రీట్ బ్లాక్స్ జాయింట్స్ దగ్గర సరిగా సీల్ వేయకపోవటం వల్ల కూడా సమస్య తలెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు. అన్నింటికంటే నిర్వహణ లోపాలు ప్రధాన కారణమన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

చక్కగా చురకలు

(5వ పేజీ తరువాయి)

పెత్తనం చేసేవారిపై ఇప్పటికే నందిగామలోని కేడర్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. చేసేదేమీ లేదని భరిస్తున్న వారందరికీ.. చంద్రబాబు ప్రసంగం సంతోషాన్ని కలిగించింది. గ్రేడులు, ర్యాంకులు ఇస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ, తప్పులు చేస్తున్న నేతలకు చంద్రబాబు స్పష్టంగా హెచ్చరించారు. మొదటి ఐదు స్థానాల్లో ఉండాల్సిన నందిగామ 134వ స్థానానికి పడిపోవడానికి గల కారణాలు తనకు తెలుసని, పద్ధతి మార్చుకోకపోతే మార్పులు తప్పవంటూ అన్ని స్థాయిల్లోని నాయకులను హెచ్చరించారు. మితిమీరిన ప్రవర్తనతో కొందరు నేతలు పార్టీకి నష్టం కలిగిస్తున్నారని, అటువంటి వారికి దణ్ణంపెట్టి సాగనంపుతాననడం కూడా కీలక నేతలకు గుబులు రేపుతోంది. ఎన్నికలకు ముందు కేడర్‌కు, ప్రజలకు అందుబాటులో ఉన్న నేతలు.. అధికారం వచ్చాక దూరమయ్యారని చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం కీలకమైన ప్రజాప్రతినిధులను ఉద్దేశించేననే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అవినీతిపై ఆగ్రహం

'నియోజకవర్గంలో నేతల అవినీతి కార్యకలాపాలపై పూర్తిస్థాయి సమాచారం తీసుకుంటున్నా. పార్టీకి నష్టం జరిగేలా అవినీతి చేస్తే చర్యలు తప్పవు. కుటుంబ నిర్వహణకు ఏదైనా పనులు చేసుకోవాలి. పార్టీని సంపాదన కోసం వాడుకోవాలనుకుంటే కుదరదు. అవినీతి, అక్రమ సంపాదన కావాలనుకునే వారికి టీడీపీలో స్థానం లేదు. కార్యకర్తల త్యాగాలను సమాజ హితానికే వినియోగించాలని భావిస్తున్నాను.' అని చంద్రబాబు చెప్పిన మాటలు సాధారణ కార్యకర్తలకు సంతృప్తి కలిగించగా, నాయకులను మాత్రం ఆలోచనలో పడేశాయి. ఇప్పటికైనా ఇగోలు, అవినీతి కార్యకలాపాలు పక్కనపెట్టి అధినేత ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారో, లేక ఆయన ఆగ్రహానికి బలవుతారో చూడాలి. చంద్రబాబు నిర్వహించిన ఈ సమావేశం నేతల పనితీరులో మార్పులు తీసుకురావచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

పండుగ రోజు
పెను విషాదం

(5వ పేజీ తరువాయి)

చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. గాలింపు చర్యలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు. మృతదేహాలను అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూడు కుటుంబాల్లో కడుపు కోత

మత్తి గోపీ కిరణ్, మత్తి వీరబాబులు.. వారి కుటుంబాలకు ఏకైక వారసులు. అంతేకాకుండా వారిద్దరి తండ్రులు సైతం అన్నదమ్ములే కావటంతో ఆయా కుటుంబాలకు వారసులు లేకుండాపోయారని గోపీ కిరణ్ తండ్రి రంగారావు, వీరబాబు తండ్రి వరదరాజులు విలపిస్తున్నారు. గోపీ కిరణ్, వీరబాబు అవనిగడ్డలో 9వ తరగతి చదువుతుండగా, యతిరాజు ఇటీవల చదువు మానేసి వ్యవసాయంలో కుటుంబానికి సాయంగా ఉంటున్నాడు. చేతికి అంది వస్తున్న కొడుకు విగతజీవిగా మారడాన్ని చూసి యతిరాజు తండ్రి మత్తి భావన్నారాయణ కన్నీటిపర్యంతమయ్యాడు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు బాధిత కుటుం బాలను పరామర్శించారు.

ఇసుక అక్రమ తవ్వకాలతోనే గుండాలు

కొత్తపేట పుష్కరఘాట్ వద్ద నది లోతు చాలా తక్కువగా ఉంటుందని, అక్కడ ఒకేసారి పది అడుగుల లోతున గుండాలు ఏర్పడటానికి కారణంగా ఇసుక అక్రమ తవ్వకాలేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నది ఒడ్డు నుంచి అవతల వరకు నడిచి వెళ్లిపోయే అవకాశం గతంలో ఉండేదని, ఈ అక్రమ తవ్వకాల కారణంగా నదిలో అనూహ్యంగా గుండాలు ఏర్పడి ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి 'పుష్ప'లు

(5వ పేజీ తరువాయి)

సాగు చేస్తోంది. వారు చేనేతలకు సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిసా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా, నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.

కనికరం లేని కన్నపేగు

(5వ పేజీ తరువాయి)

చూడగా, పొట్ట, నడుం, కాలు వద్ద కాలిన గాయాలున్నాయి. స్థానిక వైద్యుడితో చిన్నారికి సుమలత వైద్యం చేయించింది. ఉన్నట్టుండి శ్రీరాములు, వందన ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి చిట్టినగర్ చేరుకున్నారు. చిన్నారికి చేసిన చిత్రహింసలు తెలియడంతో స్థానికులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించడంతో పారిపోయారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆక్వాపై అగ్రరాజ్యం సెగ!

ఎగుమతులపై 27 శాతం సుంకం విధించిన అమెరికా

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

జిల్లాలో 111 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంది. లక్ష ఎకరాలకు పైగా రొయ్యల సాగు జరుగుతోంది. ఏటా 2.52 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. దీంతో పాటు సముద్రపు వేట ద్వారా లభించే రొయ్యలను కూడా విదేశాలకు ఎగుమతి చేస్తారు. చెరువుల్లో సాగు చేసే రొయ్యలు 30 కౌంట్ వచ్చేవరకు రైతులు ఆగుతారు. ఈ తరుణంలో 30 నుంచి 50 కౌంట్ ఉన్న రొయ్యలు చెరువుల్లో అధికంగా ఉంది. వేసవిలో కొనుగోలు చేసిన రొయ్యలను ప్రాసెసింగ్ చేసి ఓడల ద్వారా డిసెంబరు నాటికి అమెరికాకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం అమెరికా విధించిన సుంకం కారణంగా 30 కౌంట్ ఉన్న రొయ్యలను ఎగుమతి చేయాలంటే కిలోకు రూ.130 అదనపు భారం పడుతుందని, దీంతో స్థానికంగా రొయ్యల ధర తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని ఎగుమతిదారులు భరిస్తారా లేక రైతులకు ఇచ్చే ధరలోనే కోతపెడతారా అనే అంశంపై రైతుల్లో చర్చ జరుగుతోంది. ఆక్వా ఎగుమతులకు బ్రేక్ పడకుండా ఎగుమతిదారులు కొంతమేర భారం తమపై వేసుకునేందుకు ముందుకు వస్తారా లేదా అనే అంశంపై వారం రోజుల వ్యవధిలో స్పష్టత వస్తుందని స్థానికంగా రొయ్యలు కొనుగోలు చేసే వ్యాపారులు చెబుతున్నారు. మన దేశం నుంచి అమెరికా, చైనా తదితర దేశాలకు రొయ్యలఎ ఎగుమతి జరుగుతుందని, పెద్ద కౌంట్ ఉన్న రొయ్యలు అధికంగా అమెరికాకు ఎగుమతి అవుతాయని పెద్ద వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా విధించిన 27 శాతం మేర సుంకం ప్రభావం తప్పనిసరిగా ఆక్వా రైతులపై పడుతుందని చెబుతున్నారు.

కొనుగోళ్లు నిలిపివేత

ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా సుంకం పెంచడంతో 50 కౌంట్ కంటే పెద్ద రొయ్యల కొనుగోలును ప్రాసెసింగ్ యూనిట్‌ల యజమానులు, ఎగుమతి దారులు నిలిపివేశారు. కిలోకు 50, 60, 70, 80, 90, 100 కౌంట్ ఉన్న రొయ్యలనే ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. అదికూడా ధరలు తగ్గించి మరీ చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు కిలోకు 100 కౌంట్ ఉన్న రొయ్యలు రూ.250 మేర ధర ఉండగా, గత రెండు రోజులుగా ఈ ధరను రూ.200లకు తగ్గించివేశారు. 60 కౌంట్ రొయ్యలధర గతంలో రూ.330 వరకు ఉండగా నేడు రూ.250కు పడిపోయింది. 50 నుంచి 100 కౌంట్ ఉన్న రొయ్యలను చైనా దేశానికి ఎగుమతి చేసేందుకే కొనుగోలు చేస్తున్నామని, పరిస్థితులు చక్కబడేవరకు అమెరికాకు రొయ్యల ఎగుమతులు ఉండవని ఎగుమతి దారులు చెప్పడం గమనార్హం. ఇప్పటికే తమ వద్ద ఉన్న సరుకును ఏ పద్ధతిలో ఎగుమతి చేయాలో తెలియడం లేదని, 30, 40, 50 కౌంట్ ఉన్న రొయ్యలను ఇప్పట్లో కొనుగోలు చేయబోమని ప్రాసెసింగ్ యూనిట్‌ల యజమానులు, ఎగుమతిదారులు స్పష్టం చేస్తున్నారు.

స్థానికంగా ఉన్న ఇబ్బందులు ఇవీ

ఏటా నవంబరు నుంచి జూన్ వరకు రొయ్యల సాగుకు అనుకూలంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ఆక్వా జోన్‌లో ఉన్న భూములకే విద్యుత్‌పై సబ్సిడీని ఇస్తామని ఆంక్షలు పెట్టింది. తీర ప్రాంతంలో అసైన్డ్ భూములే అధికంగా ఉండగా, వేరే పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో ఈ భూముల్లో రొయ్యల చెరువులను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. ఆక్వా జోన్ అంశం తెరపైకి వచ్చాక అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు విద్యుత్‌పై రాయితీని ఎత్తివేశారు. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి అసైన్డ్ భూములను మినహాయించడంతో ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందని పరిస్థితి నెలకొంది. ఆక్వాజోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. తాము సాగు చేస్తున్న రొయ్యల చెరువులను ఆక్వా జోన్ నుంచి తొలగించారని, దీంతో విద్యుత్ రాయితీ రావడం లేదని రైతులు గతంలోనూ, ఇప్పుడు ప్రజాప్రతినిధుల చుట్టూ నెలల తరబడి తిరుగుతూనే ఉన్నారు. చూస్తాం, చేస్తామని చెప్పడమే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

రూ.వేలల్లో వచ్చే విద్యుత్ బిల్లు నేడు లక్షల్లోకి

రొయ్యల చెరువులకు సంబంధించి యూనిట్‌కు విద్యుత్ బిల్లుగా రూ.3.84లను వసూలు చేసేవారు. దీనికి అదనంగా మరో ఐదుపైసలను చేర్చి యూనిట్‌కు రూ.3.90 వరకు వసూలు చేస్తున్నారు. 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 10ఎకరాల్లోపు విద్యుత్‌ను వాడుకుంటే ఒక్కో యూనిట్‌కు రూ.2.35 రాయితీగా వచ్చేది. దీంతో రైతులు నెలకు రూ.50 వేల నుంచి 60 వేల వరకు విద్యుత్ బిల్లులను చెల్లించేవారు. ప్రస్తుతం ఆక్వా జోన్‌లో భూమి నమోదై లేదనే కారణంతో విద్యుత్ రాయితీ ఎత్తివేయడంతో 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వాడుకున్నందుకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. వివిధ రూపాల్లో విద్యుత్ బిల్లులను వసూలు చేస్తుంటంతో నెలకు లక్ష రూపాయలకు పైగా అదనంగా విద్యుత్ బిల్లుల రూపంలో నగదు చెల్లింపు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మచిలీపట్నం మండలం కోన గ్రామంలో ఒక రైతు నెల రోజులుగా రొయ్యల చెరువుల్లో సాగును నిలిపివేశాడు. కనీస చార్జీల కింద రూ.2,500, వివిధ రూపాల్లో మరో రూ.70వేలను బిల్లుగా ఇవ్వడం గమనార్హం. రొయ్యల సాగులో విద్యుత్ బిల్లులు, మేత ఖర్చులు అధికమవుతున్నాయనే కారణంతో రైతులు సాగు చేయాలా, నిలిపివేయాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో అగ్రరాజ్యం రూపంలో మరో విపత్తు వచ్చి పడటంతో రొయ్యల రైతులు డోలాయమానంలో పడ్డారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

ఆదర్శ పురుషుడు శ్రీరామచంద్రుడు

● తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



సత్యనారాయణపురం: అవతారం పురుషుడైనప్పటికీ సామాన్య మానవుడిగానే తన కర్తవ్యాన్ని ఆచరించి, లోకానికి ఆదర్శంగా నిలిచిన పురుషోత్తముడు శ్రీరామచంద్రుడని తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. శ్రీరామ శోభాయాత్ర సమితి ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం శ్రీరామ శోభాయాత్రను తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి జెండా ఊపి ప్రారంభించారు.





బెల్లం దంచుతున్న గద్దె రామ్మోహన్, భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తిరుపతయ్య, కోకోకోలా వీధిలోని రామాలయంలో నవమి వేడుకల్లో పాల్గొన్న గద్దె క్రాంతి కుమార్

కమనీయం.. సీతారాముల కల్యాణం

పటమట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎలక్ట్రిసిటీ కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సోదరి కాంత్రి పాల్గొన్నారు. నల్లూరి కాసి - మాధవి దంపతుల ఆధ్వర్యంలో 4వేల మందికి అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు మద్దుకూరి సుబ్బారావు, నల్లూరి అకిల్ పాల్గొన్నారు. ఎస్ఎస్ఎం స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన పందిరిలో పానక ప్రసాదానికి కావాల్సిన బెల్లాన్ని గద్దె రామ్మోహన్ స్వయంగా దంచారు. 12వ డివిజన్ అయ్యప్పనగర్ శ్రీ భాస్కర్ హోమ్స్ గ్రేటెడ్ కమ్యూనిటీలో తాతినేని అనూప్-అంకిత, ఎమ్.భగత్‌రెడ్డి - మాధవిలత దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అన్నదానంలో గద్దె పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్ పలు నవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజ లు చేసి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో..

రాణిగారితోట: స్థానిక తారకరామనగర్ కృష్ణవేణి పుష్కరఘాట్‌లోని శ్రీ భక్తాంజనీయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ తూర్పు అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మచ్చ శివప్రసాద్, గంద్ర రాజు, వెంకటరెడ్డి, సాంబిరెడ్డి, శేఖర్, కుమార్, జానీ, గోగుల బ్రదర్స్ రెడ్డి పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

నవమి వేడుకల్లో పాల్గొన్న గద్దె క్రాంతి

ప్రభుత్వాసుపత్రి: నియోజకవర్గంలో ఆదివారం జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో టీడీపీ యువ నేత గద్దె క్రాంతి కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. 3, 4, 6, 12, 19వ డివిజన్లలోని ఆలయాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

బెజవాడ బార్ ఆధ్వర్యంలో..

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు ఏవీ రంగారావు, భవానీశంకర్, గోలి నరసింహారావు, ముద్దాడ సత్యనారాయణ పూజలు నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు ప్రసాదాన్ని వితరణ చేశారు. బార్ అధ్యక్షుడు ఎ.కె.భాషా, ఉపాధ్యక్షుడు పిల్లా శ్రీనివాసరావు, న్యాయవాదులు గంధం శ్రీనివాసరావు, కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా), దుర్గంరాజు బుచ్చిబాబు, బాసా రవి, కందుల శ్రీనివాస్, బుల్లియ్య పాల్గొన్నారు.



కాళీమాత ఆలయంలో..

కృష్ణలంక: శ్రీరామనవమి సందర్భంగా త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నులపండుగగా జరిగింది. వసంత నవరాత్రుల ఆఖరిరోజైన ఆదివారం కాళీమాత అమ్మవారు దివ్యలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుడు మార్తి శ్రీ సూర్యప్రకాష్ శర్మచే సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భారతుల విజయ్‌కిరణ్ దంపతులు సమర్పించిన పట్టుచీరతో అమ్మవారిని దివ్యలక్ష్మీ దేవిగా అలంకరించారు. గొల్లపూడి సత్యం, తుర్లపాటి మల్లేశ్వరరావు దంపతులు, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ పాల్గొన్నారు. భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు.

మాచవరం డౌన్ కుటుంబరావు వీధిలో..

గుణదల: 26వ డివిజన్ పరిధిలోని మాచవరం డౌన్ కుటుంబరావు వీధిలో నిర్వహించిన



సీతారామ కల్యాణానికి 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి దంపతులు హాజరయ్యారు. ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ గద్దె అనురాధ, 26వ డివిజన్ పెద్దలు, స్థానికులు, భక్తులు హాజరయ్యారు.



3వ డివిజన్లో అన్న సంతర్పణ

శీతారామ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక 3వ డివిజన్ పరిదిలో నిర్వహించిన శీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ హాజరయ్యారు. కల్యాణం అనంతరం నిర్వహించిన అన్న సంతర్పణలో గద్దె క్రాంతి కుమార్ పాల్గొని భక్తులు వడ్డన చేశారు.

3,4వ డివిజన్లలో..

భారతీనగర్: ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ కోదండ రామాంజనేయ, శ్రీ విజయ కార్యసిద్ధి గణపతి ఆలయంలో ఎన్టీఆర్, వెటర్నరీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కోదండ రామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు వేదమంత్రాలతో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవము ఘనంగా జరిగింది. మంత్రి పీ నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ పాల్గొన్నారు.

కరెన్సీనగర్ కాలనీలో...

స్థానిక కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనీయ స్వామి దేవాలయంలో శ్రీ రామ భక్త సేవా సమితి ఏర్పాటు చేసిన 34వ సీతారామ కల్యాణ మహోత్సవం ఉదయం 11.30 గంటలకు వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. 10న అన్న ప్రసాద వితరణ జరుగుతుందని సభ్యులు తెలిపారు.

శ్రీరామ చంద్రనగర్ కాలనీలో..

శ్రీ రామచంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలోని ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కాలనీ ప్రజల సమక్షంతో వేద మంత్రాలతో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.మధ్యాహ్నం సుమారు 2వేల మందికి అన్నదానం చేశారు.



గురునానక్ కాలనీలో...

స్థానిక గురునానక్ కాలనీలోని శ్రీకోదండరామాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10.30 గంటలకు వేద మంత్రాలతో శ్రీ సీతారామకల్యాణ మహోత్సవము ఘనంగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాలనీ పెద్దలు, సుంకర రాజేష్, ఎం. నరేంద్రబాబు, సీహెచ్ సురేష్, గొల్లి రవీంద్ర, పలు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




బెజవాడ బార్ అసోసియేషన్ వద్ద సీతారాముల కల్యాణంలో కూర్చున్న న్యాయవాద దంపతులు, సిద్దార్థ స్కూల్ పక్కన రఘురామ వీధిలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



లబ్బీపేట టీటీడీ కల్యాణమండపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజ్‌భవన్ నుంచి వచ్చిన 25 మంది విశాఖపట్నం పోలీస్ సిబ్బంది పాల్గొని భజనలు చేశారు.

బేస్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మన జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఆడటం జిల్లాకు, దేశానికి ఎంతో గర్వకారణమని కృష్ణా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నాగూర్ అన్నారు. కృష్ణా జిల్లా బేస్ బాల్ అసోసియేషన్, పిసాపోలో అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బేస్‌బాల్ క్రీడాకారులకు మాచవరంలోని నవోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మ్లాడుతూ బేస్ బాల్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందని, ఒలంపిక్స్‌లో మంచి ప్రాధాన్యత కలిగిన ఆట అని అన్నారు. ఏపీ పిసాపోలో అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్.శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ సరళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి వైసీపీ ముస్లిం నేతలు

లబ్బీపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నో అవమానాలను ఎదుర్కొని 2024లో కూటమిని ఏర్పాటు చేసి అధికారంలోకి రావటానికి ఎంతో కృషి చేశారని జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమిశెట్టి వాసు అన్నారు. 19వ డివిజన్ వైసీపీకి చెందిన 150 మంది ముస్లిం నేతలు, కార్యకర్తలు వైసీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మిశెట్టి వాసు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన జెండా ముస్లింలకు అండ అని, పార్టీ కార్యకర్తలకు ఎంతో విలువనిస్తుందని, ఎప్పుడూ అండగా ఉంటుందని, పార్టీ సిద్ధాంతాలు నచ్చి ముస్లింలు పార్టీలో చేరటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జనసేన పార్టీ 19వ డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్, గోపి, జంపయ్య పాల్గొన్నారు.



దుర్గగుడి కళా వేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

జగన్మాతకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం నగరానికి చెందిన కళాక్షేత్ర నృత్య కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్య కళాకారిణి సి.హెచ్.తన్మయి ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. మూషిక వాహన, మాహేశ్వరి మహాకాళి, జై జగజ్జనని, శివ తాండవం, కొండల్లో నెలకొన్న, ముద్దుగారే యశోద, గరుడ గమన, ఇంకా పలు కీర్తనలకు 25 మంది కళాకారులు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.



బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ 14వ డివిజన్ నేతలు

వాడవాడలా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

పటమట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): 14వ డివిజన్ చిన్న వంతెన సెంటర్లో బీజేపీ అయ్యప్ప నగర్ మండలాధ్యక్షుడు యార్లగడ్డ సందీప్ నేతృత్వంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి తరుణ్ కాకాని హాజరై జెండా ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సుర్తి శ్రీనివాసరావు, రామినేని వెంకట కృష్ణ, ఉపాధ్యక్షుడు చింతయ్య, చమ్మ రాజేష్, కైలా కిషోర్, శివరావు, నరేంద్ర పాల్గొన్నారు. అలాగే బీజేపీ తూర్పు ఇన్‌చార్జి తరుణ్ కాకాని నేతృత్వంతో గుణదల, అమ్మా ఫంక్షన్ హాల్ సెంటర్లో నిర్మించిన బీజేపీ జెండా దిమ్మెలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆవిష్కరించారు. పోలవల్లి గణేష్, అవ్వారు బుల్లబ్బాయి, పైలా సురేష్, ఎస్.పవన్ పాల్గొన్నారు.



ముస్లిం, క్రైస్తవ కాంగ్రెస్ పార్టీ నేతలతో నవమి వేడుకలు

ఐక్యతకు ప్రతీక కాంగ్రెస్ పార్టీ

● ఏఐసీసీ సభ్యుడు గురునాథం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి, ఐక్యతకు ప్రతీక కాంగ్రెస్ పార్టీ అని ఏఐసీసీ మెంబర్, పీసీసీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.గురునాథం అన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ముస్లిం, క్రైస్తవ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ దేశంలో రామరాజ్య స్థాపన, పాలన కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. శ్రీరాముని పాలనలో ప్రజలందర్నీ సమానంగా పాలిస్తూ దేశ ప్రజలకు ధర్మం, సత్యం, న్యాయం, అహింస వంటి సన్మార్గంలో ప్రజలను పాలించి మనుషులందర్నీ సమానంగా చూసిన గొప్ప రాజనీతిజ్ఞుడని అన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నర్సింహారావు మాట్లాడుతూ ఈ వేడుకల్లో సర్వమానత సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పే విధంగా ముస్లిం, క్రైస్తవ పార్టీ నాయకులు కూడా శ్రీరామనవమి వేడుకలో పాల్గొనడం ముదావహమన్నారు. మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.అన్సారీ మాట్లాడుతూ శ్రీరామనవమి దేశంలోని అన్ని మతాలవారికి ఆదర్శమని శ్రీరామనవమి వేడుకలను దేశవ్యాప్తంగా మతాలకతీతంగా నాటి నుంచి నేటి వరకు కలిసిమెలిసి జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. రాముడైనా, అల్లాహ్ అయినా, జీసస్ అయినా ధర్మాన్ని, సత్యాన్ని, న్యాయాన్ని, అహింసని పాటించమని చెప్పారన్నారు. అనంతరం ముస్లిం, క్రైస్తవ సోదరులు శ్రీరాముల వారి చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టి సర్వమానత సమానత్వాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతురాజు జేసుదాసు, బేగ్, ప్రమీల గాంధీ, సింగ్, దమ్ము రాజు, పీటర్ జోసఫ్, అశోక్ షారోన్, పరశురాం, సుభాష్, అబ్దుల్ రహీం, కండెల వరప్రసాద్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

The Cadence Scholarship

The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).

Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum



overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.

Prizes & Rewards: Financial support for covering key educational expenses. ***Last Date to Apply :*** 30-04-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttara khand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.

Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.

Prizes & Rewards: An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.

Last Date to Apply: 15-04-2025

Application mode: Online and offline via email at admissions@doonschool.com

Short Url : www.b4s.in/aj/DSSE2

buddy4study.com

ఇంటర్మీడియెట్ తరవాత
ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులు ఇక పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లపై దృష్టిపెట్టి ఉంటారు. ఇప్పటికే జేఈఈ మెయిన్ రెండో సెషన్ కూడా దాదాపుగా పూర్తి కావచ్చింది. దీనితోపాటు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాసే ఇతర ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లు ఇవి.

జేఈఈ మెయిన్ పేపర్-1

ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐ, ఇతర పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ ఎంట్రెన్స్ రాయాలి.

వెబ్‌సైట్: jeemain.nta.nic.in

జేఈఈ అడ్వాన్స్‌డ్:

ఐఐటీల్లోని ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో చేరడానికి దీనికి రాయాలి. అయితే జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే ఈ ఎంట్రెన్స్ రాయగలరు.

వెబ్‌సైట్: jeeadv.ac.in

బిట్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్

పిలానీ, గోవా, హైదరాబాద్, దుబాయ్‌ల్లో ఉన్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్స్) క్యాంపస్‌ల్లో ఇంజనీరింగ్ చేయడానికి ఈ సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ రాయాలి.

వెబ్‌సైట్: bitsadmission.com

చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

టీజీ ఎప్‌సెట్

తెలంగాణలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం టీఎస్ 'ఇంజనీరింగ్ అగ్రికలర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/

చివరి తేదీ: 2025 ఏప్రిల్ 9(రూ.250/- ఆలస్య రుసుముతో) (ఐదువేల రూపాయల ఆలస్య రుసుముతో 2025 ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ఏపీ ఎప్‌సెట్

ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 'ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్' రాయాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in



చివరి తేదీ: 2025 ఏప్రిల్ 24

విట్టీ

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల అడ్మిషన్స్ కోసం 'విట్టీ' ఎంట్రెన్స్ (వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 'ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) రాయాల్సి ఉంటుంది. ఈ విట్‌కు పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

వెబ్‌సైట్: viteee.vit.ac.in

చివరి తేదీ: 2025 ఏప్రిల్ 7

ఎస్ఆర్ఎమ్ జేఈఈఈ

తమ సంస్థలో అడ్మిషన్ల కోసం ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జాతీయ స్థాయిలో ఎంట్రెన్స్ నిర్వహిస్తుంది. ఎస్ఆర్ఎంకు కూడా పలు రాష్ట్రాల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

వెబ్‌సైట్: srmist.edu.in

చివరి తేదీ: 2025 ఏప్రిల్ 16

సిట్టీ

వివిధ రాష్ట్రాల్లో 'సింబయాసిస్' సంస్థకు ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం ఈ ఎంట్రెన్స్ పరీక్ష రాయాలి.

వెబ్‌సైట్ : www.settest.org/register.html

చివరి తేదీ : 2025 ఏప్రిల్ 12

ఏపీ పీజీసెట్ 2025



ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏపీ పీజీసెట్ 2025)నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్‌ను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది.

ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కాలేజీల్లో 150కి పైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉంటుంది. యూనివర్సిటీలోని 85 శాతం సీట్లు స్థానికులకు కేటాయించారు.

ఈ ఎంట్రెన్స్ మూడు కేటగిరీలుగా ఉంటుంది.

కేటగిరీ-1: ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్

కేటగిరీ-2: కామర్స్ అండ్ ఎడ్యుకేషన్

కేటగిరీ-3: సైన్స్ సబ్జెక్టులు

కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు ఉన్నాయి.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా ఎంట్రెన్స్‌కు హాజరు కావచ్చు.

పరీక్ష విధానం: లాంగ్వేజ్ స్పెషలైజేషన్ తప్ప మిగతా ప్రశ్నపత్రం ఇంగ్లీష్‌లో ఉంటుంది. కంప్యూటర్ ఆధారంగా పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. 90 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు జరుగుతుంది. నెగెటివ్ మార్కులు లేవు.

యూనివర్సిటీలు: ఆంధ్ర యూనివర్సిటీ (విశాఖపట్నం), డా.బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి), డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ(కర్నూలు), శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ(అనంతపురం), ద్రవిడియన్ యూనివర్సిటీ(కుప్పం), ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), కృష్ణా యూనివర్సిటీ(మచిలీపట్నం), శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ(రాజమహేంద్రవరం), యోగి వేమన యూనివర్సిటీ(కడప), క్లస్టర్ యూనివర్సిటీ(కర్నూలు), రాయలసీమ యూనివర్సిటీ(కర్నూలు), ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ(ఒంగోలు), విక్రమ సింహపురి యూనివర్సిటీ(నెల్లూరు), జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(అనంతపురం), ఆయిల్ టెక్నలాజికల్ అండ్ ఫార్మాస్యూటికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(తిరుపతి)

చివరి తేదీ: 2025 మే 5 (ఆలస్య రుసుముతో 2025 మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)

ప్రవేశ పరీక్షలు: 2025 జూన్ 6 నుంచి జూన్ 13 వరకు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in

టెన్త్ తరవాత డిప్లొమా
లెదర్ టెక్నాలజీతో కెరీర్

- డిప్లొమా ఇన్ లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా చేయవచ్చని అందరికీ తెలిసిందే. అయితే మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు పాలిటెక్నిక్‌లో ప్రత్యేకమైన కోర్సులు ఉన్నాయి. కొన్ని డిప్లొమాలు చేస్తే కాలేజీ పట్టాతోపాటే ఉద్యోగం వస్తుంది. అందులో లెదర్ టెక్నాలజీ ఒకటి. హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత డిప్లొమా కోర్సులు ఉన్నాయి. దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమాలను ఆఫర్ చేస్తోంది.

సీట్లు : ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. పదో తరగతి పాసైనవారు ఇందులో చేరేందుకు అర్హులు. గరిష్ఠ వయోపరిమితి లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది.

కోర్సు కాలవ్యవధి: ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలో విద్యార్థులు ఇండస్ట్రీ రెడీ విద్యార్థుల తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు రూ.7,000 స్టయిపెండ్‌గా లభిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు: దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి.



ఉన్నత చదువులు

లెదర్ టెక్నాలజీలో డిప్లొమా తరువాత ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/ బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

బీటెక్ అందించే కాలేజీలు

- హర్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా

చిత్రజ్యోతి
SINCE 1965



నటనతో అదరగొట్టారు

ఎన్టీఆర్

"అంచనాలను మించి విజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రబృందానికి నా అభినందనలు. ఈ విజయం వెనుక దర్శకుడు కల్యాణ్‌శంకర్ కష్టం చాలా ఉంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన వారంతా తమదైన నటనతో అదరగొట్టారు. కామెడీని పలికించడం కష్టమైన పని. అందుకే నేను 'అదుర్స్ 2' చేయడం లేదు. అప్పట్లోలా ఇప్పుడు నవ్వించలేనేమో అనే భయం ఉంది. కానీ 'మ్యాడ్ స్క్వేర్'లో నార్నె నితిన్ కామెడీని బాగా పండించాడు" అని ఎన్టీఆర్ అన్నారు. ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర విజయోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది. చిత్రబృందానికి ధన్యవాదాలు" అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ "నాగవంశీ లేకుంటే నేను ఉండేవాడ్ని కాదు. నిర్మాత చినబాబు లేకుంటే 'మ్యాడ్' చిత్రం ఉండేది కాదు" అని తెలిపారు.



మోగ్లీ సాహసం

'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్ రాజ్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అడవిలో హీరో హీరోయిన్లు ఓ చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉన్న ఈ పోస్టర్ ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్ కల్యాణ్, డీఓపీ: రామమారుతి ఎం, సంగీతం: కాలభైరవ.

ప్రేక్షకుల ముందుకు చంద్రేశ్వర




క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'చంద్రేశ్వర'. సురేశ్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా నటించారు. జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్రాచారి నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆధ్యాత్మిక అంశాలకు వినోదాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి, ఈ నెల్లోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

వైజయంతితో వారసుడు



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి శక్తిమంతమైన పోలీస్ పాత్రలో నటించారు. శ్రీకాంత్, సాయిమంజ్రేకర్, సోహైల్ ఖాన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో విజయశాంతి ముందు కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్.. విలన్ గ్యాంగ్ పనిపడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

'రామం'కు శ్రీకారం



శ్రీరామ నవమి సందర్భంగా చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి 'రామం' అనే పాన్ ఇండియా సినిమాకు శ్రీకారం చుట్టారు. 'ది రైజ్ ఆఫ్ అకిరా' అనేది దీని ట్యాగ్‌లైన్. టాలీవుడ్ యంగ్ హీరో కథానాయకుడిగా నటిస్తున్నారు. పలువురు దర్శకుల దగ్గర పనిచేసిన లోకమాన్య ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, మోషన్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఇప్పటి వరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని చెప్పారు.

అనన్య హిందీ చిత్రం



సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటిని కొత్తతరహాలో తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు టాలీవుడ్ కథానాయిక అనన్య నాగళ్ల. 'మల్లేశం, వకీల్‌సాబ్' తదితర చిత్రాల్లో పాత్రోచిత నటనతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు బాలీవుడ్ అరంగేట్రానికి సిద్ధమయ్యారు అనన్య. మహిళా ప్రాధాన్య కథతో రూపొందుతోన్న హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఏక్తా ఫిలిం ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌లో రూపొందుతోన్న ఈ చిత్రానికి రాకేశ్ జగ్గి దర్శకత్వం వహిస్తున్నారు. హిమ్మత్ లడుమోర్ నిర్మిస్తున్నారు. 'ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఓ గిరిజన యువతి పాత్రలో అనన్య నాగళ్ల కనిపించనున్నారు. ఆమె అభినయం చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని మేకర్స్ తెలిపారు.

పుడ్తామా యేటి మళ్లీ

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. శ్రీరామనవమి సందర్భంగా ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఒకటే పని సేసేనాకి.. ఒకేనాగ బతికేనాకి.. ఇంత పెద్ద బతుకెందుకు.. ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాల.. పుడ్తామా యేటి మళ్లీ' అంటూ ఉత్తరాంధ్ర యాసలో రామ్‌చరణ్ పలికిన డైలాగులతో మొదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించనున్నారు. ఆయన మాస్ లుక్, ఏఆర్ రెహ్మాన్ సంగీతం, రత్నవేలు విజువల్స్ ప్రధానాకర్షణగా నిలిచాయి. సినిమాను వచ్చే ఏడాది శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు రామ్‌చరణ్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. కాగా, ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.



చేయిపట్టి లాగారు



నటి శ్రీలీలకు చేదు అనుభవం ఎదురైంది. ముంబైలో షూటింగ్ పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న సమయంలో కొందరు ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని బలం ఉపయోగించి తమ గుంపులోకి లాగారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. షూటింగ్ నిమిత్తం చిత్రబృందం ఇటీవల డార్జిలింగ్ వెళ్లింది. చిత్రీకరణ అనంతరం కార్తిక్ ఆర్యన్‌తో కలసి శ్రీలీల తిరిగి వస్తుండగా వారిని చూసేందుకు స్థానికులు, అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ క్రమంలో వారికి అభివాదం చేసుకుంటూ ఆమె ముందుకు నడిచారు. ఇంతలో బాడీగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్న గుంపులోంచి కొంత మంది ఆకతాయిలు ఆమె చేయి పట్టుకొని లాగారు. దీంతో శ్రీలీల షాక్‌కు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది ఆమెను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకెళ్లారు.

సరికొత్త పాత్రలో విక్కీ కౌశల్



'ఛావా'లో శంభాజీ పాత్రలో నటించి మెప్పించిన విక్కీ కౌశల్ ఈసారి ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపించేందుకు సిద్ధమవుతున్నారు. శూజిత్ సిర్కార్ దర్శకత్వంలో 'ఏక్ జాదూగర్' అనే హిందీ చిత్రంలో విక్కీ కౌశల్ మెజీషియన్‌గా నటిస్తున్నారు. రైజింగ్ సన్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆదివారం ఈ సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. మెరుస్తున్న ఆకుపచ్చని దుస్తులతో ఇంద్రజాలికుని వేశంలో ఉన్న విక్కీ కౌశల్ లుక్ అదిరిపోయింది.

కదన రంగంలోకి



నటుడు అర్జున్ సర్జా కీలకపాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'సీతాపయనం'. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతోంది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్న హీరో ధ్రువ సర్జా ఫస్ట్‌లుక్‌ను శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. తీక్షణమైన చూపులతో కదన రంగంలోకి దిగుతున్నట్టు ఆయన కనిపించారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా అర్జున్ కథానాయిక. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: జి. బాలమురుగన్, ఎడిటర్: ఆయూబ్‌ఖాన్

ఓ రామ శ్రీరామ..



బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. థియేటర్లలో ఈనెల 10న విడుదలవుతోంది. శ్రీరామనవమి సందర్భంగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓ రామా శ్రీరామ..' అనే పాటను విడుదల చేశారు. సంగీత దర్శకుడు థమన్ స్వరాలు అందించగా, ధనుంజయ్ ఆలపించారు.





పాదాలకూ కావాలి సంరక్షణ..!

నడవడం, పరుగెత్తడం, మెట్లు ఎక్కడం, దిగడం లాంటి పనులు చేస్తూ పాదాలు అలసిపోతూ ఉంటాయి. నిరంతరం శరీర బరువును మోసే పాదాలను నిర్లక్ష్యం చేస్తే అరికాళ్ల మంటలు, పాదాల నొప్పులు వేధిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పాదాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇలా సూచిస్తున్నారు.

- పాదాలకు సరిగా అమరే చెప్పులు, బూట్లు ఎంపిక చేసుకోవాలి. పాదాల పొడవుకు తగ్గట్టుగా ఉన్న చెప్పులు కొని వేసుకోవాలి. పాదం కంటే కొద్దిగా ఎక్కువ పొడవున్న బూట్లు కొనుక్కోవాలి. వాటి ముందు భాగంలో కనీసం మూడు సెంటీమీటర్ల ఖాళీ ఉండేలా చూసుకోవాలి.
- ఎత్తు మడమల చెప్పులు వేసుకోకూడదు. వీటివల్ల పాదాల నొప్పి, వేళ్లు ఒంగడం, మడమల నుంచి వేళ్ల వరకు ఉన్న కణజాలం వాయడం, గోర్లు లోపలికి పెరగడం లాంటి సమస్యలు వస్తాయి.
- ప్రతి రోజూ స్నానం చేసేటప్పుడు పాదాలను సబ్బుతో రుద్ది వేడి నీళ్లతో కడగాలి. అప్పుడే అవి పూర్తిగా శుభ్రమవుతాయి. తరవాత పాదాలను అలాగే వేళ్ల మధ్య తడిలేకుండా తుడుచుకోవాలి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను కొద్దిగా సాగదీయాలి. అరికాళ్ల మధ్యలో బొటనవేలితో ఒత్తాలి. ఇలా చేస్తే పాదాలపై ఒత్తిడి తగ్గుతుంది. బిగుసుకున్న కండరాలు సడలి ఉపశమనంగా అనిపిస్తుంది.
- నడక, పరుగు, సైకిల్ తొక్కడం, తాడుతో ఆడటం లాంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తూ ఉంటే పాదాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. నిత్యం బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల పాదాలకు బలం చేకూరుతుంది.
- శరీరంలో నీటి శాతం తగ్గితే పాదాల్లో పగుళ్లు వస్తాయి. వేసవిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. పోషకాహారం తీసుకుంటూ తరచూ మంచినీళ్లు తాగుతూ ఉంటే దీని నుంచి బయటపడవచ్చు. వెడల్పాటి టబ్‌లో గోరువెచ్చని నీళ్లు పోసి అందులో రెండు చెంచాల కల్లుప్పు వేసి కరిగించాలి. ఈ నీళ్లలో పాదాలను అరగంట సేపు ఉంచాలి. తరవాత పాదాలను వేళ్లతో రుద్ది మంచి నీళ్లతో కడగాలి. వెంటనే పొడి వస్త్రంతో తుడిచి వాటికి మాయిశ్చరైజర్ క్రీమ్ రాసి శుభ్రమైన సాక్స్ తొడగాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే పాదాల పగుళ్లు తగ్గిపోతాయి.
- గోళ్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. లేకపోతే వాటి సందుల్లో మట్టి చేరుకొని, అపరిశుభ్రంగా కనిపించడమే కాకుండా, పాదాలకు హాని చేస్తాయి.
- చిన్న కోతలు, పుండ్లు, వాపులు, ఆనలు, పొడిబారడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. వాటి ద్వారా బ్యాక్టీరియా, రోగాలను కలిగించే క్రిములు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. వర్షాలు పడినప్పుడు ఈ సమస్య మరీ ఎక్కువ. ఒకవేళ గాయాలున్నట్టయితే యాంటిసెప్టిక్ క్రీమ్ రాసుకోవాలి. పొడిబారకుండా మాయిశ్చరైజర్లు ఉపయోగించాలి.

రాబోయే తరం శ్రేయస్సు కోసం డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టడానికి దేనికైనా సిద్ధమంటున్నారు ఫరీషా అబిద్. కేరళలోని ఓ పంచాయతీ ప్రెసిడెంట్ అయిన ఆమె దాదాపు 800 మందితో ఓ సైన్యాన్ని సిద్ధం చేసి, మాదక ద్రవ్యాలపై పోరాడుతున్నారు. తనను, తన కుటుంబాన్ని చంపుతామనే బెదిరింపులను లెక్క చెయ్యకుండా... స్వార్థపరుల ఆట కట్టిస్తున్నారు.

మత్తు వదిలిస్తున్నారు..

"నాలుగైదు నెలల క్రితం... పంచాయతీ ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నాను. రోడ్డు పక్కన జనం గుమిగూడి ఉన్నారు. 'ఏమిటా?' అని వెళ్ళి చూస్తే పదిహేనేళ్ళ కుర్రాడు స్పృహ లేకుండా పడి ఉన్నాడు. అక్కడికి చేరుకున్న డాక్టర్... ఆ కుర్రాణ్ణి పరీక్ష చేసి, అతను డ్రగ్స్ తీసుకున్నాడని, మోతాదు ఎక్కువైపోవడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నాడని చెప్పారు. ఆ కుర్రాణ్ణి నేను గుర్తుపట్టాను. అతను గతంలో నా దగ్గర చదువుకున్నవాడే. తరగతిలో చురుగ్గా ఉండేవాళ్ళలో ఒకడు. అతణ్ణి ఆసుపత్రికి తరలించాం. ఇలాంటి దృశ్యాలు ఈ మధ్య సర్వసాధారణమైపోయాయి. బడి వయసులోనే పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వ్యసనాన్ని తీర్చుకోవడానికి డబ్బుకోసం అడ్డదారులు తొక్కుతున్నారు. మత్తులో విచక్షణ మరచిపోయి బాలికల మీద, మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారు. ఇది మా ప్రాంతానికే పరిమితం కాదు. చాలా ప్రాంతాల్లో ఆందోళనకరంగా మారిన సమస్య. 'కొందరి స్వార్థం కోసం రాబోయే తరం బలైపోతూ ఉంటే... నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవాల్సిందేనా? ఒక మాజీ టీచర్‌గా, పంచాయతీ ప్రెసిడెంట్‌గా... అన్నిటికీ మించి ఇద్దరు పిల్లల తల్లిగా నేను ఏం చేయగలను?'... కొన్నాళ్లపాటు ఇవే ఆలోచనలు.

రాద్ధాంతం చెయ్యొద్దన్నారు...

మాది కేరళలోని కన్నూర్ జిల్లా మట్టూల్ గ్రామం. ఉపాధ్యాయినిగా పని చేసిన నేను కొన్నేళ్ళ క్రితం ప్రజా జీవితంలోకి వచ్చాను. 30 వేలకు పైగా జనాభా ఉన్న మా పంచాయతీకి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాను. అన్ని రంగాల్లో మా గ్రామాన్ని అత్యుత్తమంగా నిలబెట్టాలనేది నా తపన. ఆ దిశగా పని చేస్తున్న నాకు డ్రగ్స్ మహమ్మారి ఒక సవాలుగా మారింది. మత్తుకు అలవాటు పడిన పిల్లల తల్లితండ్రులతో మాట్లాడినప్పుడు... "అన్యాయంగా మావాడి మీద నిందలు వేస్తున్నారు. వాడు అలాంటి వాడు కాదు" అని కొందరు, "ఈ సంగతి అందరికీ తెలిస్తే మా పరువు పోతుంది. దయచేసి రాద్ధాంతం చెయ్యకండి" అని ఇంకొందరు అనడంతో నేను దిగ్భ్రాంతి చెందాను. విదేశాల్లో పని చేసే తల్లితండ్రులు డబ్బు పంపుతూ ఉంటే... దాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ మాదకద్రవ్యాలకు బానిసలైన వారు, తోటివారి ప్రోత్సాహంతో, డ్రగ్స్ అమ్మేవారి ప్రలోభాలతో ఈ దురలవాటు చేసుకున్నవారు ఎక్కువమందే ఉన్నారు. చేతిలో డబ్బు లేకపోతే దొంగతనాలకు, అఘాయిత్యాలకు సైతం పాల్పడుతున్నవారూ ఉన్నారు. దీని వెనుక డ్రగ్స్ రాకెట్ ఉంది. కాబట్టి ఇది అత్యవసర సమస్య అనీ, పెద్ద స్థాయిలో చర్యలు చేపట్టాల్సిందేననీ అర్థమయింది. ఈ దిశలో తొలి అడుగుగా... 'ధీర' అనే పేరుతో కొన్ని నెలల క్రితం సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించాను. దానికోసం నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేశాను. చిన్న స్థాయిలో...



కొద్దిమందితో మొదలైన వాట్సప్ గ్రూప్‌లో ఇప్పుడు 800కు పైగా వాలంటీర్లు ఉన్నారు.

అందరి సాయంతో...

మత్తుపదార్థాలు వినియోగిస్తున్నవారి గురించి, వాటిని సరఫరా చేస్తున్నవారి గురించి తెలిసిన సమాచారాన్ని మా గ్రూపులో పంచుకుంటాం. ఆ సమాచారాన్ని పోలీసులకు అందిస్తాం. దీనికోసం పంచాయతీ అంతటా... ముఖ్యంగా పాఠశాలల్లో, పని ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రసంగాల ద్వారా, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు వివరించాం. మా ప్రయత్నానికి చక్కటి మద్దతు లభించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులు, వ్యాపారులు, దుకాణకారులు, పోలీసు అధికారులు... ఇలా అన్ని వర్గాలవారూ మాతో చేతులు కలిపారు. మాదక ద్రవ్యాలు అమ్ముతున్న 13 మందిని ఇప్పటివరకూ అరెస్ట్ చేయించాం. డ్రగ్స్‌కు బానిసలైన అనేకమందికి వైద్య చికిత్స అందిస్తున్నాం. ఇప్పుడు మా పొరుగు పంచాయతీ మదాయి కూడా మాతో భాగస్వామి అయింది. దాంతో 'ధీర: మట్టూల్-మదాయి కూటమి'గా ఏర్పడ్డాం. డ్రగ్స్ వ్యాపారులంటే భయంతో మొదట్లో ప్రజలు ధైర్యంగా మాట్లాడడానికి వెనుకాడేవారు. ఇప్పుడు డ్రగ్ జోన్స్, వాడకందారులు, విక్రయదారుల గురించి కీలక సమాచారం ఇస్తున్నారు. వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు కొందరు డ్రగ్స్ పంపిణీ చేస్తున్నట్టు గుర్తించి, వారికి హిందీలో కౌన్సెలింగ్ ఇచ్చాం. ఎవరి ఇళ్ళలోనైనా అక్రమ కార్యకలాపాలు జరిగితే... వారిపై చర్యలు తప్పవని హెచ్చరించాం. పోలీసులు, ఎక్సైజ్ శాఖలు కూడా దీనికి ఎంతో సహకరిస్తున్నాయి.

వారికి హెచ్చరికగా...

ఇవన్నీ ఒక ఎత్తయితే... నాకు బెదిరింపులు కూడా తీవ్రస్థాయిలోనే వస్తున్నాయి. ఇంటికి ఫోన్ చేసి అసభ్యంగా తిట్టడంతో ఇది మొదలయింది. ఇప్పుడు నా కుటుంబం మొత్తాన్ని చంపేస్తామంటూ సందేశాలు పంపిస్తున్నారు. వాళ్ళు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. "ఫోన్ వెనకాల దాక్కోవడానికి బదులు ముఖాముఖి నాతో వచ్చి మాట్లాడు" అని వారికి చెబుతున్నాను. ఇలాంటి వాటికి నేను, మా బృందం భయపడేది లేదనే గట్టి హెచ్చరిక వారికి చేయాలనే ఉద్దేశంతో... ఈ మధ్య పెద్ద ఊరేగింపు నిర్వహించాను. దుండగుల బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఏది ఏమైనా... మా కృషి మంచి ఫలితాలనే ఇస్తుందని ఆశిస్తున్నాను. రాబోయే రోజుల్లో 'ధీర'ను రిజిస్టర్డ్ ఎన్జీవోగా మార్చి... మరింత విస్తరించాలనే ఆలోచన ఉంది. అలాగే చాటుమాటుగా సాగుతున్న డ్రగ్స్ కార్యకలాపాలను కనిపెట్టడం కోసం డ్రోన్లతో నిఘా, థర్మల్ స్కానింగ్ లాంటివి ప్రవేశపెట్టాలనుకుంటున్నాం. డ్రగ్స్ లేని సమాజంతోనే మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలం. అందుకు అవసరమైన సామాజిక చైతన్యం కోసం నా కృషిని కొనసాగిస్తాను."

వేసవిలో హాయి హాయిగా..!



ఎండాకాలంలో వేడి, ఉక్కపోత, చెమట ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ సమయంలో ఎండ నుంచి కాపాడుతూ చెమటను పీల్చుకునే బట్టలు ధరించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. శరీరానికి గాలి తగిలేలా పలుచని బట్టలు ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అలాంటి బట్టల గురించి తెలుసుకుందాం.

- వేసవిలో కాటన్ బట్టలు ధరిస్తే హాయిగా ఉంటుంది. వీటి మీద ఉండే రంధ్రాల వల్ల శరీరానికి గాలి ఆడుతుంది. పత్తి దారాల నుంచి తయారుచేస్తారు కాబట్టి ఇవి చెమటను పీల్చుకుని శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.
- షిఫాన్ బట్టలు చాలా తేలికగా మెత్తగా ఉంటాయి. స్టయిల్‌గా కూడా కనిపిస్తాయి. చీరలు, షర్టులు, కుర్తీలు ఇలా ఏవి ధరించినా ఎండాకాలంలో సౌకర్యవంతంగా అనిపిస్తుంది. వేడుకలు, పార్టీలకు వెళ్లేటప్పుడు వేసుకోవడానికి రకరకాల డిజైన్లలో షిఫాన్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి.
- లినెన్(నార) బట్టలు చాలా తేలికగా ఉంటాయి. వీటిని సహజసిద్ధమైన పీచులతో రూపొందిస్తారు కాబట్టి త్వరగా చెమటను పీల్చుకుంటాయి. ఇవి కాటన్ బట్టలకంటే బలంగా ఉంటాయి. ఎక్కువ కాలం మన్నుతాయి కూడా. వేసవికి మంచి ఎంపిక.
- షీర్ బట్టలు చాలా పలుచగా ఉంటాయి. వీటిని కూడా పత్తి దారాల తోనే తయారు చేస్తారు. ఇవి కాస్త బరువుగా అనిపించినప్పటికీ ఎండాకాలంలో ధరించడానికి అనువుగా ఉంటాయి. 'ఆర్గంజా' ఈ కోవలోకే వస్తుంది. టాప్స్, పాంట్స్, స్కర్టులు, కుర్తీలు, గౌన్లు ఇలా ఎన్నో రకాల షీర్ దుస్తులు అందుబాటులో ఉన్నాయి.
- లాన్ బట్టలు చాలా మెత్తగా ఉంటాయి. వీటిలో కొంత మేరకు కాటన్ కలిసి ఉంటుంది. లాన్ దుస్తులు ఫ్యాషన్‌గా కనిపిస్తాయి. వేసవికాలంలో జరిగే వేడుకలకు వీటిని ధరించవచ్చు.
- చాంబ్రే బట్టలు కొద్దిగా మందంగా ఉంటాయి. వీటిలో కూడా కాటన్ కలిసి ఉంటుంది. అందుకే వీటిని ధరించినప్పుడు చల్లని అనుభూతి కలుగుతుంది. చాంబ్రే లెగ్గింగ్స్‌ని మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు.
- వేసవికాలంలో మహిళలు పార్టీలకు వెళ్లేటప్పుడు చందేరీ, కశ్మీరీ, మట్కా, క్రేప్ సిల్క్ చీరలు కట్టుకుంటే బాగుంటుంది. ఉద్యోగినులు కార్యాలయాలకు వెళ్లేటప్పుడు ప్రింటెడ్ కాటన్ చీరలు, హ్యాండ్‌లూమ్ చీరలు, షార్ట్ మోడల్ కుర్తాలు, ప్రింటెడ్ బాటమ్స్, కాటన్ జీన్స్, కాటన్ షర్ట్స్ వేసుకుంటే హాయిగా అనిపిస్తుంది.



బంగారు ఆభరణాల మెరుపులకు...

మహిళలు సాధారణంగా గొలుసులు, గాజులు, దిద్దులు, ఉంగరాలు లాంటి బంగారు ఆభరణాలు ధరిస్తూ ఉంటారు. వీటి మీద చెమట, దుమ్ము చేరడం వల్ల అవి మెరుపును కోల్పోయి నల్లబడుతుంటాయి. ఈ ఆభరణాలను కొత్తవాటిలా మెరిపించడానికి ఇంట్లోనే శుభ్రం చేసే విధానాలను చాలానే ఉన్నాయి. అలాంటి కొన్ని చిట్కాలు మీ కోసం...



- ఒక గిన్నెలో ఒక గ్లాసు వేడి నీళ్లు పోసి, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఇందులో నల్లగా మారిన బంగారు ఆభరణాలను ఉంచి అరగంట సేపు నానబెట్టాలి. తరవాత మెత్తని స్పాంజితో రుద్ది మంచినీళ్లతో కడిగితే నగలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి ఒక చెంచా పసుపు, ఒక చెంచా సర్ఫ్ వేసి అయిదు నిమిషాలు వేడి చేసి దించాలి. ఇందులో బంగారు ఆభరణాలు ఉంచి పది నిమిషాలు నాననివ్వాలి. తరవాత వాటిని పాత టూత్‌బ్రష్‌తో సున్నితంగా రుద్ది నీళ్లతో కడిగితే మురికి పూర్తిగా వదిలిపోతుంది.
- ఒక గిన్నెలో రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు పోసి అందులో కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ లేదా వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో నగలు ఉంచి పావుగంటసేపు నానబెట్టాలి. తరవాత వేళ్లతో రుద్దుతూ నీళ్లతో శుభ్రం చేస్తే వాటిమీద పేరుకున్న మురికి తొలగిపోతుంది.
- ఒక పాత టూత్‌బ్రష్ మీద కొద్దిగా టూత్‌పేస్టు వేసి దానితో ఆభరణాలను మెల్లగా తోమాలి. మధ్య మధ్యలో కొద్దిగా నీళ్లు చిలకరిస్తూ ఉండాలి. తరవాత ఈ ఆభరణాలను మంచినీళ్లలో ముంచి తీసి పొడిగుడ్డతో తుడిస్తే కొత్తవాటిలా కనిపిస్తాయి.
- వజ్రాలు, కెంపులు, పచ్చలు పొదిగిన ఆభరణాలను సబ్బునీటితో శుభ్రం చేయవచ్చు. ముత్యాలు పొదిగిన నగలను మాత్రం తేలికపాటి షాంపూ కలిపిన నీళ్లతో కడగాలి.
- అలాగే వెండి వస్తువులు, ఆభరణాలు కూడా ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు. షాపునకు వెళ్లినప్పుడు మొదటగా వారు కుంకుడుకాయ నురగతో శుభ్రం చేస్తారు. ఇలా మీరు కూడా ఇంట్లో చేసుకోవచ్చు. వెండి వస్తువులను ఓ అరగంటపాటు కుంకుడు కాయల రసంలో వేసి ఉంచండి. తరువాత కుంకుడు కాయ నురగ తీసుకొని వెండి వస్తువులపై రుద్దితే కొత్తవిలా మెరుస్తాయి.

అసలైన ఆనందం భారత్‌లోనే

ప్రతి తల్లిదండ్రులూ... తమ పిల్లలు బాగా చదివి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడాలని కోరుకుంటూ ఉంటారు. కానీ ఓ అమెరికన్ తల్లి మాత్రం తన పిల్లలు భారత్‌లో పెరిగితేనే ప్రయోజకులు అవుతారంటూ ఇన్‌స్టా వేదికగా ఓ వీడియో షేర్ చేసింది. దానికి కారణాలు వివరిస్తూ సుదీర్ఘమైన పోస్టు పెట్టింది. 'అమెరికాలో డబ్బు సంపాదించడం సులువే కావచ్చు కానీ అసలైన ఆనందం భారత్‌లోనే ఉంద'ని అంటూ మన దేశ ఔన్నత్యాన్ని ఆకాశానికి ఎత్తేసింది. ఈ పోస్టు చూసిన నెటిజన్లు ఆమె విశ్లేషణను ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఇంతకీ ఎవరీ విదేశీ అమ్మ? ఆమె పోస్టులో ఏముంది?



ఆమె పేరు క్రిస్టెన్ ఫిషర్. ముగ్గురు ఆడపిల్లల తల్లి. ఓ సంస్థలో కంటెంట్ క్రియేటర్‌గా పని చేస్తున్నారు. భర్త, పిల్లలతో కలసి గత నాలుగేళ్లుగా ఢిల్లీలో నివశిస్తున్నారు. 'ఇండియా వర్సెస్ అమెరికా' ట్యాగ్‌లైన్‌తో రెండు దేశాల మధ్య ఉండే భిన్నత్వం గురించి చిన్నచిన్న వీడియోలు చేసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తూ ఉంటారు. ఆహారపు అలవాట్లు, వేషధారణ, పండుగలు-వేడుకలు జరుపుకోవడం, విద్యా విధానం, కుటుంబంతో అనుబంధం, స్నేహం ఇలా ఎన్నో అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ఇప్పటికే వందల వీడియోలు రూపొందించారు. ప్రతి వీడియోలో ఆమె మన దేశాన్ని గొప్పగా అభివర్ణించడం కనిపిస్తుంది. ఆమె నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెల్‌కు అమెరికాలోనే కాదు ఇండియాలో కూడా పెద్ద సంఖ్యలో సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. అమెరికాను వదిలి భారత్‌లోనే నివశించాలనుకోవడానికి కారణాలు చెబుతూ గత ఏడాది ఆమె ఒక వీడియోను నెటిజన్లతో పంచుకున్నారు. అందులో చాలా విషయాలు వివరించారు. తాను మొదటిసారి 2017లో భారతదేశాన్ని సందర్శించాననీ, ఇక్కడి సంస్కృతి తనకు బాగా నచ్చిందని, అప్పుడే భారత్ వచ్చేయాలని నిర్ణయించుకున్నానని ఆ వీడియోలో చెప్పుకున్నారు.



ఇక్కడే బాగుంటుంది...

అమెరికాలో కంటే భారత్‌లోనే పిల్లలు తమ బాల్యాన్ని ఆనందంగా గడుపుతారని అంటున్నారు క్రిస్టెన్. ఆమె పలు అంశాలను ఇన్‌స్టా వేదిక మీద ప్రస్తావిస్తూ... భారత్‌లో పెరగడంవల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను చక్కగా విశ్లేషించారు. ఎందుకు తన పిల్లలు ఇక్కడే పెరగాలని అనుకుంటున్నారో ఆ కారణాలను ఇలా పంచుకున్నారు.

- సాంస్కృతిక అవగాహన: భారత దేశంలో భిన్న సంస్కృతులు కనిపిస్తాయి. ఎన్నో భాషలు, ఆచారాలు, నమ్మకాలు ఉంటాయి. వీటన్నింటినీ చూస్తూ, అర్థం చేసుకుంటూ ఎదిగే పిల్లలకు విశాల దృక్పథం అలవడుతుంది. కొత్తగా ఆలోచించడం, ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించడం, పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడం లాంటి వాటిని పిల్లలు నేర్చుకుంటారు.
- బహుభాషా నైపుణ్యం: ఇక్కడ ఎన్నో భాషలు, మాండలికాలు మాట్లాడుతూ ఉంటారు. హిందీ, ఇంగ్లీష్‌తోపాటు వీటన్నింటినీ పిల్లలు చాలా తేలిగ్గా నేర్చుకోగల్గుతారు. ఓర్పుగా వినడం, అర్థం చేసుకోవడంతోపాటు స్పష్టంగా మాట్లాడడం, చక్కని భావ వ్యక్తీకరణ పిల్లలకు అలవడుతుంది. ఇవన్నీ భవిష్యత్తులో ఉద్యోగ ప్రయత్నాలు చేసేటప్పుడు వాళ్లకి ఉపయోగపడతాయి.

> **అమెరికా వర్సెస్ భారత్**
>
> **అమెరికా... వ్యక్తిగత దేశంలా వ్యవహరిస్తుంది. సామాజికంగా ఒంటరిగా ఉంటుంది. కానీ భారత్... అందరినీ ఆహ్వానిస్తుంది. మానవ సంబంధాలకు విలువ ఇస్తుంది. పరస్పర సహకారాన్ని కోరుతుంది. అందుకే నా పిల్లలను భారత్‌లోనే పెంచాలని అనుకుంటున్నా..! అని చెప్పుకొచ్చారు క్రిస్టెన్.**

- ప్రాపంచిక దృక్పథం: భారత సమాజం... పిల్లలకు ప్రాపంచిక దృక్పథాన్ని పరిచయం చేస్తుంది. ప్రపంచ సమస్యలు, స్థానిక సమస్యలు, సాంస్కృతిక వైవిధ్యం, సామాజిక నిబంధనల్లో తేడాలు అవగతమయ్యేలా చేస్తుంది. దీంతో పిల్లలు ప్రపంచాన్ని లోతుగా విభిన్న కోణాల నుంచి అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు.
- తొణకని తత్వం: పుట్టిన దేశాన్ని వదిలి వేరే దేశంలో ఉండడమంటే అది పిల్లలకు పెద్ద సవాల్ అనే చెప్పాలి. వాళ్లు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక్కడి పాఠశాల విధానానికి అలవాటు పడాలి. కొత్త స్నేహితులతో సర్దుకుపోవాలి. ఇలాంటివాటివల్ల పిల్లలు స్వతంత్రంగా సమస్యలను పరిష్కరించుకునే నైపుణ్యాన్ని సాధిస్తారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తొణకకుండా నిలబడడం నేర్చుకుంటారు.
- భావోద్వేగాలు: ఇక్కడి సమాజంలో రకరకాల వ్యక్తులు తారసపడుతూ ఉంటారు. ఒక్కొక్కరికి ఒక్కో నేపథ్యం ఉంటుంది. వీళ్లని కలిసినప్పుడు పిల్లల్లో సహజంగానే రకరకాల భావోద్వేగాలు కలుగుతూ ఉంటాయి. స్నేహం, దయ, జాలి, బాధ ఇలా ఎన్నో భావాలు వాళ్ల అనుభవంలోకి వస్తాయి. వ్యక్తులను అర్థం చేసుకోవడం, సున్నితంగా వ్యవహరించడం, సామాజిక బాధ్యత పిల్లలకు అలవడతాయి.
- కుటుంబ వ్యవస్థ: భారతదేశంలో బలమైన కుటుంబ వ్యవస్థ ఉంటుంది. కుటుంబ సభ్యులంతా ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తూ ఉంటారు. ఇలాంటివన్నీ అమెరికాలో కనిపించవు కాబట్టి పిల్లలు ఆసక్తిగా గమనిస్తూ ఉంటారు. దీనివల్ల పిల్లలకు తమవారు అనే భావన, భావోద్వేగాల వ్యక్తీకరణ, బంధువర్గ సమీకరణ గురించి తెలుస్తుంది.
- సాధారణ జీవనం: ఇక్కడ పిల్లలు.... ధనిక, పేద తారతమ్యాలను చూస్తూ పెరుగుతారు. క్రమంగా సాధారణ జీవన మాధుర్యాన్ని, సంతృప్తి విలువను అర్థం చేసుకుంటారు.
- భారత్‌లో పెరిగే పిల్లలు... ప్రపంచంలో ఏ ప్రాంతం వారితోనైనా స్నేహపూర్వకంగా మెలగుతారు. స్నేహబంధాలను పెంచుకుంటారు. ఇది అంతర్జాతీయంగా సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాల విస్తరణకు దోహదం చేస్తుంది.

హితేష్‌కు స్వర్ణం

- అభినాష్‌కు రజతమే!
- భారత్‌కు ఆరు పతకాలు
- ప్రపంచ బాక్సింగ్ కప్


అభినాష్ హితేష్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌ను భారత్ ప్రశంసనీయంగా ముగించింది. బ్రెజిల్‌లో జరిగిన ఈ టోర్నీలో మనోళ్లు ఒక స్వర్ణం సహా ఆరు పతకాలతో సత్తా చాటారు. 70 కి. విభాగంలో హితేష్ విజేతగా నిలవడం ద్వారా పసిడి పతకం అందించాడు. 65కి.లలో అభినాష్ జమ్వాల్ రజతం సొంతం చేసుకున్నాడు. జదుమణి సింగ్ (50కి.), మనీష్ రాథోడ్ (55కి.), సచిన్ (60కి.), విశాల్ (90కి.) కాంస్య పతకాలు సాధించారు. ప్రపంచ కప్‌లో మొత్తం 10 మంది బాక్సర్లు భారత్ తరఫున బరిలో దిగారు.



రిటైర్మెంట్.. ఇప్పుడే కాదు..!

● స్పష్టతనిచ్చిన ధోనీ

న్యూఢిల్లీ: తన ఐపీఎల్ రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలను ధోనీ కొట్టిపడేశాడు. ఈ సీజన్ చివరి వరకు ఆడతానని స్పష్టం చేశాడు. శనివారం చెపాక్‌లో ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌కు మహీ తల్లిదండ్రులు హాజరు కావడంతో అతడికి ఇదే చివరి మ్యాచ్ అనే వార్తలు నెట్‌లో హల్‌చల్ చేశాయి. కానీ, మ్యాచ్ ముగిసిన తర్వాత మహీ ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో తన రిటైర్మెంట్ ఊహాగానాలను ధోనీ ఖండించాడు. 'ఇప్పటికిప్పుడు లీగ్‌కు గుడ్‌బై చెప్పలేను. ఈ సీజన్ ముగిసిన తర్వాత.. జూలైలో 44వ సంవత్సరంలోకి అడుగుపెడతా. ఇంకా ఆడాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవడానికి అప్పటికి మరో 10 నెలల సమయం ఉంటుంది. నా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకొనేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ఆరంభానికి ముందు శరీరం సహకరిస్తుంటే ఆడతా. లేకపోతే గుడ్‌బై చెబుతాన'ని ధోనీ చెప్పాడు.

బుమ్రా సిద్ధం

బెంగళూరుతో నేటి మ్యాచ్ బరిలో..



ముంబై : భారత జట్టు స్టార్ పేసర్ బుమ్రా ఐపీఎల్ బరిలో దిగుతున్నాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో సోమవారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో బుమ్రా ఆడనున్నాడు. ఈమేరకు అతడు ముంబై ఇండియన్స్ జట్టులో చేరాడు. గత జనవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఐదో, చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను గాయానికి లోనైన సంగతి తెలిసిందే. దాంతో చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. 'బెంగళూరుతో సోమవారం జరిగే మ్యాచ్‌లో బుమ్రా బరిలోకి దిగుతున్నాడు. ఆదివారంనాడు అతడు సాధన చేశాడు' అని ముంబై ఇండియన్స్ కోచ్ మహేల జయవర్ధనే వెల్లడించాడు. ఇక..మోకాలి గాయంతో లఖ్‌నవూతో గత మ్యాచ్‌కు దూరమైన రోహిత్ శర్మ వాంఖడేలో ఆదివారం నెట్ ప్రాక్టీస్ చేశాడు. 'రోహిత్ నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశాడు. కానీ బ్యాటింగ్ సమయంలో సౌకర్యంగా లేడు' అని జయవర్ధనే తెలిపాడు.

రోహిత్‌తో ఆటను ఆస్వాదిస్తా..: కోహ్లీ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలది ప్రత్యేక స్థానం. దశాబ్దాలుగా ఇద్దరూ కలిసి ఆడుతుండడంతో పాటు ఎన్నో విజయాలు అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రోహిత్‌తో కలిసి ఆడడాన్ని ఎంతగానో ఆస్వాదించినట్టు విరాట్ తెలిపాడు. 'ఇద్దరం దాదాపు ఒకేసారి జట్టులోకి వచ్చాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాది సుదీర్ఘ ప్రయాణం. కలిసి ఆడాం.. కలిసి నేర్చుకున్నాం. ఎన్నో ఆలోచనలను పంచుకున్నాం. అలాగే ఒకరిపై మరొకరం నమ్మకం ఉంచుతూ జట్టు విజయాల కోసం తోడ్పడ్డాం. ఈ క్రమంలో మా మధ్య ఎన్నో మధుర స్మృతులున్నాయి. వాటన్నింటినీ ఎంజాయ్ చేశాను' అని విరాట్ పేర్కొన్నాడు.

రైజర్స్.. మరోసారి

సొంత మైదానంలోనైనా అదరగొట్టేస్తుందేమోనని ఆశించిన సన్‌రైజర్స్ అభిమానులకు నిరాశే ఎదురైంది. తాము దూకుడుగానే ఆడతామని కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టాస్‌కు ముందు బీరాలు పలికినా.. పేసర్ సిరాజ్ కెరీర్ బెస్ట్ బౌలింగ్ (4/17)కు బ్యాటింగ్ ఆర్డర్ చెల్లాచెదురైంది. ఇక బౌలింగ్‌లోనూ పస లేకపోవడంతో గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ హ్యాట్రిక్ విజయాన్ని పూర్తి చేసింది.


కమిన్స్

- సొంతగడ్డపై చెలరేగిన సిరాజ్
- గిల్ అర్ధసెంచరీ
- గుజరాత్ హ్యాట్రిక్


సిరాజ్ (4/17)కు రషీద్ అభినందన


గిల్ (61 నాటౌట్)

1 ఐపీఎల్ కెరీర్‌లో సిరాజ్‌కిదే బెస్ట్ బౌలింగ్ (4/17). అలాగే ఈ లీగ్‌లో వంద వికెట్ల (97 మ్యాచ్‌ల్లో)ను కూడా పూర్తి చేశాడు.

హైదరాబాద్: అన్ని విభాగాల్లో విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి. అటు వేదిక ఏదైనా విజయమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ చెలరేగుతోంది. ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న టైటాన్స్ ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో రైజర్స్ తమ ఆఖరి స్థానాన్ని మరింత పదిలపర్చుకున్నట్టయ్యింది. అలాగే ఎస్ఆర్‌హెచ్‌పై గిల్ సేనకిది వరుసగా నాలుగో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 152 పరుగులు చేసింది. నితీశ్ (31), క్లాసెన్ (27), కమిన్స్ (22 నాటౌట్) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు నాలుగు.. సాయికిశోర్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 16.4 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. గిల్ (43 బంతుల్లో 9 ఫోర్లతో 61 నాటౌట్) తుదికంటా నిలవగా.. సుందర్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49), రూథర్‌ఫోర్డ్ (16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్) వేగంగా ఆడారు. షమికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

గిల్-సుందర్ అండతో..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన టైటాన్స్ తొలి ఐదు ఓవర్లలో చేసింది 28 పరుగులే. పైగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయిసుదర్శన్ (5), బట్లర్ (0)ల వికెట్లను కూడా కోల్పోయింది. ఈ స్థితిలో మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉందనిపించింది. కానీ నాలుగో నెంబర్‌లో బరిలోకి దిగిన వాషింగ్టన్ సుందర్ ఒక్కసారిగా సీన్ మార్చేశాడు. ఆరో ఓవర్‌లో అతడు 20 పరుగులు సాధించి టైటాన్స్‌లో జోష్ నింపాడు. అనంతరం గిల్-సుందర్ జోడీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగింది. 36 బంతుల్లో గిల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మూడో వికెట్‌కు 90 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేశాక షమి ఓవర్‌లో సుందర్ అవుటయ్యాడు. అనికేత్ ఈ క్యాచ్‌ను పట్టడానికి ముందు బంతి నేలకు తాకినట్టు కనిపించినా థర్డ్ అంపైర్ అవుటివ్వడం చర్చనీయాంశమైంది. ఇక అభిషేక్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 18 రన్స్ రాబట్టడంతో రైజర్స్‌కు ఏ మూలో ఉన్న ఆశలు కూడా లేకుండాపోయాయి. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో సమీకరణం 24 బంతులు 12 పరుగులకు మారింది. కానీ రూథర్‌ఫోర్డ్ 6,4తో మరో 20 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సిరాజ్ హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా పేసర్ సిరాజ్.. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో వికెట్ల వేట సాగించాడు. మొదటి 12 ఓవర్లపాటు వీరి ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఆఖరి ఓవర్‌లోనే అత్యధికంగా 17 పరుగులు సమకూరాయి. నితీశ్-క్లాసెన్ జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. పేసర్ ఇషాంత్ మాత్రం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. రెండు వరుస ఫోర్లతో జోష్ నింపిన ఓపెనర్ హెడ్ (8)ను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పేసర్ సిరాజ్ దెబ్బతీశాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ (18), ఇషాన్ (17) బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కానీ ఐదో ఓవర్‌లో ఒకే పరుగిచ్చి అభిషేక్‌ను సిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45/2 స్కోరుకే పరిమితమైంది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో క్రీజులో ఉన్న నితీశ్, క్లాసెన్ కుదురుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. ఈ జోడీ సింగిల్స్‌తో సరిపెట్టుకుంటూ నెమ్మదిగా ఆడడంతో 5-10 ఓవర్ల మధ్య వీరి నుంచి ఫోర్ కూడా నమోదు కాలేదు. చివరకు 11వ ఓవర్‌లో నితీశ్ రెండు ఫోర్లు సాధించగా, 13వ ఓవర్‌లో క్లాసెన్ 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక ట్రాక్‌లోకి వచ్చాడనుకున్న క్లాసెన్‌ను సాయికిశోర్ ఫ్లాట్ డెలివరీతో బౌల్డ్ చేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 50 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్‌ను సాయికిశోర్.. కమిందు (1)ను ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. అనికేత్ (18), కమిన్స్ వరుస ఫోర్లతో వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ 19వ ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చిన సిరాజ్ కళ్లు చెదిరే ఇన్‌స్వింగ్ యార్కర్లతో అనికేత్, సిమర్జీత్ (0) వికెట్లను పడగొట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో కమిన్స్ 4,6.. షమి (6 నాటౌట్) 4తో సన్‌రైజర్స్ స్కోరు 150 దాటగలిగింది.

స్కోరుబోర్డు

హైదరాబాద్: అభిషేక్ (సి) తెవాటియా (బి) సిరాజ్ 18; హెడ్ (సి) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 8; ఇషాన్ (సి) ఇషాంత్ (బి) ప్రసిద్ధ్ 17; నితీశ్ (సి) రషీద్ (బి) సాయికిశోర్ 31; క్లాసెన్ (బి) సాయికిశోర్ 27; అనికేత్ (ఎల్బీ) సిరాజ్ 18; కమిందు (సి) సాయి సుదర్శన్ (బి) ప్రసిద్ధ్ 1; కమిన్స్ (నాటౌట్) 22; సిమర్జీత్ (బి) సిరాజ్ 0; షమి (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 152/8. వికెట్ల పతనం:** 1-9, 2-38, 3-50, 4-100, 5-105, 6-120, 7-135, 8-135; **బౌలింగ్:** సిరాజ్ 4-0-17-4; ఇషాంత్ శర్మ 4-0-53-0; ప్రసిద్ధ్ కృష్ణ 4-0-25-2; రషీద్ ఖాన్ 4-0-31-0; సాయి కిశోర్ 4-0-24-2.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) అనికేత్ (బి) షమి 5, గిల్ (నాటౌట్) 61, బట్లర్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 0, సుందర్ (సి) అనికేత్ (బి) షమి 49, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 35, **ఎక్స్‌ట్రాలు: 3 ; మొత్తం 16.4 ఓవర్లలో 153/3 ; వికెట్లపతనం :** 1-15, 2-16, 3-106 ; **బౌలింగ్:** షమి 4-0-28-2, కమిన్స్ 3.4-0-26-1, సిమర్జీత్ సింగ్ 1-0-20-0, ఉనాద్కట్ 2-0-16-0, జీషన్ అన్సారీ 4-0-33-0, కమిందు మెండిస్ 1-0-12-0, అభిషేక్ శర్మ 1-0-18-0.

ఐపీఎల్‌లో నేడు వేదిక ముంబై

ముంబై x బెంగళూరు రా.7.30


పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
ఢిల్లీ	3	3	0	0	6	1.257
గుజరాత్	4	3	1	0	6	1.031
బెంగళూరు	3	2	1	0	4	1.149
పంజాబ్	3	2	1	0	4	0.074
కోల్‌కతా	4	2	2	0	4	0.070
లఖ్‌నవూ	4	2	2	0	4	0.048
రాజస్థాన్	4	2	2	0	4	-0.185
ముంబై	4	1	3	0	2	0.108
చెన్నై	4	1	3	0	2	-0.891
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

విజేత వెర్‌స్టాపెన్

జపనీస్ గ్రాండ్ ప్రీ



సుజుక (జపాన్): వరల్డ్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగోసారి జపనీస్ గ్రాండ్ ప్రీ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో పోల్ పొజిషన్ నుంచి రేస్‌ను ఆరంభించిన రెడ్ బుల్స్ డ్రైవర్ వెర్‌స్టాపెన్.. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురైనా తట్టుకొని అగ్రస్థానంలో నిలిచాడు. మెక్ లారెన్స్‌కు చెందిన డ్రైవర్లు నోరిస్, పియాస్ట్రి రెండు, మూడు స్థానాలు దక్కించుకొన్నారు.

రుద్రాంక్ష్‌కు పసిడి

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో రుద్రాంక్ష్ భారత్‌కు రెండో స్వర్ణాన్ని అందించాడు. ఆదివారం జరిగిన పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో రుద్రాంక్ష్ 252.9 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకొన్నాడు. ఇస్త్వాన్ మార్టిన్ (హంగేరి) 251.7 పాయింట్లతో రజతం, మార్సెల్లో గుజెరజ్ (అర్జెంటీనా) 230.1 పాయింట్లతో కాంస్యం దక్కించుకొన్నారు. కాగా, క్వాలిఫయర్స్‌లో అదరగొట్టిన అర్జున్ బబూటా ఏడో స్థానానికే పరిమితమయ్యాడు.



బిజినెస్



3 రోజులు.. 3 విమానాల్లో

అమెరికాకు యాపిల్ ఫోన్ల ఎగుమతి

- ట్రం'పోటు' తప్పించుకునేందుకు కంపెనీల కొత్త అస్త్రం
- భారీ పరిమాణంలో ఐఫోన్లు, వజ్రాభరణాల తరలింపు
- అయినా ఫోన్ల ధరలు పెరగవు: యాపిల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను తప్పించుకునే లక్ష్యంతో యాపిల్ కంపెనీ కేవలం మూడు రోజుల వ్యవధిలో భారత్ నుంచి నిండుగా లోడ్ చేసిన మూడు విమానాల్లో ఐఫోన్లను అమెరికాకు తరలించింది. సీనియర్ భారత ప్రభుత్వ అధికారులు ఈ విషయం ధ్రువీకరించారు. ట్రంప్ ప్రభుత్వం 10% టారిఫ్‌ల ప్రకటన వెలువడడం కన్నా ముందు మార్చి చివరి వారంలో ఈ ఐఫోన్ల తరలింపు జరిగిందన్నారు. అంతేకాదు కొత్త టారిఫ్‌లు అమలులోకి వచ్చినప్పటికీ భారత్‌లో గాని, ఇతర దేశాల మార్కెట్లో గాని తక్షణ చర్యగా ఐఫోన్ల ధరలు పెంచే ఆస్కారం లేదని యాపిల్ స్పష్టం చేసింది. సాంప్రదాయికంగా వస్తు రవాణా పరిశ్రమకు ఇది అంత రద్దీ ఉండని సమయం. అయినప్పటికీ ట్రంప్ చర్యల నేపథ్యంలో చైనా, భారతదేశాల్లోని తమ ఫ్యాక్టరీల నుంచి భారీగా యాపిల్ కంపెనీ ఐఫోన్లను తరలించిందని వారు తెలిపారు. టారిఫ్‌లకు ముందే భారీ పరిమాణంలో ఐఫోన్ల తరలింపు వల్ల యాపిల్ కంపెనీ స్థిరమైన ధరలను నిర్వహించగలిగిందంటున్నారు. దీంతో అమెరికాలోని యాపిల్ కంపెనీ గిడ్డంగులన్నీ భారీ ఐఫోన్ నిల్వలు కలిగి ఉన్నాయి. అలాగే కొత్త టారిఫ్‌ల ప్రభావం తమపై ఎంత మేరకు ఉంటుందని మదింపు చేసుకునే లోగా ధరలు పెంచే పని లేకుండా జరిగిపోయింది. భారత్ నుంచి ఈ ఆకస్మిక ఎగుమతుల వృద్ధి ఒక్క యాపిల్‌కే పరిమితం కాలేదు. ముంబై నుంచి వజ్రాభరణాల ఎగుమతులు సైతం ఏప్రిల్ 1-4 తేదీల మధ్య కాలంలో ఆరు రెట్లు పెరిగి 34.4 కోట్ల డాలర్లకు చేరినట్టు చెబుతున్నారు. అలాగే దుస్తుల ఎగుమతుల్లో కూడా వేగం పెరిగింది.

- బీ2బీ ద్విచక్ర ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థ బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్‌తో ఎలక్ట్రిక్ వాహనాల అగ్రిగేటర్ ఈవీ91 టెక్నాలజీస్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 10,000 ఎలక్ట్రిక్ వాహనాలను ఈవీ91 అందుబాటులో ఉంచనుంది.
- ఐటీసీ లిమిటెడ్.. తన ఆశీర్వాద్ మసాలా ఉత్పత్తుల కోసం టాలీవుడ్ నటుడు నేచురల్ స్టార్ నానిని ప్రచారకర్తగా నియమించుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్ల కోసం ప్రత్యేకంగా నాని బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. నాని ప్రచారంతో ఆశీర్వాద్ మసాలా ఉత్పత్తులు వినియోగదారులకు మరింత చేరువ అవుతాయని ఐటీసీ లిమిటెడ్ వెల్లడించింది.

ఇక ఒక రాష్ట్రం-ఒకే ఆర్ఆర్‌బీ విధానం

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రణాళిక సిద్ధం



న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)ల్లో నిర్వహణాపరమైన సమర్థతను సాధించి, వ్యయాలను హేతుబద్ధీకరించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ త్వరలో "ఒక రాష్ట్రం-ఒకే ఆర్ఆర్‌బీ" విధానం అనుసరించేందుకు రెడీ అవుతోంది. ఫలితంగా ప్రస్తుతం 43గా ఉన్న ఆర్ఆర్‌బీల సంఖ్య 28కి తగ్గుతుంది. ఆర్ఆర్‌బీల కన్సాలిడేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, తుదివిడత ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కావచ్చని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రణాళిక ప్రకారం త్వరలోనే వివిధ రాష్ట్రాల్లోని 15 ఆర్ఆర్‌బీలను విలీనం చేసే ఆస్కారం ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ గరిష్ఠంగా 4 ఆర్ఆర్‌బీలతో అగ్రస్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మూడేసి, బిహార్, గుజరాత్, జమ్ము-కశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లలో రెండేసి ఆర్ఆర్‌బీలున్నాయి. తెలంగాణ రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆస్తులు, అప్పులను ఏపీజీవీబీ, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మధ్య విభజించే ప్రక్రియ పూర్తయింది. ఇందుకు నాందిగా ఆర్ఆర్‌బీలకు నిధుల కల్పన కూడా జరిగింది. ఆర్ఆర్‌బీల వృద్ధికి అవసరమైన మూలధనం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2021-22 సంవత్సరంలో రూ.5,445 కోట్ల నిధులను అందించింది. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్ఆర్‌బీల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. ఆర్ఆర్‌బీలన్నింటి ఉమ్మడి నికరలాభం జీవితకాల గరిష్ఠ స్థాయిలో రూ.7,571 కోట్లుగా నమోదైంది. వాటి సీఏఆర్ కూడా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆల్ టైమ్ గరిష్ఠం 14.2 శాతానికి చేరింది. స్థూల మొండి బకాయిలు పదేళ్ల కనిష్ఠ స్థాయి 6.1 శాతానికి దిగి వచ్చింది. ఆర్ఆర్‌బీల కన్సాలిడేషన్ ప్రక్రియను ప్రభుత్వం 2004-05 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించి మూడు దశల్లో విలీనం చేయడంతో అప్పటికి 196గా ఉన్న ఆర్ఆర్‌బీలు ఇప్పుడు 43కి తగ్గాయి.

మరో పావు శాతం వడ్డీ కోత

నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం

ముంబై: కీలక రెపో రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరో పావు శాతం తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం 4% కన్నా దిగిరావడమే ఇందుకు కారణం. దీనికి తోడు అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన నేపథ్యంలో వృద్ధిని ఉద్దీపింప చేయాల్సిన అవసరం సైతం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమవుతున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) బుధవారం ప్రకటించనున్న నూతన ఆర్థిక సంవత్సరపు తొలి పాలసీలో రెపో రేటును మరో పావు శాతం తగ్గించే ఆస్కారం ఉందని ఆర్థిక నిపుణులంటున్నారు. ఫిబ్రవరి పాలసీలో 0.25 శాతం తగ్గింపుతో ప్రస్తుతం రెపో రేటు 6.25 శాతం వద్ద ఉంది. ఈసారి మరో పావు శాతం తగ్గించినట్టయితే 6 శాతానికి దిగొస్తుంది. ఫలితంగా గృహ, వినియోగ, పారిశ్రామిక రుణాలపై వడ్డీ రేట్లు మరింతగా తగ్గి అన్ని వర్గాలకు ఊరట లభిస్తుంది.

23,200 పైన బుల్లిష్

(ఏప్రిల్ 1-4 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

గత వారం నిఫ్టీ: 22,904 (-615)

నిఫ్టీ గత వారం 22,857-23,566 పాయింట్ల మధ్యన కదలాడి 615 పాయింట్ల నష్టంతో 22,904 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,167, 23,361, 23,227, 22,836 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,200 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,600

నిరోధ స్థాయిలు: 23,100, 23,200, 23,300 (23,000 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22,700, 22,600, 22,500 (22,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	435
చిత్తూరు	480	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	117
కరీంనగర్	100	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	85
కర్నూలు	100	నెల్లూరు	90
విశాఖపట్నం	109	అనంతపురం	90
గోదావరి	115		

వేచి చూసే ధోరణి బెస్ట్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్స్ అమల్లోకి రావటంతో ప్రపంచ మార్కెట్లు షేక్ అవుతున్నాయి. ట్రంప్‌నకు పోటీగా చైనా సహా మిగిలిన దేశాలు ప్రతీకార సుంకాలను ప్రకటించటంతో అనిశ్చితి పెరిగింది. భారత్‌పై దీని ప్రభావం తక్కువే అయినప్పటికీ నెగటివ్ సెంటిమెంట్‌తో సూచీలు పడిపోయే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మదుపరులు వేచి చూసే ధోరణిలో ఉండటం ఉత్తమం. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో మూమెంటమ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

అపోలో హాస్పిటల్స్: జీవితకాల గరిష్ఠం నుంచి 20 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం టర్న్ అరౌండ్ అయ్యాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతోంది. గత శుక్రవారం రూ.6,714 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.6,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.6,850/6,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,660 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

అదానీ పవర్: గత ఏడాది జూన్ నుంచి వరుసగా పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. రూ.500 స్థాయిలో మద్దతు తీసుకుని కన్సాలిడేట్ అవుతున్నాయి. గత వారం చివరి మూడు సెషన్లలో బాగా రాణించాయి. గత శుక్రవారం రూ.532 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.530/520 శ్రేణిలో ప్రవేశించి రూ.590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు ఫార్మా రంగంలోని షేర్లు కుదేలవుతున్నప్పటికీ ఈ షేరు మాత్రం అనూహ్యంగా పెరుగుతోంది. నెల రోజుల్లోనే 15 శాతం మేర పెరిగింది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం రూ.3,286 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.3,260 వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,400 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,220 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

మాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్: గత ఏడాది నవంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ఈ ఏడాది మార్చి నుంచి పుంజుకుంది. దాదాపు 20 శాతం మేర పెరిగింది. ప్రస్తుతం రూ.1,100 స్థాయిలో బేస్ ఏర్పడుతోంది. బెంచ్‌మార్క్ సూచీలు ఒడుదొడుకులకు లోనైనప్పటికీ ఈ షేరు మాత్రం రాణిస్తోంది. గత శుక్రవారం రూ.1,165 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,140 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,100 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఇండస్ టవర్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం మంచి బేస్ ఏర్పరచుకుంటోంది. గత ఏడాది నవంబరు నుంచి డార్వాస్ బాక్స్ మాదిరిగా చలిస్తున్నాయి. కీలకమైన రూ.320 స్థాయిలో మరోసారి మద్దతు తీసుకుని పుంజుకున్నాయి. గత శుక్రవారం రూ.360 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.350 వద్ద పొజిషన్ తీసుకుని రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.320 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

భారీ కరెక్షన్‌కు ఆస్కారం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 23,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై ముందు వారంతో పోల్చితే 615 పాయింట్ల నష్టంతో 22,900 వద్ద ముగిసింది. 2,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించిన నేపథ్యంలో ఈ కరెక్షన్ ఊహించినదే అయినప్పటికీ సాధారణం కన్నా అధికంగా ఉండడం అప్రమత్త సంకేతం. రాబోయే కొద్ది రోజుల్లో మార్కెట్ నిలదొక్కుకుంటే తప్ప తక్షణ ర్యాలీకి ఆస్కారం లేదు. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం ఏర్పడిన తీవ్ర బేరిష్ ధోరణి వల్ల ఈ వారం మన మార్కెట్ భారీ ప్రతికూల ధోరణిలోనే ప్రారంభం కావచ్చు. తీవ్రమైన కదలికలకు కూడా ఆస్కారం ఉంది. వారం ప్రారంభ ట్రేడింగ్ ఎలా ఉంటుందో కూడా ఊహించడం కష్టం. ఇటీవల ఏర్పడిన కనిష్ఠ స్థాయిల్లో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత బలహీనత సాధించినట్టయితే కనిష్ఠ స్థాయి 22,500 వద్ద మద్దతు తీసుకోవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే సానుకూల సంకేతం వెలువడుతుంది. రికవరీ బాట పడితే మానసిక అవధి 23,000.

బేరిష్ స్థాయిలు: 22,500 వద్ద మద్దతు తీసుకోలేకపోతే మరింత బలహీనతలో పడుతుంది. మద్దతు స్థాయి 22,350. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. తదుపరి మద్దతు స్థాయిలు 22,200, 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ మాత్రం గత వారంలో మైనర్ రియాక్షన్ మాత్రమే సాధించి 51,500 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో 52,000 వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక మద్దతు స్థాయి 50,800 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 50, 100 డిఎంఏల కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం 22,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" తప్పనిసరిగా పునరుజ్జీవం సాధించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు నిరోధం : 22,550, 22,700

ఏపీ @ 8.21%

(మొదటి పేజీ తరువాయి)



బాబు హయాంలో గతంలోనూ డబుల్ డిజిట్

ఏడాదిలోనే 2.02 శాతం పెరిగింది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, ఇంధన రంగం సహా పలు రంగాల్లో తీసుకొచ్చిన విధానాలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని సీఎం తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజల సమిష్టి విజయమంటూ అందరికీ అభినందనలు తెలిపారు. బంగారు భవిష్యత్ కోసం కలిసి ప్రయాణాన్ని కొనసాగిద్దామని పిలుపిచ్చారు. 2024-25లో రాష్ట్రం 8.21 శాతం వృద్ధిరేటుతో రూ.8.65 లక్షల కోట్ల జీఎస్‌డీపీని సాధించిందని కేంద్రం తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ధరల ప్రకారం 12.02 శాతం వృద్ధిరేటుతో రూ.15.93 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. ఈ విభాగంలో 5వ స్థానంలో నిలిచింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15.41 శాతం వృద్ధిరేటు నమోదైంది. వ్యవసాయ రంగంలో 22.98 శాతం, ఉద్యాన రంగంలో 21.29 శాతం నమోదైంది. పారిశ్రామిక రంగం ఇంకా పుంజుకోవాల్సి ఉంది. 6.4 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. నిర్మాణ రంగంలో 10.28 శాతం, ఉత్పాదకం-5.18 శాతం, సేవల 11.82 శాతం, విద్య, ఆరోగ్యం-12.15 శాతం, వాణిజ్యం, హోటళ్లు, ఇతర రంగాల్లో 11.58 శాతం వృద్ధి నమోదైంది. రియల్ ఎస్టేట్, ఇతర రంగాలు 11.22 శాతం నమోదు చేశాయి. 2024-25లో తలసరి ఆదాయంలో 11.89 శాతం వృద్ధి నమోదైంది. తలసరి రాబడి రూ.2,66,240కు చేరింది. ఇందులో రాష్ట్రం 3వ స్థానంలో నిలిచింది. తమిళనాడు, కర్ణాటక మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

సీఎం చంద్రబాబు 15% వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కృషిచేస్తున్నారు. గత ఏడాది జూన్‌లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, సమస్యల పరిష్కారం.. 2019-24 మధ్య తలెత్తిన సమస్యల నుంచి రాష్ట్రం కోలుకోవడానికి దోహదపడ్డాయి. కేంద్ర గణాంకాల ప్రకారం.. ఆయన హయాంలోనే ఏపీ రెండు సార్లు డబుల్ డిజిట్ వృద్ధి రేటును నమోదుచేసింది. ఆయన సీఎంగా ఉన్నప్పుడు 2015-16లో 12.16%, 2017-18లో 10.09% వృద్ధి రేటు సాధించినట్లు నివేదిక తెలిపింది.

నేటి నుంచి వైద్యం బంద్

» నెట్‌వర్క్ ఆస్పత్రుల మరోసారి లేఖ


అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించకుండా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద సేవలు కొనసాగించలేమని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) మరోసారి స్పష్టం చేసింది. బకాయిలు విడుదల చేయకపోతే తాము సేవలు కొనసాగించలేమని ఆశా ఎప్పటి నుంచో ప్రభుత్వానికి లేఖలు రాస్తూ వచ్చింది. గత నెల 7న రాసిన లేఖలోనూ ఏప్రిల్ 7 నుంచి వైద్య సేవలు కొనసాగించలేమని పేర్కొంది. తాము గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. రూ.3500 కోట్ల బకాయిలు పేరుకుపోవడం వల్ల నెట్‌వర్క్ ఆస్పత్రులపై భరించలేని ఆర్థిక భారం పడిందని, అందుకే తాము సేవలు కొనసాగించలేకపోతున్నామని చెప్పింది. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు గుర్తించి బకాయిలు విడుదల చేయాలని తాజా లేఖలో డిమాండ్ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత విడుదల చేసిన బకాయిలు కంటే నెట్‌వర్క్ ఆస్పత్రులు అందించిన వైద్య సేవల విలువ ఎక్కువగా ఉందని తెలిపింది. గతేడాది ఏప్రిల్‌లో చేసిన వైద్య సేవలకు ఇంత వరకూ పూర్తి చెల్లింపులు జరగలేదని పేర్కొంది. ఇన్ని సమస్యల మధ్య సోమవారం నుంచి వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

అమెరికాతో మాట్లాడండి

(మొదటి పేజీ తరువాయి)

27% దిగుమతి సుంకంతో ఆక్వాకు నష్టం





పోసిస్తోందని, అమెరికా సుంకాల కారణంగా ఆక్వా పరిశ్రమ నష్టపోతుందని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో రైతాంగానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. 'భారత్ నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం 27% దిగుమతి సుంకం విధించింది. ఈనెల 5 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. 2023-24లో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92% వాటాను కలిగి ఉన్నాయి. అమెరికాకు రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత్‌పై 27% దిగుమతి సుంకం విధించిన కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై 10% పన్ను మాత్రమే అమెరికా విధిస్తోంది. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ, వారికి అనుకూలంగా మారుతోంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77% కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ(సీవీడీ) భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలు కలుపుకొంటే ఈక్వెడార్‌కు, భారత్‌కు మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20% ఉంటుంది. ఈ కారణంగా అమెరికాకు వెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈ భారం పడుతోంది. గతంలో వచ్చిన ఆర్డర్లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేసి కోల్డ్ స్టోరేజీలు, పోర్టుల్లో ఉన్నాయి. వీటిపై సుంకం భారం పడుతుంది. యూరోపియన్ యూనియన్‌లో భారత ఎగుమతిదారులు 50% తనిఖీ రేటు, 4-7% దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. వియత్నాం వంటి దేశాలు ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్-ఎఫ్‌టీఏ) కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్లను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయ్‌లాండ్, జపాన్ మార్కెట్లు భారత్ నుంచి సీ ఫుడ్‌ను కొనుగోలు చేసి, వాటిని ప్రాసెస్ చేసి, అమెరికాకు ఎగుమతి చేస్తాయి. అయితే నేడు తుది ఉత్పత్తులపై విధించిన అధిక టారిఫ్‌ల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేస్తున్నాయి. ఏపీలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగం ఉంది. 27% సుంకాల కారణంగా రైతుల నుంచి పంట సేకరించడం ఎగుమతిదారులు నిలిపివేశారు. ఈ పరిణామాలు ఏపీ ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు.. ఇలా అందరికీ సమస్యలు వచ్చాయి' అని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి, సుంకాల నుంచి రొయ్యల ఉత్పత్తులను మినహాయింపు జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 'సకాలంలో మీరు జోక్యం చేసుకుని, సమస్యను పరిష్కరించడం వల్ల ఆక్వా రంగంపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి సమావేశం: మత్స్యశాఖ కమిషనర్

అమెరికా నిర్ణయాలతో ఆక్వా రంగం ఎదుర్కోనున్న ఇబ్బందులపై ఇప్పటికే దృష్టిసారించామని, వీటిపై చర్చించడానికి సచివాలయం వేదికగా సోమవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్ చెప్పారు. బాపట్లలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. రొయ్యల అమెరికా విధిస్తున్న అదనపు సుంకాలతో రైతుల్లో గందరగోళం నెలకొందన్నారు. క్షేత్రస్థాయి అధికారులతోపాటు ఆయా కంపెనీల ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేసి ఆక్వా రంగం పునరుజ్జీవానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని తెలిపారు. అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలకు విరుగుడుగా వేరే దేశాలకు ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించి, ఆక్వా రంగానికి అన్ని విధాలుగా భరోసా కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



అమరావతిలో ఏర్పాటు కానున్న సైన్స్ సిటీ (ఊహాచిత్రం)

అమరావతిలో సైన్స్ సిటీ!

» రూ.200 కోట్ల వ్యయంతో 50 ఎకరాల్లో నిర్మాణం

మంగళగిరి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో సైన్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించింది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించనుంది. ఇందులో రూ.200 కోట్ల వ్యయంతో సైన్స్ సిటీని ఏర్పాటు చేస్తారు. దీనిలో పది మ్యూజియంలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు, గ్లోబల్ రీసెర్చ్ కొలాబరేషన్, యువతలో ఆవిష్కరణలకు సంబంధించిన నైపుణ్యాల పెంపు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. వాస్తవానికి సైన్స్ సిటీల నిర్మాణానికి ఇప్పటి వరకు ఆయా ప్రాంతాలు స్థలాన్ని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మంజూరు చేస్తుంది. మిగతా నగం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. కానీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మొత్తం ఖర్చు భరించాలని సీఎం చంద్రబాబు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పరిగణనలోకి తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో సైన్స్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర సైన్స్ సిటీ సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సైన్స్ సిటీ ద్వారా అమరావతి సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారుతుందని తెలిపారు. వచ్చే అయిదేళ్లలో సైన్స్ సిటీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

దక్షిణాదిలో ఆహార కల్తీలో ఏపీకి నాలుగో స్థానం

» రెండో స్థానంలో తెలంగాణ.. టాప్‌లో తమిళనాడు

» 58 శాతంతో దేశంలోనే అగ్రస్థానంలో ఉత్తరప్రదేశ్

» కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కల్తీ రోజురోజుకీ పెరిగిపోతోంది. ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే అని తేలింది. ఈ మేరకు కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించిన లెక్కలు అందోళన రేపుతున్నాయి. 2021-24 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీగా తేలినవాటి లెక్కలను రాష్ట్రాల వారీగా ఆ శాఖ ఇటీవల పార్లమెంటుకు నివేదించింది. దీని ప్రకారం.. దక్షిణాది రాష్ట్రాల్లో ఆహార కల్తీలో అంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఏపీలో గత నాలుగేళ్ల సగటు 9 శాతంగా నమోదైంది. అంటే ఇక్కడ సేకరించిన ప్రతీ వంద నమూనాల్లో 9 వరకు కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లోనే అగ్రస్థానంలో నిలవగా.. తెలంగాణ 14 శాతంతో రెండో స్థానంలో, కేరళలో 13.11 శాతంతో మూడో స్థానంలో ఉన్నాయి. కర్ణాటక 6.30 శాతంతో ఐదో స్థానంలో నిలిచింది.

వామ్మో... యూపీ..!

ఆహార కల్తీలో ఉత్తరప్రదేశ్ (యూపీ) దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రంలో గత నాలుగేళ్లలో 93,182 ఆహార నమూనాలు సేకరించగా.. అందులో 54,474 నమూనాల (58.75 శాతం)లో కల్తీని గుర్తించారు. యూపీ తర్వాత ఝార్ఖండ్ 49.91 శాతం, హరియాణా 27.48 శాతం, రాజస్థాన్ 26.28 శాతం సగటుతో ఆహారకల్తీలో వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గత నాలుగేళ్ల జాతీయ సగటు 22 కంటే ఈ రాష్ట్రాల్లో చాలా ఎక్కువగానే ఆహార పదార్థాల కల్తీ ఉండడం గమనార్హం. కాగా కలుషిత తాగునీరు, ఆహార పదార్థాల వల్ల మనుషులు 200 రకాలకు పైగా వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.



నేపాల్లో కిడ్నాప్ నిందితులు..!

» వంశీ ముఖ్య అనుచరుడు కొమ్మా కోట్లు, మరో ముగ్గురు అక్కడే

» రాత్రి పూట సన్నిహితులకు ఫోన్లు

» కేసు వివరాలు, పోలీసు కదలికల్లా ఆరా

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మిగిలిన నిందితులు నేపాల్లో తిరుగుతున్నట్లు తెలిసింది. ఈ కేసులో ఇంకా అరెస్టు కావలసిన ప్రధాన నిందితుల్లో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ముఖ్య అనుచరుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు ఉన్నారు. అతడితోపాటు మరి కొంతమంది నేపాల్లో ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ కేసులో మొత్తం 12 మంది నిందితులు ఉండగా.. వంశీ, వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, గంటా వీర్రాజు, నిమ్మ చలపతి, వేల్పూరు వంశీబాబులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వాళ్లంతా విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్నారు. ఏ-5గా ఉన్న ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగాను గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కిడ్నాప్ కేసులో పీటీ వారెంటుపై కోర్టులో హాజరుపరచడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ కేసులో రంగాతోపాటు కోట్లుది ముఖ్య పాత్ర. సత్యవర్ధన్‌కు సంబంధించిన మొత్తం సమాచారాన్ని కోట్లే సేకరించి రంగాతో పంచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వంశీని అరెస్టు చేసిన మరుక్షణమే ఇద్దరూ ఊరు దాటేశారు. రంగా ఇటీవల ఏలూరులో సీఐడీ బృందానికి దొరికిపోయాడు. మిగతా ఆరుగురిలో విశాఖకు చెందిన ఇద్దరు నిందితులు శ్రీకాకుళం వైపు పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. నేపాల్లో తలదాచుకున్న కోట్లు, మరో ముగ్గురు.. అక్కడి నుంచే సన్నిహితులకు ఫోన్ చేసి కేసు విషయాలను, పోలీసుల కదలికలను తెలుసుకుంటున్నట్టు సమాచారం. కోట్లు రాత్రి సమయాల్లో ఫోన్ చేస్తున్నట్టు నిఘా వర్గాలు పసిగట్టాయి. నలుగురూ నేపాల్లో ఎక్కడుంటున్నారో అని ఆరా తీస్తున్నారు. పక్కా వివరాలు అందగానే అరెస్టు చేసే దిశగా పోలీసులు అడుగులు వేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ఎమ్మెల్యేల కినుక!

» నామినేటెడ్ పదవుల భర్తీపై అసంతృప్తి

» రెండో విడతలో 6 ఏఎంసీలు జనసేనకు

» ఆ ఆరుచోట్లా టీడీపీ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం

» వారు సిఫారసు చేసిన నేతల పేర్లు పక్కకు

» సమాచారం కూడా ఇవ్వని అధిష్ఠానం

» అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

» చంద్రబాబు దృష్టికి నామినేటెడ్ వ్యవహారం

» పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు బుజ్జగింపుల బాధ్యత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



నామినేటెడ్ పదవుల భర్తీపై టీడీపీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల భర్తీ చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల విషయంలో తమ మాట చెల్లుబాటు కావడంలేదని.. కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా జనసేనకు చైర్మన్ పదవులను కేటాయించడం ఏమిటని ఆరుగురు ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 218 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా ప్రస్తుతానికి 85 కమిటీలకు చైర్మన్లను నియమించారు. వీటిలో టీడీపీకి 68, జనసేనకు 14, బీజేపీకి 3 ఏఎంసీలు దక్కాయి. పొత్తులో భాగంగా నామినేటెడ్ స్థానాల్లోనూ జనసేన, బీజేపీకి అవకాశం ఇస్తున్నారు. ఇప్పుడు ఇదే టీడీపీలో అసంతృప్తికి కారణమవుతోంది. అసంతృప్త ఎమ్మెల్యేల విషయం తెలుసుకున్న పార్టీ అధినేత చంద్రబాబు వారికి నచ్చజెప్పే బాధ్యతను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. పొత్తుల్లో ఉన్నప్పుడు సర్దుబాట్లు తప్పవని, రెండేళ్ల ఓపిక పడితే మనవారికి అవకాశం దక్కుతుందని అసంతృప్త ఎమ్మెల్యేలకు చెప్పాలని పల్లాను చంద్రబాబు ఆదేశించారు. రెండో విడతలో 6 ఏఎంసీలను జనసేనకు కేటాయించారు. ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు తాము సిఫారసు చేసిన పేర్లను పక్కనపెట్టి జనసేన ఏఎంసీలు కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ నియోజకవర్గ పరిధిలోని ఏఎంసీలు భర్తీ చేసే సమయంలో కనీసం తమకు సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం విస్మరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కనీసం తాము సిఫారసు చేసిన పేర్లను పక్కన పెడుతున్న విషయాన్ని కూడా తెలియజేయకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ తీరు కారణంగా నియోజకవర్గాల్లో తాము అవమానాలకు గురవుతున్నామని ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేలతో మాట్లాడి బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

జనసేనలో జూనియర్లకు పదవులు

జనసేనలో మరీ జూనియర్లకు పదవులు దక్కుతుండటం కూడా టీడీపీ సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. టీడీపీలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న సీనియర్ నాయకులకు సైతం పదవులు దక్కడం లేదని వాపోతున్నారు. జనసేనలో మాత్రం తమ కన్నా అలస్యంగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారికి పదవులు దక్కుతుండటాన్ని టీడీపీ సీనియర్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ అధిష్ఠానం సైతం ఇలాంటి వారిని బుజ్జగించడంపై దృష్టి సారించడం లేదు.

ఆ ఆరుచోట్లా ఇదీ పరిస్థితి

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గంలో ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా జనసేనకు చెందిన జుట్టుగ నాగరాజును నియమించారు. ఇక్కడ రఘురామ టీడీపీ నుంచి మరొకరి పేరును సిఫారసు చేశారు.
- కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన గరికపాటి శివశంకర్ పేరును ప్రకటించారు. ఇక్కడ కూడా టీడీపీ నుంచి స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వేరే పేరును సిఫారసు చేశారు.
- కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గంలో పెడన వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన అసాది లక్ష్మిని నియమించారు. ఇక్కడ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆ పార్టీ నుంచి వేరే పేరును పంపారు.
- విశాఖపట్నం జిల్లాలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమునిపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డుకు టీడీపీ నుంచి ఒక పేరును సిఫారసు చేయగా జనసేనకు చెందిన రామస్వామి నాయుడు పేరు ప్రకటించారు.
- శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గంలో రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన పొగిరి కృష్ణవేణిని నియమించారు. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే కొండ్రు మురళి టీడీపీకి చెందిన మరొకరి పేరు సిఫారసు చేశారు.
- బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొత్తపల్లి వెంకటలక్ష్మి (జనసేన)ని నియమించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీడీపీ నుంచి మరొకరి పేరు సిఫారసు చేశారు.

నేడు, రేపు అల్లూరి జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన



పాడేరు/అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమ, మంగళవారాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 8గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం చాపరాయికి 11గంటలకు చేరుకుంటారు. దీనికి అవతల వైపున సుమారు 3కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాడు గ్రామాన్ని సందర్శించి, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అక్కడే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడినుంచి దుంబ్రిగుడ చేరుకుంటారు. అల్లూరి జిల్లాకు మంజూరు చేసిన సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. తర్వాత అరకులోయ వెళ్లి ఏపీటీడీసీ హరిత రిసార్ట్‌లో రాత్రి బస చేస్తారు. మరుసటి రోజు(మంగళవారం) ఉదయం 10 గంటలకు అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలను సందర్శిస్తారు. అటవీ శాఖ చెక్కలతో నిర్మించిన కాఫీ వంతెనను ప్రారంభిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో విశాఖపట్నం ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు చేరుకుని ఎకో టూరిజంపై అధికారులతో సమీక్షిస్తారు.

రఘురామ కేసులో.. నేడు పోలీసుల ముందుకు ప్రభావతి!

» రెండ్రోజులు ప్రశ్నించనున్న ప్రకాశం ఎస్పీ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీ చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితురాలి (ఏ-5)గా ఉన్న గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మాజీ డాక్టర్ ప్రభావతి ఎట్టకేలకు పోలీసుల ఎదుట విచారణకు హాజరుకానున్నారు. సోమ, మంగళవారాల్లో ఒంగోలులో ప్రకాశం ఎస్పీ దామోదర్ ఆమెను ప్రశ్నించనున్నారు. ప్రభావతి విచారణకు హాజరు కావాలనిలేదని సహకరిస్తామని చెప్పడానికి ఆమెకు మధ్యంతర రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. రఘురామరాజు శరీరంపై గాయాలకు సంబంధించి జీజీహెచ్ వైద్యులు ఇచ్చిన నివేదికను తారుమారు చేశారని ఆమెపై ప్రధాన అభియోగం.

మత సంస్థలపై బీజేపీ పెత్తనం?

» క్రైస్తవ ఆస్తులు, ఆలయ భూములపైనా కన్నేసింది: సీపీఐ రామకృష్ణ



విజయవాడ(గవర్నర్‌పేట), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దేశంలోని మత సంస్థలన్నిటిపైనా బీజేపీ పెత్తనం చెలాయించేందుకు రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ బిల్లును ముందుకు తెచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవ ఆస్తులపైనా బీజేపీ కన్నేసిందని, దేవాలయ భూములపైనా నిఘా ఉందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం ఏ మత సంస్థలైనా తమ వ్యవహారాలు వారే స్వయంగా నిర్వహించుకునేలా స్వేచ్ఛ ఉందని, దానికి విరుద్ధంగా వాటిపై పెత్తనం చెలాయించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. బీజేపీతో దేశానికి పెను ప్రమాదం ఉందని విమర్శించారు. మతోన్మాద, రాజ్యాంగ విరుద్ధ చర్యలపై పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని సీపీఐ సిద్ధమైందని చెప్పారు. ఈ నెల 13న విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు ప్రముఖ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. వక్ఫ్ బిల్లును సమర్థిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలు, పేద ముస్లింల అభివృద్ధి కోసమే ఈ బిల్లు తెచ్చినట్లు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు హైనారిటీలను మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 11ఏళ్లలో దేశానికి, హిందువులకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణం సముద్ర రాజధాని అంటూ గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు రూ.62వేల కోట్ల అప్పులు తెస్తుండటంపై చర్చ జరగాలని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ అప్పులపై సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలని, అఖిల పక్షంతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషా అరెస్టు

» ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి

» నేడు కడపకు తీసుకురానున్న పోలీసులు

» 2022లో అప్పటి టీడీపీ నేతపై దాడిలో నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

» బాషాపై మరో ఐదు వేర్వేరు కేసులు



అహ్మద్‌బాషా

కడప, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ బాషాను కడప తాలూకా పోలీసులు ముంబైలో అరెస్టు చేశారు. 2022లో నగరంలోని విజయనగర్‌లో మినిస్టర్ కాలనీ పేరిట అంజద్ బాషా కుటుంబ సభ్యులు లేఅవుట్ వేశారు. దీనికి అనుమతులు లేవని ఆరోపణలు వచ్చాయి. ఈ లేఅవుట్ కు ఆనుకుని అప్పటి టీడీపీ నేత, ఇప్పుడు వైసీపీలో ఉన్న జమీలుకు స్థలం ఉంది. దీని విషయమై అహ్మద్‌బాషా జమీల్, అతడి వర్గంపై దాడి చేశారు. ఈ దాడిలో ముస్తాక్ అహ్మద్ అనే వ్యక్తికి కాళ్లు విరిగాయి. అహ్మద్‌బాషాపై కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో నాన్ బెయిలబుల్ కేసు (క్రైం నం.402/22) నమోదైంది. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది నిందితులుగా ఉన్నారు. ఇది కాకుండా ఆయనపై కడప చిన్నచౌకులో ఒకటి, టూ టౌన్‌లో మరో నాలుగు కేసులు ఉన్నాయి. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో వీరి జోలికి ఎవరూ పోలేదు. ఇక, ఎన్నికల సమయంలో అప్పటి హోంమంత్రి అనిత, అచ్చెన్నాయుడుపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా బాషా పోస్టులు పెట్టారు. వీటిపైనా కేసు నమోదైంది. ఎన్నికలకు ముందు అహ్మద్ బాషా ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని తీవ్ర పదజాలంతో దూషించారు. అప్పట్లో ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. దీనిపై కూడా కేసు నమోదైంది. టీడీపీ అధికారంలోకి వచ్చాక అహ్మద్‌బాషా సైలెంట్ అయిపోయారు. ఎక్కువ కాలం గల్ఫ్‌లో ఉంటూ హోటల్ బిజినెస్ చేస్తున్నారు. ఇంకోవైపు, ఆయనపై చిన్నచౌక్ పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. రంజాన్ పండక్కి కడపకు వచ్చిన ఆయన తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు అదేరోజులుగా ముంబైలో ఉంటున్నారు. శనివారం రాత్రి గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ముంబై ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకుని అక్కడ సహార్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కడప పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం అక్కడకు వెళ్లింది. ఆయన్ను అదుపులోకి తీసుకుని బాంద్రా కోర్టులో హాజరుపరిచింది. అక్కడి కోర్టు అనుమతితో సోమవారం కడపకు తీసుకురానున్నారు. అక్కడి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. ఈ విషయం తెలియడంతో టీడీపీ కార్యకర్తలు ఆదివారం కడపలో సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆర్.శ్రీనివాసరెడ్డిని నాడు బాషా తీవ్ర పదజాలంతో దూషించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. 'అయిపాయె.. పాపం పండింది' అంటూ వైరల్ చేశారు.



బాలీవుడ్‌లో 50 ఏళ్లు దాటిన ఓ కండల వీరుడు. తన వయసులో సగమున్న కథానాయికతో కలిసి నటించడంపై విమర్శలువస్తే.. "ఆమెతో మాత్రమే కాదు, ఆమెకు పుట్టబోయే అమ్మాయితో కూడా నటిస్తాను. మీకేంటి బాధ?" అని ఎదురు ప్రశ్నించాడు. ఐదుపదుల వయసు దాటినా అతడిలో వార్ధక్యపు ఛాయలు అంతగా కనబడవు. ముప్పై ఏళ్లకే తెల్ల వెంట్రుకలు రావడం మొదలై.. నాలుగు పదుల వయసుకు ముఖం మీద చర్మం బిగుతును కోల్పోయి.. 50 ఏళ్లకే ముసలివారిలా కనిపించే సామాన్యులకు, అతడికి తేడా ఏంటి?

..ఇలా ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఇటీవలికాలంలో చాలా మంది సెలబ్రిటీలను చూస్తే వయసు అస్సలు తెలియట్లేదు. అరవై, డెబ్భై ఏళ్లొచ్చిన హీరోలు సైతం 40-50ల్లో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. 'మమ్మీ..' అంటూ పిల్లలు ఆలింగనం చేసుకునే వరకూ తెలియనంత అందంతో మెరిసిపోతున్న అమ్మలకు ఇప్పుడు కొదవే లేదు. దీనికి కారణం.. ఇటీవలికాలంలో బాగా అందుబాటులోకి వచ్చిన యాంటీ ఏజింగ్ చికిత్సలే.

పిల్లలు పుట్టాక..

ఆడవారిలో ఎక్కువ మంది ప్రెగ్నెన్సీ తరువాత బాడీ షేపింగ్ చికిత్సలు చేయించుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. పిల్లలు పుట్టాక.. రొమ్ములు జారడం, ఆకృతి మారడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నవారు, వాటిని సరిచేసుకోవడానికి చికిత్స చేయించుకుంటున్నారు. బ్రెస్ట్ ఫ్యాట్ ట్రాన్స్‌ఫర్, బ్రెస్ట్ లిఫ్ట్, బ్రెస్ట్ రిడక్షన్ లాంటివి వీటిలో ఉంటాయి. ప్రసవం అయిన తరువాత కూడా పొట్టభాగం పెద్దగా కనబడే వారు.. అబ్డామినో ప్లాస్టీ, టమ్మీ టక్ ట్రీట్‌మెంట్ చికిత్సలు చేయించుకుంటున్నారు. స్ట్రెచ్ మార్క్స్ (గర్భం దాల్చిన తరువాత పొట్ట దగ్గర వచ్చే చారలు) తొలగించుకోవడానికి కూడా చాలా మంది వైద్యులను సంప్రదిస్తున్నారు. వీటికి అయ్యే ఖర్చు దాదాపు రూ.50-60 వేల వరకూ ఉండవచ్చు.

ముందుగా ప్రారంభిస్తే ఫలితాలు మెరుగ్గా..



చర్మం ముడతలు పడటం, చర్మం వదులుగా మారడం, నుదుటిపై గీతల వంటి సమస్యలకు.. బొటాక్స్, ఫిల్లర్లు, థ్రెడ్ లిఫ్ట్, సర్జరీ వంటి చికిత్సలు చేస్తాం. ఇప్పుడు రీజనరేటివ్ మెడిసిన్ కూడా అందుబాటులోకి వచ్చింది. ఏ చికిత్స అయినా 30-40లలో ప్రారంభిస్తేనే కోరుకున్న ఫలితాలు వస్తాయి. అర్హులైన, నైపుణ్యం కలిగిన ప్లాస్టిక్‌సర్జన్లు, డెర్మటాలజిస్టులను సంప్రదించి, నాణ్యమైన ఉత్పత్తులు వాడితే ఎలాంటి సమస్యలూ రావు. కానీ.. అర్హతలు లేనివారు ఇటీవలికాలంలో ఈ చికిత్సలను అందిస్తుండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాబట్టి ఆ విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ ప్రీతి శుక్లా
ప్లాస్టిక్ సర్జన్, ఫౌండర్, అంబ్రోసియా క్లినిక్

అర్హులా? కాదా? చూసుకోవాలి



యాంటీ ఏజింగ్ చికిత్సలు మూడు రకాలు. అవి.. పీల్స్, ఇంజెక్టబుల్స్, ఎనర్జీ బేస్డ్ డివైజెస్. మృతకణాలు, పిగ్మంటేషన్ వంటివాటిని తొలగించడానికి పీల్స్ వాడతాం. రెండో రకం... బొటాక్స్, ఫిల్లర్ల వంటి ఇంజెక్టబుల్స్. ఎనర్జీ బేస్డ్ డివైజస్ అంటే.. లేజర్లు, రేడియో ఫ్రీక్వెన్సీ డివైజ్‌లు, హైఫూ వంటివి. చర్మంలో కొలాజెన్‌ను పెంచడానికి, సాగే గుణం మెరుగుపరచడానికి వీటిని వాడతాం. ఈ చికిత్సలన్నీ అర్హత కలిగిన వ్యక్తుల చేత మాత్రమే చేయించుకోవాలి. లేదంటే అంతర్గత కండరాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

- డాక్టర్ సింధూర కంభంపాటి
సీనియర్ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, స్టార్ హాస్పిటల్

దాచాలంటే దాగునులే

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు చాలానే అందుబాటులోకి వచ్చాయి. ఎప్పటికీ యవ్వనంగా కనిపించాలనుకునేవారి సంఖ్య కూడా ఎక్కువైంది. ఒకప్పుడు సినీ తారలకు మాత్రమే పరిమితమైన యాంటీ ఏజింగ్ చికిత్సలు ఇప్పుడు సామాన్యులకూ చేరువయ్యాయి. డబ్బు ఎక్కువగా ఉన్నవారు.. కాస్తంత ఖరీదైనా సరే వినూత్నమైన పరిష్కారాల వైపు చూస్తున్నారు. యాంటీ ఏజింగ్ చికిత్సల కోసం కొందరు సరాసరిన నెలకు 10-15 వేల రూపాయలను ఖర్చు చేస్తోంటే, కొంతమంది 50-90 వేల రూపాయలను కూడా ఖర్చు చేస్తున్నారు. దీంతో యాంటీ ఏజింగ్ చికిత్సల వ్యాపారం బాగా జోరందుకుంది. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ చర్మం సాగడంతోపాటు తేమ కోల్పోతుంది. ఫలితంగా ముడతలు, గీతలు, బుగ్గలు లోపలకు చొచ్చుకుపోవడం.. వంటి మార్పులు సంభవిస్తాయి. జుట్టు తెల్లబడడం, ఊడిపోవడం సరేసరి. జన్యుపరమైన కారణాలు, జీవనశైలి మార్పులు, రోజువారీ జీవితంలో మనం వాడే వస్తువుల్లో ఉండే రసాయనాల వల్ల వయసు మీరే ప్రక్రియ కొందరిలో మరికొంత వేగంగా జరుగుతుంది. అలాంటివారంతా యాంటీ ఏజింగ్ చికిత్సలపై ఆసక్తి చూపుతున్నారని అంబ్రోసియా క్లినిక్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ ప్రీతి శుక్లా తెలిపారు. క్లినిక్‌లకు వెళ్లి చేయించుకునే పెద్ద పెద్ద చికిత్సల సంగతి పక్కన పెడితే ప్రస్తుతం అందరూ ఎక్కువగా వాడుతున్నవి.. యాంటీ ఏజింగ్ క్రీములు. సూర్యుడి అతినీలలోహిత (యూవీ) కిరణాల బారిన పడకుండా చర్మాన్ని కాపాడే ఈ క్రీముల వల్ల.. ముడతలు పడటం, నుదుటిపై గీతలు రావడం వంటి సమస్యలను కొంతమేరకు నివారించవచ్చు. అయితే, ఇలాంటి క్రీమ్‌లతో ఫలితాలు పరిమితమేనని.. చాలా మంది కాస్మెటాలజిస్టులు, డెర్మటాలజిస్టులు, ప్లాస్టిక్ సర్జన్లు చెబుతున్నారు. ఎందుకంటే.. అందరికీ అనువుగా ఉండేలా వాటిని అతి తక్కువ గాఢతతో చేస్తారని, సాధారణ చర్మం కలిగినవారికి మాత్రం వాటితో కొంత ఫలితం ఉంటుంది తప్ప అందరికీ ఒకే స్థాయిలో ఉండదని వారు వివరిస్తున్నారు. ఇక.. ప్రస్తుతం భారతీయ యాంటీ ఏజింగ్ మార్కెట్‌లో ఎక్కువగా వినిపిస్తున్న మాట.. 'బయో రీ మోడలింగ్'. దీనిలో భాగంగా చర్మానికి తేమ అందించడంతో పాటు కొలాజెన్ ఉత్పత్తి అయ్యేలా చర్మాన్ని ప్రేరేపిస్తారు. చర్మంలో సాగే గుణాన్ని పెంపొందింపజేస్తారు. చికిత్సలేవైనా సరే, ఎంత చెప్పినా సరే ఒత్తిళ్లతో కూడిన ఉద్యోగాలు చేసేవారికి వాటితో మెరుగైన ఫలితాలు రావడం కష్టమేనని హెయిర్‌లైన్ స్టూడియో అధినేత, సెలబ్రిటీ స్టైలిస్ట్ వంశీ అభిప్రాయపడ్డారు. వేళకు పౌష్టికాహారం తీసుకుంటూ, కంటి నిండా నిద్రపోతూ, నిత్య వ్యాయామాలు చేసే వారికి ఈ చికిత్సలు బాగా ఉపకరిస్తాయని ఆయన పేర్కొన్నారు. "సహజంగా వచ్చేదే అందం, అది తెలుసుకుంటేనే ఆనందం" అంటారాయన.



బోలెడన్ని చికిత్సలు..

వయసు మీద పడుతున్నా యవ్వనంగా కనిపించేలా చేయడానికి అనేక రకాల చికిత్సలున్నాయి. ప్రాథమికంగా యాంటీ ఏజింగ్ క్రీములు మొదలు.. కణజాల స్థాయిలో చర్మం పై ప్రభావం చూపే ఫేషియల్ సీరమ్‌లు, మాయిశ్చరైజర్ల దాకా పలు ఉత్పత్తులు, ప్రక్రియలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

బొటాక్స్: ముఖంపై ముడతలను పోగొట్టడానికి ఇచ్చే ఒక న్యూరో టాక్సిన్ ప్రొటీన్ ఇది. దీనిని బ్యాక్టీరియం క్లోస్ట్రిడియం బొటులినమ్ అనే బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుంది. దీనిని మన కండరాల్లోకి చొప్పిస్తే ఆ కండరాలు పనిచేయడం మానేస్తాయి. దీనివల్ల చర్మంపై గీతలు తగ్గుతాయి. ముడతలు పోతాయి. చర్మం మృదువుగా కనిపిస్తుంది. వయసు తక్కువగా అనిపిస్తుంది. అయితే.. ఈ ఇంజెక్షన్ సరిగ్గా చేయకపోయినా, అది సరైన కండరాల్లోకి వెళ్లకపోయినా ఫలితాలు చాలా ఇబ్బందిగా ఉంటాయి. సంవత్సరానికి 2-3 మూడు ఇంజెక్షన్లు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సెషన్‌కూ 15-20 వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది.

ఫిల్లర్లు: ఫిల్లర్స్‌లో హైల్యూరానిక్ యాసిడ్ ఉంటుంది. కళ్ల కింద గుంతలు, నవ్వినప్పుడు వచ్చే గీతలను పూరించడానికి వాడతారు. దీని ఖర్చు 20-40 వేల రూపాయల వరకూ ఉంటుంది. ఫిల్లర్ నాణ్యత, డాక్టర్ అర్హతలను బట్టి కూడా ఈ ఖర్చు మారుతుంటుంది.

కెమికల్ పీల్: ఈ పద్ధతిలో కెమికల్ సొల్యూషన్‌ను చర్మం లోపలకు జొప్పిస్తారు. తద్వారా చర్మం పై పొర తొలగిస్తారు. కొత్తగా వచ్చే చర్మం కాంతివంతంగా ఉంటుంది. ఈ యాంటీ ఏజింగ్ చికిత్స ఖర్చు ఒక్క సిటింగ్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల దాకా ఉంటుంది.

ఫోటోఫేషియల్: ఇది కాంతి ఆధారిత చికిత్స. కొల్లాజెన్ ఉత్పత్తి మెరుగుపరచడానికి, వయసు ప్రభావం తగ్గించడానికి వినియోగిస్తారు. చర్మం మృదువుగా మారేందుకు, పునరుత్తేజం కావడానికి ఈ చికిత్స తోడ్పడుతుంది. దీనిలోనూ రెండు రకాలు ఉన్నాయి. ఒకటి ఎల్ఈడీ అయితే మరోటి ఇంటెన్స్ పల్స్‌డ్ లైట్ (ఐపీఎల్) థెరపీ. వీటికి ఒక్కో సెషన్‌కూ రూ.2 వేల నుంచి రూ.5 వేల దాకా వసూలు చేస్తున్నారు.

ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ: చర్మంపై ముడతలు, గీతలు పోగొట్టటానికి వాడుతున్నారు. దీని ఖర్చు సెషన్‌కు రూ.5 వేల నుంచి 12 వేల రూపాయల దాకా ఉంటుంది.

లేజర్ చికిత్సలు: వీటిని బ్లాక్ ప్యాచెస్ వంటి వాటి నిర్మూలన కోసం వాడుతుంటారు. సెషన్‌కు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ ఉండవచ్చు. పిగ్మెంట్ సంబంధిత చికిత్సలకైతే ఆరు సెషన్‌లు ఉంటాయి. ఈ లేజర్‌లో విభిన్న రకాలు ఉంటాయి. రకాన్ని బట్టి ఖర్చు కూడా మారుతుంటుంది. వీటిలో క్యు స్విచ్ లేజర్, ఫ్రాక్షనల్ లేజర్ వంటివి ఎక్కువగా వాడుతున్నారు.

స్కిన్ బూస్టింగ్ ఇంజెక్షన్స్: చర్మాన్ని యవ్వనంతో మెరిసిపోయేలా చేయడానికి ఈ చికిత్స చేస్తారు. వీటిలో పెప్టైడ్స్, ఎక్సోజోమ్స్, హైల్యూరానిక్ యాసిడ్స్ ఇలా చాలా ఉన్నాయి. ఈ ఇంజెక్షన్లన్నీ రూ.15-20 వేల ధరలో ఉంటాయి. చర్మ స్థితి, ఆరోగ్య పరిస్థితి, తదితర అంశాల ఆధారంగా ఎన్ని ఇంజెక్షన్లు ఇవ్వాలన్నదీ వైద్యులు నిర్ణయిస్తారు. వాహనాలకు సర్వీసింగ్ లాగా.. ఈ తరహా చికిత్సలను క్రమం తప్పకుండా చేయించుకోవాల్సి ఉంటుంది.

హెయిర్ గ్రోత్ ట్రీట్‌మెంట్: యాంటీ ఏజింగ్ చికిత్సల్లో జుట్టు కూడా ఒక భాగమే. ఇంకా చెప్పాలంటే.. జుట్టు ఒక ప్రధాన భాగం. అది బాగా పెరిగేందుకు చేసే ఈ చికిత్స ఒక్కో సెషన్‌కూ 15-20 వేల రూపాయల ఖర్చవుతుంది.

హైఫూ (హై ఇంటెన్సిటీ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్): ఇది.. కొలాజెన్ ఉత్పత్తిని ప్రేరేపించడం ద్వారా ముఖచర్మాన్ని బిగుతుగా చేసే నాన్ సర్జికల్ ఫేస్ లిఫ్ట్ ట్రీట్‌మెంట్. దీన్ని మూడు నెలలకోమారు చేయించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయి. ఖర్చు రూ.30-40 వేలు అవుతుంది.

థ్రెడ్ లిఫ్ట్: ఇది కూడా.. సాగే చర్మాన్ని బిగుతుగా చేసే ఒక తరహా నాన్ సర్జికల్ కాస్మెటిక్ చికిత్స. ఈ చికిత్సలో భాగంగా.. కరిగిపోయే గుణం కలిగిన మెడికల్ గ్రేడ్ దారాలను వాడతారు. ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ చికిత్సకు.. రూ.70 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చవుతుంది. రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ చికిత్స చేయాల్సి ఉంటుంది. మధుమేహం తదితర సమస్యలు ఉన్న వారికి అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

బ్లెఫరో ప్లాస్టీ: కనురెప్పల లోపాలను సరిచేసి, అందంగా కనిపించేలా చేసే శస్త్రచికిత్స. రూ.40 వేల నుంచి రూ. లక్ష దాకా ఖర్చవుతుంది.

ఫేస్ లిఫ్ట్: ముఖచర్మాన్ని బిగుతుగా చేసే శస్త్రచికిత్స. ఈ పద్ధతిలో ముఖం, మెడ సరిచేయడానికి రూ.5-6 లక్షల దాకా ఖర్చవుతుంది.

నల్లగా ఉన్నవారు తెల్లగా మారడానికి..

స్కిన్ లైటెనింగ్‌కి.. అంటే నల్లగా ఉన్న వారు తెల్లగా కావడానికి గ్లూటాథియోన్ అనే చికిత్స అందుబాటులోకి వచ్చింది. నిజానికి గ్లూటాథియోన్ అనేది శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే యాంటాక్సిడెంట్. శరీరంలో మెలనిన్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా చర్మాన్ని తెల్లబరచడానికి దీన్ని ఇప్పుడు ఇంజెక్షన్ల రూపంలో ఇస్తున్నారు. అయితే, ఇది ఎలా పడితే అలా చేసే చికిత్స కాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, అవసరాలను బట్టి ఎంత మోతాదులో దానిని అందించాలన్నది డాక్టర్ నిర్ణయిస్తారు. ఇష్టం వచ్చినట్లు చేస్తే అది ప్రమాదానికి కారణమవుతుంది. ఈ చికిత్స 10-15 సిట్టింగ్స్ తీసుకుంటే ఫలితాలు ఉంటాయి. ఒక్కో సిటింగ్‌కూ రూ.10 వేల దాకా ఖర్చవుతుంది.



మగవారికీ కొన్ని..

మగవారు ఎక్కువగా.. ముక్కు సరిచేసుకునే శస్త్ర చికిత్సతో పాటు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్కువగా చేయించుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అలాగే లైపోసక్షన్ (అధికంగా ఉన్న కొవ్వు తీసివేయడం), గైనకోమాస్టియా (మగవారిలో పెరిగిన రొమ్ము పరిమాణాన్ని తగ్గించే శస్త్ర చికిత్స) కూడా ఎక్కువగా చేయించుకుంటున్నారు.

మార్మోగిన 'రామ'తీర్థం

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

- ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి పట్టువస్త్రాల సమర్పణ



రామతీర్థం సీతారాములకు పట్టువస్త్రాలను తీసుకువస్తున్న మంత్రి కొండపల్లి, చిత్రంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

నెల్లిమర్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వేదికపై వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పెళ్లితంతు సాగింది. ప్రధానంగా జీలకర్ర, బెల్లం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు చల్లుకునే ప్రక్రియలను చూసి భక్తులు ఆనందపరవశులయ్యారు. రామనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయ సంప్రదాయం ప్రకారం.. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వంశపారంపర్య ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజుతోపాటు ఆయన కుమార్తె విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు, రాష్ట్ర ఎస్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ దంపతులు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తదితరులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి.

ఒంటిమిట్టలో సీతారాముడికి ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాలకు వేడుకగా ధ్వజారోహణ





ఒంటిమిట్టలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు; ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ ఘట్టం వేడుకగా జరిగింది. శ్రీరామ నవమి కావడంతో వేకువజామునే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్యలో వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్ర బద్ధంగా గరుడ పటాన్ని ప్రతిష్ఠించి ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. దానికి ముందు గరుడ పటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం అనంతరం సకల దేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. శ్రీరామ నవమి కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఒంటిమిట్టకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

తిరుమలేశుడి సేవలో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు శ్రీవారి క్యాలెండర్ అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి హోదాలో తొలిసారిగా శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం సంప్రదాయ వస్త్రధారణతో కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం-1 కాంప్లెక్స్ క్యూలైన్ ద్వారా మహాద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం మేళతాళాలు, వేదమంత్రాలతో సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన జస్టిస్ ధ్వజస్తంభాన్ని తాకి అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీజేఐకి అర్చకులు శ్రీవారి శేష వస్త్రాన్ని మెడలో ధరింపజేశారు. ఈవో, అదనపు ఈవో.. శ్రీవారి తీర్థప్రసాదాలు, క్యాలెండర్, చిత్రపటాన్ని అందజేశారు.

బాలుడిని చెట్టుకు కట్టి... మర్మాంగం వద్ద ఎర్రచీమలు వదిలి...

- కర్ణాటక రాష్ట్రం దావణగెరె జిల్లాలో ఘటన.. 9మందిపై కేసు

బెంగళూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చోరీ చేశాడని, అసభ్యంగా ప్రవర్తించాడని ఓ బాలుడిని వక్కచెట్టుకు కట్టి, డ్రిప్ పైపులతో దాడి చేశారు. మర్మాంగం వద్ద ఎర్రచీమలను విడిచి హింసించారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరె జిల్లాలో ఈ అమానుష సంఘటన చోటుచేసుకుంది. నల్లూరు పరిధి ని హస్తాపనహళ్లి గ్రామంలో సంచారజాతులకు చెందిన బాలుడిపై అదే సామాజికవర్గానికి చెందిన యువకులు ఈ దాడికి పాల్పడ్డారు. ఇలా బాలుడిపై దాడి చేస్తున్న వీడియోలను తీసుకున్నారు. వీరంతా వనమూలికలు అమ్మి జీవనం సాగించేవారని చన్నగిరి పోలీసులు తెలిపారు. రెండురోజుల క్రితం జరిగిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. బాలుడిని చిత్రహింసలకు గురిచేసిన వీడియో వైరల్ అయింది. బాలుడి తాత ఫిర్యాదుతో దావణగెరె జిల్లా చన్నగిరి పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. సుభాష్ (23), దర్శన్ (22), పరశు(25), లక్కి(21), శివదర్శన్(23), హరీశ్(25), పట్టిరాజు(20), భూని(18), మధుసూదన్(32)పై కేసు నమోదుకాగా, ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

రమణీయం.. భద్రాద్రి రామయ్య కల్యాణం





సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న వేదపండితులు, మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా.. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. దశరథుడు, జనకుడితో పాటు భక్తుల తరఫున రామదాసు చేయించిన మూడు సూత్రాలతో కూడిన మంగళసూత్రాన్ని సీతమ్మ వారికి ధారణ చేశారు. ఉదయం 9.45గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. కళ్యాణం సందర్భంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే వేద పండితులు ఉత్సవమూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మూడు సూత్రాలతో కన్నుల పండువగా మాంగళ్య ధారణ నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రతను తాళలేక అవస్థలు పడ్డారు. చివరిలో కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఏటా శ్రీరామనవమి మరుసటి రోజు జరిగే శ్రీరామ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

సమాజ నిర్మాణానికి శ్రీరాముడే ఆదర్శం

- శ్రీరామపురంలో కుటుంబ సమేతంగా వెంకయ్య

వెంకటాచలం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జాతి, వర్ణ వివక్షలేని సమాజ నిర్మాణానికి శ్రీరాముడే ఆదర్శమని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం శ్రీరామపురం, చవటపాళెం గ్రామాల్లోని శ్రీకోదండరామాలయాలను శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆయన దర్శించుకున్నారు. శ్రీరామపురంలో ఆయన సతీమణి ఉషమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. సమాజంలో ఇంకా అక్కడక్కడా ఉన్న వివక్ష, అసహనం వంటి రుగ్మతలను తొలగించేందుకు శ్రీమద్రామాయణ ఆదర్శాలను పిల్లలకు, యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీరాముడు అంటే దైవస్వరూపం మాత్రమేకాదని, తరతరాలుగా భారతీయులకు జీవన గమనాన్ని బోధిస్తున్న మానవ స్వరూపం కూడా అని, అందుకే శ్రీరాముని జీవితం నుంచి యువత స్ఫూర్తిని పొందాలని పేర్కొన్నారు. శ్రీరాముడి గురించి యుక్తవయసులో తెలుసుకోకపోతే, ఆ తర్వాత తెలుసుకుని ఏం ప్రయోజనమన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.